RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 223 మంగళవారం 11 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## సిరియాలో ప్రతీకార హత్యలు.. ఎక్కడ చూసినా శవాలే..!




- ★ సిరియాలో దాడులు తీవ్రతరం
- ★ గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు
- ★ మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారు
- ★ మార్చి 6 నుంచి 973 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడి

## పన్నులు తగ్గించాలని కోరవద్దు




- ★ జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దు
- ★ పన్నులు తగ్గించడం వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం సాధ్యం కాదు
- ★ ధనవంతుల నుంచి పన్నులు వసూలు చేసి పేదల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ దార్శనికత – కేంద్రమంత్రి గడ్కరీ

## 39 సార్లు కాకుంటే 99 సార్లైనా పోతాం తప్పేంటి?

- బీఆర్ఎస్, బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- కేంద్రమంత్రులు హైదరాబాద్‌కు వచ్చి సమీక్షలు పెడితే కిషన్‌రెడ్డి ఎందుకు రాలేదు
- కేసీఆర్ బాధపడతాడని రాలేదా అని నిలదీత
- కేటీఆర్ చెల్లని రూపాయని వ్యాఖ్యానించిన సీఎం
- అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించాలి
- కేసీఆర్‌ను బండకేసి కొట్టి అధికారంలోకి వచ్చా
- పదేండ్లు కాలంలో కట్టాల్సిన ప్రాజెక్టులు కట్టి ఉంటే ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్ చెల్లని రూపాయని వ్యాఖ్యానించిన సీఎం రాష్ట్రానికి పనికొచ్చే అంశాలను ప్రస్తావించాలని మీడియా ప్రతినిధులకు సూచించారు. మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి అనేక అంశాలను మీడియాతో పంచుకున్నారు.

**అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించాలి :** బడ్జెట్‌లో ప్రాజెక్టులకు కేటాయించే నిధులు పరిమితంగానే ఉంటాయన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని గతంలో మోదీ హామీ ఇచ్చినందునే తాము అడుగుతున్నామని స్పష్టం చేశారు. మెట్రో తానే తెచ్చానన్న కిషన్ రెడ్డి చెబుతున్నందునే తాము నిధులు తీసుకురమ్మని కోరుతున్నట్లు వివరించారు. జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణకు అడ్డు పడుతున్నది ఈటెల రాజేంద్రనేకదా అని ఎదురు ప్రశ్నించారు.

- మిగతా 2 లో

## పాలన చేతగాక ప్రకృతి మీద కూడా నిందలా?




- సర్కారు నిర్లక్ష్యంతోనే ఎండుతున్న పంటలు
- ప్రకృతి వైపరీత్యం కాదు.. ప్రభుత్వ వైఫల్యం
- కేసీఆర్ ఇచ్చిన నీళ్ల రేవంత్ రాంగనే మాయమా?
- వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండినయ్
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్


## ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విజయశాంతి




- ఏనాడూ ఇది కావాలని పార్టీని అడగలేదు
- కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేశా
- రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు నేను తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చా

## ప్రణయ్ కేసులో ఒకరికి ఉరి.. ఆరుగురికి జీవితఖైదు

- ప్రణయ్ హత్య కేసులో నల్గొండ
- ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు
- ఏ2 సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధింపు
- మిగిలిన నిందితులకు జీవిత ఖైదు
- 6 ఏళ్లకు పైగా కోర్టులో విచారణ
- ప్రణయ్ హత్య కేసులో ఏ1గా ఉన్న నిందితుడు మారుతీరావు 2020లో ఆత్మహత్య
- న్యాయస్థానం తీర్పుతో నేరస్తులకు కనువిప్పు కలగాలి ప్రణయ్ తండ్రి పెరుమాల బాలస్వామి




## దేశవ్యాప్తంగా శ్రీచైతన్య కాలేజీలపై ఐటీ సోదాలు






- ‣ సోమవారం ఏక కాలంలో శ్రీచైతన్య కాలేజీల కార్పొరేట్ కార్యాలయాలపై దాడులు
- ‣ పలు నగరాల్లో కళాశాలలు,కార్యాలయాల్లో సోదాలు
- ‣ ఇప్పటివరకు రూ.2.5కోట్ల నగదు గుర్తించినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడి
- ‣ పెద్ద మొత్తంలో అక్రమలావాదేవీలు జరిగినట్లు గుర్తింపు

## తెలంగాణలో గ్రూప్-1 పరీక్ష ఫలితాలు విడుదల

- గ్రూప్– 1,2, 3 మెయిన్స్ పరీక్షల ప్రొవిజనల్ మార్కులు వెల్లడి
- మార్చి 10 నుంచి 18 మధ్య గ్రూప్స్ ఫలితాలు
- రీకౌంటింగ్‌కు ఈ నెల 24 వరకు అవకాశం
- 563 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ పరీక్షలు నిర్వహణ
- ఈనెల 24 వరకు అవకాశం ఇచ్చిన టీజీపీఎస్సీ రూ.1000 చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు
- గ్రూప్–1 పోస్టులపై తప్పుడు వార్తలను ఖండించిన టీజీపీఎస్సీ
- ఎలాంటి తప్పులు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నాం

తెలంగాణలో గ్రూప్–1 పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన ప్రొవిజనల్ మార్కులను టీజీపీఎస్సీ విడుదల చేసింది. టీజీపీఎస్సీ కమిషన్ అధికారిక వెబ్‌సైట్లో అభ్యర్థులు తమ లాగిన్ వివరాలతో మార్కులు చూసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు ఈనెల 24 వరకు అవకాశం ఇచ్చిన టీజీపీఎస్సీ రూ.1000 చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. రీకౌటింగ్ తర్వాత జనరల్ ర్యాకింగ్ జాబితా ప్రకటించనుంది.

- మిగతా 2 లో

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY





# పన్నులు తగ్గించాలని కోరవద్దు



జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పరిశ్రమ వర్గాలకు సూచించారు. పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వానికి నిధులు అవసరం కాబట్టి..జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కోరారు. ఒకవేళ పన్నులు తగ్గిస్తే.. మరింత తగ్గించాలని కోరతారని, ఇది మనుషుల మనస్తత్వమని ఆయన వ్యాఖ్యానించారు. తాము కూడా పన్నులు తగ్గించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నామని..కానీ దాని వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు.

**జాతీయ విద్యా విధానంపై ఆందోళన.. లోక్‌సభలో డీఎంకే – భాజపా**

ధనవంతుల నుంచి పన్నులు వసూలు చేసి..పేదల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ దార్శనికత అని మంత్రి అన్నారు. దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9 శాతానికి తగ్గుతుందని పరిశ్రమ వర్గాలకు మంత్రి హామీ ఇచ్చారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8 శాతం ఉండగా.. యూఎస్, ఐరోపా దేశాల్లో 12 శాతం ఉందని తెలిపారు. మూలధన పెట్టుబడులను పెంచడం ద్వారా భవిష్యత్తులో దేశంలో మరిన్ని ఉద్యోగాలను సృష్టించవచ్చన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి దిగుమతులను తగ్గించి ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగానామినేషన్ దాఖలు చేసిన విజయశాంతి



ఒక ఆలోచన.. ముందుచూపుతో రాష్ట్ర ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయశాంతి అన్నారు.ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేర్చుతుందని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు."నేను గతంలోనూ కాంగ్రెస్‌లో పనిచేశాను. కానీ, ఏనాడూ ఇది కావాలని పార్టీని అడగలేదు. పార్టీ హైకమాండ్ నాకు అవకాశం ఇచ్చినా.. నాకు వద్దు.. నేను ముందు పనిచేస్తా అని అన్నాను. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు నేను తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చాను. పార్టీ హైకమాండ్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలనుకుంటుందో అదే ఇస్తుంది. పార్టీలో ఉన్నవారందరూ కాస్త ఓపిక పట్టాలి. పార్టీ నాకు ఎప్పుడు బాధ్యతలు అప్పగిస్తుందో.. అప్పుడే మాట్లాడాలి.. పని చేయాలి అని అనుకున్నాను. అవకాశం కోసం ఎదురు చూశాను. కాంగ్రెస్ పార్టీలో ఒక సిస్టమ్ ఉంది. అది మీరకుండా ప్రతిఒక్కరూ పనిచేయాల్సి ఉంటుంది. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా పోరాడుతాం" అని అన్నారు.

# దేశవ్యాప్తంగా శ్రీచైతన్య కాలేజీలపై ఐటీ సోదాలు




మాదాపూర్‌లోని శ్రీచైతన్య కార్యాలయంలో ఐటీ సోదాలు – హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, విశాఖలో పరిశీలన – ఇప్పటివరకు రూ.2.5కోట్ల నగదు గుర్తించినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడి. దేశంలోని పలు నగరాల్లోని శ్రీ చైతన్య కళాశాలలు, కార్పొరేట్ కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయి. మాదాపూర్ శ్రీచైతన్య కార్పొరేట్ ఆఫీస్‌లో ఐటీ అధికారులు విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నారు. బృందాలుగా విడిపోయి ఆదాయపన్నుశాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. పన్నుల చెల్లింపులు, ఆదాయ వ్యయాలపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు.శ్రీచైతన్య విద్యాసంస్థల రికార్డులు ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఉదయం నుంచి శ్రీచైతన్య విద్యాసంస్థల లావాదేవీలు సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. దేశవ్యాప్తంగా 5 నగరాల్లో శ్రీచైతన్య సంస్థల రికార్డులు పరిశీలన జరుగుతోంది. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై, విశాఖలో పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు రూ.2.5కోట్ల నగదు గుర్తించినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. ఆదాయపన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఆధారాలు లభిస్తే తనిఖీలు నిర్వహిస్తామని ఐటీ అధికారులు తెలిపారు.ఏపీ,తెలంగాణ చెన్నై,బెంగళూరు,ఢిల్లీ,ముంబై నగరాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. పెద్ద మొత్తంలో అక్రమలావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. శ్రీచైతన్య సంస్థ పన్నులు ఎగవేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.హైదరాబాద్ ప్రధానంగా మొత్తం ఆరు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న శ్రీచైతన్య యాజమాన్యం పెద్ద మొత్తంలో అక్రమలావాదేవీలు జరుపుతుందనే సమాచారంతో ఐటీ అధికారులు సోమవారం ఏక కాలంలో శ్రీచైతన్య కాలేజీల కార్పొరేట్ కార్యాలయాలపై దాడులు చేశారు.విద్యార్థుల నుంచి నగదు రూపంలో డబ్బులు తీసుకుని ట్యాక్స్ చెల్లించకుండా ఎగవేతకు పాల్పడినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ ఐటీ రైడ్ నిర్వహించినట్లు సమాచారం. ఐటీ అధికారుల సోదాల్లో భారీ ఎత్తున అక్రమ లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

# సిరియాలో ప్రతీకార హత్యలు.. ఎక్కడ చూసినా శవాలే..!



మొదటిపేజీ తరువాయి

సిరియాలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు చోటుచేసు కొన్నాయి. చాలా ప్రాంతాల్లోని మైనార్టీలైన అలావైట్లను అణచివేసే దిశగా ఈ దాడులు జరుగుతున్నాయి. గురువారం అసద్ మద్దతుదారులపై హెచ్‌టీఎస్ ప్రభుత్వానికి అనుకూల సాయుధులు దాడులు చేయడంతో ఘర్షణలు మొదలయ్యాయి.ఈ క్రమంలో అసద్ మద్దతుదారులను వెతికి మరీ చంపుతున్నట్లు ఓ బాధితుడు వెల్లడించాడు. వీధుల్లో శవాలు పడి ఉన్నాయని.. మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బనియాస్ అనే ప్రాంతంలో రోహిబ్ కమెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి బాత్రూమ్‌లో దాక్కొని ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఈ విషయాన్ని అతడే వెల్లడించాడు. "మా పొరుగు వారిపై సాయుధ మిలిటెంట్లు దాడులు చేస్తుండటంతో.. మేము లైట్లు ఆర్పేసి.. దాక్కొన్నాము. వీధుల్లో మృతదేహాలున్నాయి. ఈ పిల్లలు ఏం తప్పు చేశారు. అసద్ పాలన అంతం కావడానికి వీరు కూడా మద్దతు పలికారు" అని వెల్లడించాడు. ఇంటిలోకి సాయుధులు చొచ్చుకొచ్చి తన ఇద్దరు సోదరులు, అల్లుడిని హత్య. వాస్తవానికి అతడు అలావైట్ వర్గానికి చెందినా.. సుదీర్ఘకాలంగా అసద్‌ను వ్యతిరేకిస్తూ వచ్చాడు. దాదాపు పదేళ్లు జైల్లో గడిపాడు.ఇక రేవు నగరమైన లటాకియాలో పరిస్థితి ఘోరంగా ఉంది. అక్కడ ప్రభుత్వ సాంస్కృతిక కేంద్రం అధిపతి యాసిర్ సబౌహ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. అతడి ఇంటి ఎదుటే మృతదేహాన్ని పడేశారు. ఈ తీర ప్రాంత నగరంలో అలావైట్లు అత్యధికంగా ఉంటారు. ప్రస్తుతం అక్కడే అత్యధిక హింస చోటుచేసుకుంటోంది. మొత్తంగా మార్చి 6 నుంచి ఈ హింసలో 973 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. మరోవైపు దేశంలో తాజాగా చెలరేగిన హింసపై దర్యాప్తు చేస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అదే సమయంలో అసద్ వర్గానికి చెందినవారు, విదేశీ శక్తుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. ప్రస్తుతం తాము సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నామన్నారు. సరికొత్త ముప్పును తాము ఎదుర్కొంటున్నామన్నారు. తమ దేశాన్ని అంతర్యుద్ధం దిశగా లాగుతున్నారన్నారు. సిరియాలో అలావైట్లు మతపరమైన మైనారిటీలు.. దేశ జనాభాలో వారు 12శాతం ఉంటారు. వారి మూలాలు షియా ముస్లింలలో ఉన్నాయి. అయితే వారి విశ్వాసాలు, పద్ధతులు భిన్నంగా ఉంటాయి. చారిత్రకంగా చూస్తే అలావైట్లు.. సిరియా తీర ప్రాంతంలో ఉంటారు. అదీ లటాకియా, టార్టస్‌లలో అధికంగా ఉంటారు. సిరియాను ఐదు దశాబ్దాలపాటు పాలించిన అసద్ కుటుంబం అలావైట్ల వర్గానికి చెందినదే. గత డిసెంబరు వరకు వారిదే ఆధిపత్యం. అసద్ పాలనలో అలావైట్లు కీలక స్థానాల్లో కొనసాగారు. సైన్యంలో, ప్రభుత్వంలో వారిదే పైచేయి.

# ప్రణయ్ కేసులో ఒకరికి ఉరి.. ఆరుగురికి జీవితఖైదు




మొదటిపేజీ తరువాయి

ప్రణయ్ హత్య కేసులో నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ2 అయిన సుభాష్ శర్మకు న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. మిగిలిన నిందితులకు జీవిత ఖైదు ఖరారు చేసింది. తన కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్నాడనే నెపంతో మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారుతీరావు అనే వ్యక్తి 2018 సెప్టెంబర్ 14న సుపారీ గ్యాంగ్‌తో యువకుడు ప్రణయ్‌ను హత్య చేయించాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు విచారణ పూర్తి చేసి, 8 మందిని నిందితులుగా పేర్కొంటూ న్యాయస్థానంలో 2019లో ఛార్జిషీట్ దాఖలు చేశారు. 6 ఏళ్లకు పైగా కోర్టులో విచారణ సాగగా, ఇటీవలే వాదనలు ముగిశాయి. తాజాగా ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. సంచలన తీర్పును వెలువరించిన కోర్టు : ప్రణయ్ హత్య కేసులో ఏ1గా ఉన్న నిందితుడు మారుతీరావు 2020లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కేసులో ఏ2 సుభాష్ కుమార్ శర్మ, ఏ3 అస్గర్‌అలీ, ఏ4 బారీ, ఏ5 కరీం, ఏ6 శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాంలు మిగిలిన నిందితులుగా ఉన్నారు. వీరిలో సుభాష్ శర్మకు బెయిల్ రాకపోవడంతో జైల్లోనే ఉండగా, అస్గర్ అలీ వేరే కేసులో జైలులో ఉన్నాడు. మిగిలిన వారందరూ బెయిల్ మీద బయటకు వచ్చారు. అనారోగ్య సమస్యలు ఉన్నాయని, తమపై ఆధారపడిన తల్లిదండ్రులు, పిల్లల కోసం శిక్ష తగ్గించాలని నిందితులు న్యాయస్థానాన్ని వేడుకున్నారు. తనకు ఈ కేసుతో సంబంధం లేదని అమృత బాబాయ్ శ్రవణ్ కుమార్ అన్నారు. ముగ్గురు పెళ్లికాని పిల్లలు ఉన్నందున దయచూపాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. వారందరికీ ఈ తీర్పు గుణపాఠం కావాలి : ప్రణయ్ హత్య కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు నేపథ్యంలో ప్రణయ్ తండ్రి పెరుమాల బాలస్వామి స్పందించారు. తన కుమారుని పరువు హత్యపై నల్గొండలో ఈరోజు న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో నేరస్తులకు కనువిప్పు కలగాలని అన్నారు. న్యాయం కోసం జస్టిస్ ఫర్ ప్రణయ్ అంటూ పోరాటం చేశామని అన్నారు. ఈ హత్య తర్వాత చాలా పరువు హత్యలు జరిగాయని వారందరికీ ఈ తీర్పు గుణపాఠం కలగాలని బాలస్వామి అన్నారు.'మేము ప్రణయ్ హత్య ద్వారా చాలా కోల్పోయాం. అమృతకు భర్త లేడు. నాకు కొడుకు లేడు. నా మనువడికి నాన్న లేడు' అని ప్రణయ్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష మిగతా ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష పడిందని ఈ క్రమంలో వారి కుటుంబాలు కూడా బాధపడుతుంటాయని, తనకు ఎవరిపై కోపం లేదన్నారు. వారు కూడా ఈ రకమైన హత్యలకు పాల్పడడం విచారకరమని ప్రణయ్ తండ్రి అన్నారు. ఇలాంటి విషయాల్లో ఏదైనా ఉంటే చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ తీర్పుతో పరువు హత్యలు ఆగిపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇదీ జరిగింది : మారుతీరావు కుమార్తె అమృతను ప్రణయ్ అనే యువకుడు 2018 జనవరిలో హైదరాబాద్‌లో ప్రేమపెళ్లి చేసుకున్నాడు. వీరి వివాహంతో రెండు కుటుంబాల మధ్య విభేధాలు వచ్చాయి. దీంతో ఇరు కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలోనే తాను ప్రణయ్‌తోనే ఉంటానని పోలీసుల సమక్షంలో అమృత తేల్చిచెప్పింది. 2018 సెప్టెంబరు 14న వైద్య పరీక్షల కోసం భర్త ప్రణయ్?, అత్త ప్రేమలతతో కలిసి అమృత ఆస్పత్రికి వెళ్లింది. హాస్పిటల్? నుంచి తిరిగి వెళ్తుండగా ప్రణయ్?ను దుండగులు కత్తితో నరికారు. దీంతో ఘటనా స్థలంలోనే అతడు ప్రాణాలు కోల్పోయాడు.

# పాలన చేతగాక ప్రకృతి మీద కూడా నిందలా ?

మొదటిపేజీ తరువాయి

రూపాయి కూడా ఇవ్వకుండానే మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చినట్టు చెప్పి మహిళలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేసిండ్రు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో పరేడ్ గ్రౌండ్ సాక్షిగా ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు చెప్పిండ్రు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలైనా పట్టించుకుంటలేరు.బీఆర్ఎస్ ప్రభుత్వం సూల్ యూనిఫాంల కుట్టుకూలి రూ.50 ఇస్తే రూ.75కు పెంచినట్టు రేవంత్‌రెడ్డి మరో అబద్ధం చెప్పిండ్రు. యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలిచ్చినట్టు డబ్బా కొడుతున్నరు. అనేక మంది అధికారులను, మహిళా సంఘాలను అడిగిన. కేసీఆర్ సర్కారు ఇచ్చినట్టు రూ.50 మాత్రమే ఇచ్చిండ్రని చెప్పిండ్రు. రూ.75 ఇచ్చింది నిజమైతే ఏ ఊరిలో ఇచ్చిండ్రో చూపించు!ఎండల వల్ల పంటలు ఎండుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు భగ్గుమన్నారు. పాలన చేతగాక ప్రకృతి మీద కూడా రేవంత్‌రెడ్డి నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. 'ఎండలకు పంటలు ఎండుతున్నయట! కేసీఆర్ ఉన్నప్పుడు ఎండలు లేవా? ఎండలు ముందు పుట్టినయా? రేవంత్ ముందు పుట్టిండా?' అని ఎద్దేవాచేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, రేవంత్ తెచ్చిన కరువని మండిపడ్డారు. 'ఒకవైపు ఏపీ మొత్తం నీళ్లు తీస్కపోయింది. దేవాదులలో కావల్సినన్ని నీళ్లున్నయి. మోటర్లు ఆన్ చేయలేదు. వరంగల్ జిల్లాల్లో లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతున్నది. రూ.7 కోట్ల బిల్లులు ఇవ్వలేదని దేవాదుల వద్ద కార్మికులు సమ్మె చేసిండ్రు. 32 రోజులు మోటర్లు ఆన్ చేయలేదు. నీళ్లన్నీ కిందికి పోయినయి. కేసీఆర్ హయాంలో నీళ్లు రాంగనే మోటర్లు వేసేవారు. కాంగ్రెస్ సర్కారు కమీషన్లు కుదరక రూ.7 కోట్ల బిల్లు ఇవ్వలేదు. కేసీఆర్ హయాంలో ఎండాకాలంలో చెరువులు మత్తళ్లు దుంకేవి. కాల్వలు నీళ్లతో కళకళలాడేవి. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, రేవంత్ వైఫల్యం. బేలగా మాట్లాడి తప్పించుకోలేరు' అంటూ నిప్పులు చెరిగారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. తెలంగాణభవన్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్ర ఆనంద్‌తో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు.

**రేవంత్ తరహాలోనే భట్టి :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం సీఎం రేవంత్‌రెడ్డి తరహా అబద్ధాలు మాట్లాడుతున్నారని హరీశ్ విమర్శించారు. 'భట్టి గారంటే నాకు గౌరవం. రాజకీయాల్లో కొద్దో గొప్పో విలువలు కలిగిన నాయకుడనే పేరుంది. రేవంత్‌రెడ్డి దుష్ట సావాసంతో ఇప్పుడు భట్టి కూడా చెడిపోయారు. బాడీ షేమింగ్ చేయడం, అబద్ధాలు మాట్లాడటంలో రేవంత్‌తో పోటీ పడుతున్నరు.' అని అన్నారు.

**రేవంత్‌రెడ్డిదే పైశాచికానందం! :** 'పైశాచికానందం ఎవరిది రేవంత్‌రెడ్డీ?' అని హరీశ్ నిలదీశారు. 'హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టించి.. లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేసి.. ఆశా వర్కర్లను పోలీసులతో కొట్టించి.. పేరు మర్చిపోయిండని అల్లు అర్జున్‌ను అరెస్టు చేయించి.. నిరుద్యోగుల వీపులు పగలగొట్టించి.. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా పైశాచికానందం పొందింది నువ్వు. అధికారంతో కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నవ్' అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

**కేసీఆర్ ముందుచూపుతోనే ఖమ్మం సస్యశ్యామలం :** కేసీఆర్ ముందుచూపుతోనే గోదావరి జలాలు సాగర్ ఎడమ కాల్వలో తాజాగా కలిశాయని, ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతున్నదని హరీశ్ చెప్పారు. 'కృష్ణా నది జలాలను ఏపీ తరలిస్తే, నేడు ఖమ్మం ప్రజలకు సీతారామ సాగర్ వరమైంది. కృష్ణా, గోదావరి సంగమం ఈ రోజు కేసీఆర్ వల్ల సాధ్యమైంది. ఖమ్మం రైతాంగానికి నీరు సరఫరా అవుతున్నది' అని పేర్కొన్నారు.

**మహిళా సంఘాలకు లక్ష కోట్ల రుణాలిచ్చినం :** బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలిచ్చినట్టు హరీశ్ స్పష్టంచేశారు. ఒక 2022–23లోనే రూ.13 వేల కోట్లు ఇచ్చినట్టు చెప్పారు. 'మేం అధికారంలోకి వచ్చే నాటికి అప్పటి కాంగ్రెస్ రూ. 2 నుంచి 3 వేల కోట్లు మాత్రమే ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం సెర్ప్, మెప్మా, స్త్రీనిధి ద్వారా మొత్తం లక్ష కోట్ల రుణాలిచ్చినం. మీకు చేతనైతే రూ.2 లక్షల కోట్ల రుణాలివ్వండి. అంతేకాని అడిగేవారు లేరనుకొని ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. నేను చెప్పింది తప్పయితే అసెంబ్లీలో చర్చ పెట్టు. ఏ ఏడాది ఎంత ఇచ్చినమో లెకలతో సహా చెప్తా. నేను ఆర్థిక మంత్రిగా పని చేసిన. పచ్చి అబద్ధం మాట్లాడుతున్నవు.. ఇదేం చిల్లర రాజకీయం?' అని హరీశ్ నిప్పులు చెరిగారు.

# 39 సార్లు కాకుంటే 99 సార్లైనా పోతాం తప్పేంటి?

మొదటిపేజీ తరువాయి

భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నప్పుడు కేంద్ర అధికారులుకానీ, మంత్రులుకానీ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి చర్చించాలి కదా అని నిలదీశారు. కేంద్ర మంత్రులు హైదరాబాద్ వచ్చి సమీక్షలు పెడితే కూడా ఎందుకు కిషన్ రెడ్డి హాజరు కావడంలేదని నిలదీశారు. మాజీ సీఎం కేసీఆర్ బాధపడతాడనే కిషన్ రెడ్డి రాలేదా ? అని నిలదీశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధినే అన్ని ప్రాంతాలకు విస్తరించాలని తాము భావిస్తున్నామని పేర్కొన్నారు.

**కేసీఆర్‌ను బండకేసి కొట్టి అధికారంలోకి వచ్చా :** తాము కులగణన చేసినందునే ఇతర పార్టీలు సైతం సామాజిక సమతుల్యత పాటించాల్సి వచ్చిందని సీఎం పేర్కొన్నారు. తాము 39 సార్లు కాకుంటే 99 సార్లు పోతాం ఢిల్లీకి పోతాం తప్పేంటని ప్రశ్నించారు. రాష్ట్రానికి నిధులు రాకూడదని బీఆర్ఎస్ చూస్తోందని ఆరోపించారు. సందర్భం వచ్చినప్పుడు తాము ఢిల్లీలో ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్?పై విమర్శలు చేయడానికి ప్రత్యేక హోదా ఎందుకని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి స్థాయిలో తాను సరిపోనా అని నిలదీశారు. **ఏపీతో సమస్య వచ్చేది కాదు :** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.7.11 లక్షల కోట్లు మొత్తానికి నెలకు రూ.6500 కోట్లు అప్పులు కడుతున్నామన్నారు. రెండో పంట సాగు అంచనాకు మించి 55లక్షల హెక్టర్లలో సాగు అయ్యినట్లు వివరించిన సీఎం అందుకే అక్కడక్కడ నీటి కొరత ఏర్పడిందన్నారు. మేడిగడ్డ నీరు లేకుండానే అత్యధికంగా పంట సాగు చేసామన్న ఆయన తాను చెప్పేది అంతా అధికారిక లెక్కనేనని వివరణ ఇచ్చారు. పదేండ్లు కాలంలో కట్టాల్సిన ప్రాజెక్టులు కట్టి ఉంటే ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదని వ్యాఖ్యానించారు.మంద కృష్ణ మాదిగ అంటే తనకు గౌరవమే కానీ బీజేపీ నాయకుడిలా ఆయన మాట్లాడితే ఎలా అని నిలదీశారు. గతంలో ఎప్పుడో ఇచ్చిన నోటిఫికేషన్లకు ఇప్పటి ఎస్సీ వర్గీకరణ వర్తించదని, ఏదైనా చెయ్యాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని వివరించారు. తాను వర్గీకరణ చేస్తే ఏలా అన్యాయం జరిగిందని నిలదీశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో తనకు తెలియదని వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో గ్రూప్-1 పరీక్ష ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి

గతేడాది అక్టోబర్ చివరి వారంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు పూర్తి అయ్యాయి. గ్రూప్- 1 పరీక్షలు 21,093 మంది అభ్యర్థులు రాశారు. 563 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.మార్చి 10 నుంచి 18 మధ్య గ్రూప్స్ ఫలితాలు : తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్స్ ఫలితాల వెల్లడికి రూపొందించిన షెడ్యూల్‌ను ఈ నెల 7న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. మార్చి 10 నుంచి 18 మధ్య గ్రూప్-1, 2, 3 ఫలితాలను వెల్లడించనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. ఇందులో భాగంగా మార్చి 10న గ్రూప్-1 ఫలితాలు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం మార్చి 10న గ్రూప్-1 ఫలితాల విడుదల, అదే రోజు అభ్యర్థుల ప్రొవిజినల్ మార్కుల వివరాలనూ టీజీపీఎస్సీ వెల్లడించనుంది. అనంతరం ఆయా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. ఈ నెల 11న గ్రూప్-2 జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించనుంది. మార్చి 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను కమిషన్ వెల్లడించనుంది. 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తుది ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేయనుంది.అభ్యర్థులు ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు : గ్రూప్-1 పోస్టులపై తప్పుడు వార్తలను టీజీపీఎస్సీ ఖండించింది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఈ నెల 5న టీజీపీఎస్సీ ఫిర్యాదు చేసింది. తప్పుడు వార్తలపై పోలీసులకు టీజీపీఎస్సీ అధికారులు ఫిర్యాదు చేశారు. గ్రూప్-1 మార్కుల జాబితాను వెబ్‌సైట్‌లో పెడతామని టీజీపీఎస్సీ వెల్లడించింది. అభ్యర్థుల లాగిన్‌లో పేపర్ల వారీగా మార్కులు ఉంచుతామని, గ్రూప్-1 నియామక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఎలాంటి తప్పులు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని టీజీపీఎస్సీ విజ్ఞప్తి చేసింది.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 11 - 03 - 2025

# మిలియన్ మార్చ్ డే విజయవంతం

**గన్ పార్క్ వద్ద అమర వీరులకు నివాళులు అర్పించిన మేధావులు ప్రజాసంఘాలు, పార్టీలు, ఉద్యమనాయకులు**



**హైదరాబాద్ తెలంగాణ సేన న్యూస్ 10 :** తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మిలియన్ మార్చ్ డే విజయవంతం అయ్యింది. జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి,సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి లు గ్రేట్ మిలియన్ మార్చ్ డే కి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులు,మేధావులు, తెలంగాణ ఉద్యమ కారులు పెద్ద ఎత్తున హైదరాబాద్ లోని గన్ పార్క్ కు తరలి వచ్చి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ కోదండరాం, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, బీవరేస్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, విమలక్క, అడ్వకేట్ జేఏసీ రాజేందర్ రెడ్డి,న్యూ డెమోక్రసి గోవర్ధన్, పి ఓ డబ్ల్యూ సంధ్యక్క, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, కత్తి వెంకటస్వామి,చెరుకు సుధాకర్, కోతి మాధవి రెడ్డి, అడ్వకేట్ జేఏసీ రాజేందర్ రెడ్డి, చీమ శ్రీనివాస్, మోహన్ బైరాగి,మురళీధర్ దేశ్ పాండే, షోయబ్ ఉల్లా, కరుణాకర్ రెడ్డి, మార్వాడి సుదర్శన్, కంచర్ల బద్రి, కొండా స్వామి, డోలక్ యాదగిరి,వి యాదగిరి, బత్తుల సోమయ్య, బోగే పద్మ, కప్పర ప్రసాద్, బోయపల్లి రంగారెడ్డి, బండి రమేష్, బండకింది సింగరాయ గౌడ్, కే రాజేంద్ర ప్రసాద్, అంజలి కుమారి, లక్ష్మి కాంతమ్మ, సుజ్జి, స్వరూప రాణి, కవిత,పిడమర్తి లింగయ్య, సైదులు, సుల్తానా, గుండా యాదగిరి, నాచాం శంకర్, తదితర ఉద్యమనాయకులు పాల్గొని అమరవీరులకు నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ...తెలంగాణ ఉద్యమానికి కీలక భూమిక అయిన మిలియన్ మార్చ్ డే ను గుర్తు చేసుకోవడం చారిత్రక అవసరం అని, 2011 మార్చి 10 న తెలంగాణ ఆకాంక్షను ఎలిగెత్తి చాటిన రోజు అని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ట్యాంకుబండు కు లారీలు, తూటాలను లెక్కచేయకుండా లక్షలాది మంది హైదరాబాదు నగర నడిబడ్డైన ట్యాంక్ బండ్ కు చేరుకొని ఉద్యమ స్ఫూర్తిని నింపిన రోజని చెప్పారు. దాదాపు లక్ష మందిని పోలీసులు అరెస్ట్ చేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు,ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలని తెలిపారు.

# పుష్పగిరి కంటి ఆసుపత్రిలో నీటి కాసుల వ్యాధి అవగాహన వారోత్సవాలు




**కంటోన్మెంట్,తెలంగాణ సేన న్యూస్ 10 :** సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆసుపత్రి లో సోమవారం "గ్లాకో మా (నీటి కాసుల వ్యాధి) అవగాహన వారోత్సవాలు" ప్రారంబ ;మైయ్యాయి. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఎన్‌పిసిబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ...." గ్లాకోమా కారణంగా అంధత్వాన్ని నివారించడానికి పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు అవగాహన కల్పించడం ఎంతో సంతోషకరమన్నారు. పట్టణ ప్రజలే కాకుండా మారు మూల గ్రామీణ ప్రాంతాల్లోనీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, నాణ్యమైన వైద్యాన్ని అందించడం ఎంతో అభినందనీయమన్నారు. మార్చి 10 వ తేదీ నుండి 15 వ తేదీ వరకు నీటి కాసుల వ్యాధి అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్లాకోమా స్పెషలిస్ట్ డాక్టర్ షబానా భారతి, పుష్పగిరి కంటి ఆసుపత్రి చైర్మన్ గోవింద హరి లు వెల్లడించారు.

# మనిషి ఆలోచనలు సానుకూలంగా ఉండాలి

**విజయవంతంగా జరిగిన డెక్కన్ పాజిటివ్ మెంటల్ హెల్త్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ జాతీయ సమావేశం**



**సనత్ నగర్, తెలంగాణ సేన, న్యూస్ మార్చి 10 :** మనిషి ఆలోచనలు పాజిటివ్ దృక్పథంతో ఉన్నప్పుడే మానసిక ఆరోగ్యం కూడా బాగుంటుందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సురేష్ కుమార్ మురుగేషన్ అన్నారు. 'దక్కన్ పాజిటివ్ మెంటల్ హెల్త్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్' మొదటి జాతీయ సమావేశం విజయవంతంగా ముగిసింది.ప్రముఖ సైకాలజీస్ట్, ప్రొఫెసర్ పి జ్యోతి రాజా, అధ్యక్షతన 'మైండ్ స్కేప్స్, సైకాలజీ ఫర్ ద నెక్స్ట్ జనరేషన్' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సునంద రవి స్వాగత ఉపన్యాసం చేశారు. అనంతరం దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి హాజరైన సైకాలజిస్టులు డాక్టర్ బి.కె పాండియమణి,డాక్టర్ నేహా గాల, డాక్టర్ శ్రీపియా షాజీ, డాక్టర్ సుబ్రహ్మణ్యం, గోపాల్ రాజ్యలక్ష్మి, రాజేంద్ర కుమార్ కపూర్ లు పలు కీలకమైన అంశాలపై ప్రజెంటేషన్ లతో పాటు తమపై అభిప్రాయాలను వివరించారు. అసోసియేషన్ ప్రతినిధులు పి.దినకర్ రావు, కీర్తి సుధామణి, కళ్యాణి గరిమెళ్ళ, మధురిమ మోపిదేవి, డాక్టర్ అర్చన వేదాంతం, జి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన వారందరికీ సర్టిఫికెట్లను అందజేసి, అభినందనలు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 50 ఆకుల తునికాకు కట్టకు రూ.15/- చెల్లించాలి


**కాంట్రాక్టర్లకు సముచితమైన రేట్లకు టెండర్లను కేటాయించాలి**

**సకాలంలో ప్రూనింగ్ పనులు చేపట్టాలి**

**తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ డిమాండ్**

**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 సీజన్లో తునికాకు సేకరణను కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లు వేసి వెంటనే ప్రూనింగ్ పనులు చేపట్టాలని 50 ఆరులతోడిన బొట్టును రూ. 15/- ప్రభుత్వ ధరగా నిర్ణయించాలన్నారు. కొన్నేండ్లుగా పెండింగులో వున్న బోడనను ఆశుసేకరణకు ముందే ఆదివాసులు చెల్లించాలని డిమాండ్ చేశారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపులలో అవకతవకలు, అవినీతి, అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయి. వీటిపై సమగ్ర విచారణ ఇది అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం వసినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తునికాకు రేటును. పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్ ను పూర్తిచేయడంతో పాటు, కూలీలకు ప్రభుత్వానికి కాంట్రాక్టర్లకు ఆదాయం పెరుగుతుందన్నారు. బహంక ఆదాయలకు అవకాశం వుస్తు తునికాకు సేకరణకు ఏర్పాట్లను త్వరితగతన పూర్తిచేయాలన్నారు. తునికాకు సేకరణ సందర్భంలో సంభవించే అన్ని రకాల ప్రమాదాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారిరి రూ. 30 లక్షల ఎక్స్రేషియా చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఇవ్వాలి,తెలంగాణ రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఆదివారీలు, గిరిజనులు పేద ప్రజలు తునిగారు 'సేకరణపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయం తర్వాత రెండవ ఆదాయం తునికాకు పేకరణ తెలంగాణ రాష్ట్రంలో 196 యూనిట్లు వున్నాయి. ఆకు కొరతగా ఏర్పడుతున్న నేది పరిస్థితుల్లో తునికాకు కోతకు సంబంధించిన అన్ని పనులకు రూలీ రేట్లు, తల్లినార్లు, గిద్దావర్ల జీతాలు, లోడింగ్ అన్ లోడింగ్ వంటి అన్ని రకాల పనులకు, స్త్రీ - పురుషలకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి శ్రమ తగ్గరగా ప్రభుత్వమే రేటు పెంచాలి.అమలు చేయించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ కన్వీనర్ రచమోని నాగభూషణం ,కో కన్వీనర్ మెంతేన సంజీవరావు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసారు.

# బస్సులో మర్చిపోయిన మొబైల్ ఫోన్ అందజేసిన నర్సంపేట డిపో ఉద్యోగులు



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** తేదీ10/03/2025(సోమవారం)రోజున నర్సంపేట డిపో కి చెందిన %+ 03%0008 ఎక్స్ ప్రెస్ బస్సు భద్రాచలం నుండి నర్సంపేట కి వస్తున్న క్రమంలో కురవి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన కల్లెపు పుష్పమ్మ అనే ప్రయాణికురాలు ఉదయం బయ్యారం లో బస్సు ఎక్కి మహబూబాబాద్ బస్టాండ్ రాగానే బస్సులో తన మొబైల్ ఫోన్ సుమారు 15000వేల విలువగలది మర్చిపోయారు. అది గమనించిన కండక్టర్ స్వామి, డ్రైవర్ దస్తగిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ భవానీ సమక్షంలో నర్సంపేట సెక్యూరిటీ విభాగం వద్ద ప్రయాణికురాలు బంధువు కల్లెపు వెంకట్ గౌడ్ కి అందజేయడం జరిగింది. కండక్టర్, డ్రైవర్ ని డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో ఖలీల్, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పేదల విద్యకు పెద్ద పీట వేస్తున కాంగ్రెస్ ప్రభుత్వం: వేముల

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి 200 కోట్లు మంజూరి**

**నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన :వేముల సాంబయ్య గౌడ్**



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి 200 కోట్లను రూపాయలు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,నర్సంపేట శాసనసభ్యులు మాధవ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన నర్సంపేట మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల సాంబయ్య గౌడ్. ఈ సందర్భంగా వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా పేదల విద్య పై చిత్తశుద్ధితో ముందుకు పోతుందని భవిష్యత్ తరాలకు మంచి విద్యను అందించి తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చే విధంగా ప్రతి నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేయడానికి 200 కోట్ల చొప్పున,55 నియోజకవర్గాల్లో 1100 కోట్లతో నిధులు విడుదల చేస్తూ జీవో విడుదల చేశారని అన్నారు. ఈ యొక్క నిధుల మంజూరు మొదటి విడత లోనే నర్సంపేట నియోజకవర్గానికి మంజూరు కావడానికి కృషి చేసిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు నర్సంపేట నియోజకవర్గంలో గతంలో ఏనాడు నర్సంపేట నియోజకవర్గం ఇంత పెద్ద ఎత్తున నిధులు ఏ శాసనసభ్యులు తేలేదని అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉన్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గతంలో నర్సంపేట నియోజకవర్గంలో మోడల్ స్కూల్ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి కృషి చేసి నర్సంపేట నియోజకవర్గం లో పేద బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి పాడుపడ్డారని అన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఐలయ్య



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగని ఐలయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు సోమవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన జంగని ఐలయ్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ కే సాధ్యమని రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తున్న ప్రజా సంక్షేమ పాలన నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, జగదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి,నాయకులు మహేందర్,జనార్ధన్ రెడ్డి, చిట్కుల శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహదేవ్ ఫాషన్స్ షాప్ ప్రారంభించిన పల్లవి ప్రశాంత్



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ బస్టాండ్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మహదేవ్ ఫ్యాషన్ షాప్ ను సోమవారం బిగ్ బాస్ ఫేం పల్లవి ప్రశాంత్ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ సందర్భంగా పల్లవి ప్రశాంత్ మాట్లాడుతూ యువత వ్యాపారంలో రాణించాలని నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మహదేవ్ ఫ్యాషన్ షాప్ యజమాని స్వామికి అభినందనలు తెలిపారు, వినియోగ దారుల మన్నన పొందుతూ వ్యాపారాన్ని కొనసాగిస్తూ మంచి గుర్తింపు పొందాలని అన్నారు,గజ్వేల్ వ్యాపారానికి అనుకూల ప్రాంతం అని, యువత అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు.

# నవవధువు వివాహానికి పుస్తే మట్టెలు అందజేసిన గోలి సంతోష్



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో సోమవారం కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మమత దంపతుల ఆధ్వర్యంలో నవ వధువు వివాహానికి పూస్తే మట్టెలు, చీర సారే అందజేశారు ఈ సందర్భంగా గోలి సంతోష్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సేవ చేయడంలో తృప్తి ఉంటుందని అందులో భాగంగా రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన నవ వధువు వివాహానికి పూస్తే మట్టెలు అందజేయడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమంలో లింగారెడ్డి పల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ టోట శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పరిశీలించి పరిష్కరించాలి

**ప్రజావాణిలో అదనపు కలెక్టర్ లు వీరారెడ్డి గంగాధర్**



**భువనగిరి , మార్చ్ 10 తెలంగాణ సేన :** ఆర్జీల ను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ లు అధికారులకు సూచించారు.వివిధ ప్రాంతాల ప్రజల సోమవారం వచ్చిన దరఖాస్తులను కలసి స్వీకరించారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తు లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 60 అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించా లన్నారు. అందులో రెవిన్యూ శాఖ 40, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 5, మున్సిపాలిటీ 4, ఏ.డి హ్యాండ్లూమ్ 2 ,జిల్లా పంచాయితీ 2 , హౌసింగ్ , ఏడి మత్యశాఖ , వ్యవసాయ ,శిశు సంక్షేమ ,జిల్లా మార్కెటింగ్ , ఎస్సీ ట్రాన్స్ కో , వైద్యశాఖ , కు ఒక్కొకటి చొప్పున వచ్చాయి.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించండి

**ముస్త్యాలపల్లి, మోటకొండూరు మధ్యన బీటీ రోడ్డు**

**గ్రామాలలో మౌలిక వసతులు కల్పించాలి**

**మార్చి 29 తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కు పిలుపు**

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా**



**భువనగిరి ,మార్చ్ 10 తెలంగాణ సేన :** గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పోరుబాట లో భాగంగా సోమవారం భువనగిరి మండలంలోని ముస్త్యలపల్లి లో ఆయన ప్రసంగించారు. సమస్యల పరిష్కారం కొరకై మార్చ్ 29న తహసిల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడానికి పిలిపించారు.ముస్త్యాలపల్లి, మోటకొండూర్ గ్రామాల మధ్యన బీటీ రోడ్డు వెంటనే ఏర్పాటు కోరారు. మౌలిక వసతులను కల్పించాలని అన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేశారు. పేదలు నివసిస్తున్న ఇండ్ల పై నుంచి విద్యుత్ తీగలు వెళ్లడం వల్ల పలుమార్లు ప్రజలు ప్రమాదాల గురై ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ఆ విద్యుత్తు తీగలను ఇండ్ల పై ఉన్న వాటిని తొలగించాలని కోరారు. ఏడు, ఎనిమిది గ్రామాలకు కూడలిగా ఉపయోగపడుతున్న మోటకొండూరు మండలం కేంద్రముకు రోడ్డు కంకర వేసి 15 సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే నాధుడు లేక అనేక మంది ప్రయాణికులు ప్రమాదల దారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు . రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు ధ్వంసం కావడం వల్ల అక్కడ ఏర్పడిన గుంతల కారణంగా వికలాంగులుగా మారుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం స్పందించి బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని, నూతన బ్రిడ్జిని నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా గ్రామంలో ఇండ్ల, ఇండ్లు స్థలాలు స్థలాలు లేనివారు ఉన్నారని వారందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని సూచించారు. రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తులు పెట్టుకుని ఎదురు చూస్తున్న వారందరికీ వెంటనే పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. గ్రామంలో మంచినీళ్లు, మురికి కాలువలు, రోడ్లు వార్డుల్లో పెండింగ్ లో ఉన్నాయని వాటి ఏర్పాటు కోసం ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, శాఖ కార్యదర్శి కళ్లెం లక్ష్మీనరసయ్య, సిపిఎం నాయకులు గ్రామ ప్రజలు వద్దే స్వామి, సురపంగా కుమార్, గంటపాక లక్ష్మయ్య, పసనాది నాగరాజు, పసునాది రామచంద్రం, సంగం వెంకటేష్, పల్లపు మల్లేష్, గంధమల్ల శ్రీను, పచ్చిమట్ల యాదగిరి, సంఘం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి

**ఉస్మానియా యూనివర్సిటీ**



**తెలంగాణ సేన :** తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక, తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించడం జరిగింది. టి వి యు వి చైర్మన్ కంచర్ల బద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు నాయకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా భారతదేశంలో బ్రాహ్మణ అగ్రవర్ణాలు అనగారిన కులాలకు వర్గాల ప్రజలకు విద్యను నిరాకరించినా, మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు దళిత పీడిత కులాలకు ముఖ్యంగా మహిళలకు విద్యా లయాలను తెరిచి దళితవాడలో మహిళలకు విద్యను అందించారు అన్నారు. వారి జీవితాంతం దేశంలో నెలకొని ఉన్న మూఢనమ్మకాలకు, సతీసహగమనం, అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారనారు. వితంతు వివాహాలు జరిపించి అగ్రకుల మహిళలకు సైతం అండగా నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి గురువులైన సావిత్రిబాయి పూలే మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులకు ఇప్పటికైనా భారతరత్న ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హంస నాయకులు నామ సైదులు , ఓయు జెఎసి నాయకులు ఉదయ్, రంజిత్ పుట్ట, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, ప్రసాద్ అన్న, మోహన్ బైరాగి, యాదగిరి, డిబిఎస్ఎ కాసర్ల మధు, టీపీ ఎఫ్ రాంబాబు,తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక నాయకులు మరియు వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.

# సాగునీటి సరఫరా లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టండి

**వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర మంత్రులు ,ఉత్తంకుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు**





**భువనగిరి ,మార్చ్ 10 తెలంగాణ సేన :** సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలు కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో రాష్ట్రంలో పంటలకు సాగునీటి సరఫరా పై మంత్రులు సమీక్షించారు.చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.సోమవారం, హైదరాబాదు సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ పీ. గోపి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్ లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ హనుమంతరావు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి,స్థానిక సంస్థలు గంగాధర్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ మంత్రి మాట్లాడుతూ.. నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు కింద అత్యధికంగా వరి సాగవుతోందని, ఎగువ భాగాన రైతులు ఎక్కువ మోటార్ లు పెడుతున్నారని, చివరి ఆయకట్టు వరకు కూడా సాగు నీరు అందించాలని, సాగు నీటి కొరత రాకుండా చూడాలన్నారు. ఎక్కడా పంటలు ఎండి పోకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లడుతూ పంటలు ఎండి పోకుండా తగిన జాగ్రత్త లు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సంబంధిత అధికారులు, యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# పరిశీలన ప్రక్రియ పూర్తి నివేదిక సమర్పించండి

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సమీక్షా సమావేశంలో**

**రెవెన్యూ అదనప కలెక్టర్ వీరారెడ్డి**



**భువనగిరి , మార్చ్ 10 తెలంగాణ సేన :** ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పరిశీలన ప్రక్రియను పూర్తి నివేదిక సమర్పించాలని, అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లాలోని ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు ,గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు.ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. గ్రామాలలో ఎంపికైన ఇండ్ల కు మార్కింగ్ ను వేగవంతం గా పూర్తి చేయాలని ఎంపికైన గ్రామాల పంచాయతి సెక్రెటరి లను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈఓ . శోభారాణి,రెవిన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణారెడ్డి, డి.ఆర్.డి.వో, నాగిరెడ్డి , శేఖర్ రెడ్డి , హౌసింగ్ పీడీ విజయసింగ్, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ టి. నాగేశ్వర రావు,ఎం. శ్రీ రాములు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫులేకు ఘన నివాళి



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల లో సోమవారం సావిత్రి బాయి పులే వర్ధంతి సందర్భంగా అందెడ్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తాజమాజీ ఎంపిటిసి అశోక్ మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రీబాయి ఫూలే కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె సేవలను ఎప్పటికి మరువము అని అన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అరిగే ప్రవీణ్, గౌరవ అధ్యక్షులు కోడిశాల ప్రశాంత్, మాజీ గౌరవ అధ్యక్షులు ముంద్రాంతి రాజు,ఉప అధ్యక్షులు బందెల కర్ణాకర్, అధికార ప్రతినిధి క్షిరాసాగరం నర్సింలు, కార్యదర్శి కోడిశాల రవి,అరిగే అఖిల్, బందెల గణేష్,తిప్పరం కనకయ్య, అంజి, బాబు, కిష్టయ్య, మనోజ్ కుమార్, రవి, భాను, బాలనర్సిములు తదితులు పాల్గొన్నారు.

# కిషన్ రెడ్డి దుష్ప్రచారాలను మానుకో

**లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయడానికి తీసుకున్న చర్యలను తప్పు పట్టడం సరికాదు**

**గౌరవప్రదమైన హెూదాలో పనికిరాని విషయాలు అవాస్తవాలు**

**మాట్లాడడం తీవ్రంగా ఖండిస్తున్నాం – ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**భువనగిరి , మార్చ్ 10 తెలంగాణ సేన :** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దుష్ప్రచారాలను మానుకోవాలని భువనగిరి ఎంపీ సామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బాధ్యతగల కేంద్ర క్యాబినెట్ మంత్రి గా ఉన్న మిమ్మల్ని చూస్తుంటే మీ తోటి ఎంపీ బండి సంజయ్ లా మాట్లాడుతూ తానల ప్రవర్తిస్తూ తన స్టైల్ లో మాట్లాడుతూ వారి బాటలో నడుస్తున్నట్టు కనబడుతుంది అని దుయ్యబట్టారు. ఆదివారం భారతదేశం కప్పు గెలిచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా సంబరాలు జరుపుకుంటున్న సమయం, అదే క్రమంలో ట్యాంక్ బండ్ పై క్రికెట్ అభిమానులు యువత పెద్ద ఎత్తున అక్కడకు చేరి విజయాన్ని ఆనందోత్సవాలతో చేసుకున్నా విషయాన్ని మనం అందరం గమనించాం అని వివరించారు.దిల్?సుఖ్?నగర్ ప్రాంతంలో లా అండ్ ఆర్డర్ నీ కంట్రోల్ చేయడానికి పోలీసులు తీసుకున్నటువంటి చర్యను తప్పుపడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి క్రికెట్ గెలవడానికి ఇష్టం లేదని దుష్ప్రచారంతో బురద చల్లడం లాంటి మాటలు మాట్లాడడం సరి కాదన్నారు.మీరు ఒక బాధ్యత గల వ్యక్తిగా ఉండి కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారాలను చేయడాన్ని తప్పు పడుతున్నాం సందర్భంగా ఆయనపై ధ్వజమెత్తారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై మా పార్లమెంట్ సభ్యులందరికీ మాకు చాలా గౌరవం ఉంది అన్నారు. మీరు ఇలాంటి చిల్లర మల్లర రాజకీయాలు చేసి, పనికిరాని విషయాలను , వాస్తవాలు లేని మాటలు మాట్లాడటాని ఎంపీ చామల తీవ్రంగా ఖండించారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY

మంగళవారం 11 - 03 - 2025

## రాజకీయాల్లో సాగుతున్న దురాచారం

అధికారం కోసం, పదవులు దక్కించుకోవడం కోసం రాజకీయ పార్టీల నేతలు చేస్తున్న దిగజారుడు పనులు పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థకు కళంకం తెచ్చిపెడుతున్నాయి. చట్టాలను చుట్టాలుగా చేసుకొని ప్రవర్తిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉన్నది. చట్టాలు అమలు అవుతున్న తీరు వివాదాస్పదం అవుతున్నది.న్యాయ స్థానాలలో తీర్పులు వెలువరించడంలో జరుగుతున్న కాలాతీతం కారణంగా అమాయకులు బలవుతున్నారు. ఉదాహరణకు ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి. ఎన్. సాయిబాబు పదేళ్లపాటు జైలులో క్రూర నిబంధాన్ని అనుభవించి నిర్దోషిగా విడుదల అయ్యాడు. తర్వాత అనారోగ్యంతో అకాల మరణం పొందాడు. తాను పోగొట్టుకున్న జీవిత కాలాన్ని తిరిగి ఎవరు ఇవ్వగలరు ? స్వార్థపరులు, దోపిడీదార్లు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారు. ఈ విషయం చాలా కాలంగా ప్రజా బాహుళ్యంలో చర్చనీయాంశంగా నలుగుతూనే ఉన్నది. ఇది వ్యవస్థలో ప్రమాదకర పరిణామం. ప్రస్తుత సందర్భానికి వస్తే, పదవీకాలం ముగిసేంత వరకు శాసన సభ్యుల అనర్హత పిటిషన్ పై విచారణ ప్రక్రియ కొనసాగాలా? ప్రజా స్వామ్య సూత్రాలు ఏం కావాలి? అన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి బి. ఆర్. గవాయ్ సూటి ప్రశ్న సహేతుకమైనది. నిజాయితీగా మనం అందరం కూడా చర్చించాల్సిన విషయం కూడా . ఒక పార్టీ( %ఱ=ా/ దీ=ా% )గుర్తు పై గెలిచి, వేరొక పార్టీ లోనికి మారిన సందర్భం లో వారిని అనర్హులుగా ప్రకటించాలని ఆపార్టీ నాయకులు స్పీకర్ ను కోరారు. స్పీకర్ సరిగా, సకాలంలో స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయంలో తగు నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ ను కోర్టు ఆదేశించింది. కానీ గడువు ప్రకటించలేదు. దీన్ని ఆసరాగా తీసుకొని స్పీకర్ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. కోర్టు పలుమార్లు ఒత్తిడి తెచ్చినా ఫలితం కానరాలేదు. ఇప్పుడు కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేయడంతో కథ మళ్ళీ మొదటికి వచ్చింది. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ విషయం ప్రాధాన్యత సంతరించుకున్నది. కేంద్రంలో పి. వి. నరసింహారావు నాయకత్వంలోని (కాంగ్రెస్) ప్రభుత్వం డబ్బులతో ఓట్లు కొనుగోలు చేసి( జె. ఎం. ఎం. ముడుపుల కేసు) ఐదేళ్ల కాలం ప్రభుత్వాన్ని కొనసాగించారన్న విషయం ఆనాడు పార్లమెంట్లో పెద్ద దుమారమే లేపింది. ఆ తర్వాతకాలంలో మెజారిటీ శాసనసభ్యులు పార్టీ నుండి బయటకు వచ్చి, ఇంకొక పార్టీకి అనుబంధంగా కలిసిపోవడం సర్వసాధారణమైంది. మహారాష్ట్రలో ఏకనాథ్ షిండే ప్రభుత్వం ఆ ప్రాతిపదికననే ఏర్పడింది. ఇలా ప్రభుత్వాలు పడిపోవడం, కొత్త ప్రభుత్వాలు అధికార పగ్గాలు చేపట్టడం చాలా రాష్ట్రాలలో జరిగింది. ఇది దేశవ్యాప్తంగా ఆనవాయితీగా అమలవుతున్న అమలు అవుతున్న దుర్నీతి. గతంలో మెజారిటీ కాంగ్రెస్ శాసనసభ్యులు టిఆర్ఎస్ ప్రభుత్వం లో చేరారు. ఒక గుర్తుపై ఎన్నికలలో గెలిచిన వారి పరిస్థితి ఇలా ఉంటే, ఆశయాలను సిద్ధాంతాల ను నమ్మి ఓటు వేసి గెలిపించిన ప్రజల పరిస్థితి గందరగోళంగా మారుతున్నది. ఈ విషయంలో ఏదైనా నిర్ణయమైన తీసుకొని ముందడుగు వేయలేని నిస్సహాయ పరిస్థితి ఓటు వేసి గెలిపించిన ప్రజలది. రీ- కాల్ ఓటు అధికారం ప్రజలకు లేకపోవడమే ఇందుకు కారణం. అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో, ప్రజల దౌర్భాగ్య పరిస్థితి. ఇది నిజంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. నోటుకు ఓటు కేసు కూడా ఇందులో అంతర్భాగమే. ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలు మిళితమై ఉన్న అంశంగా దీనిని మనం అర్థం చేసుకోవచ్చు.ఆనాటి కాలంలో గ్రామ స్థాయిలో కుల సంఘాల పెద్దలను ఆకట్టుకొని , సారా పంపిణీ,ఉప్మా పంపిణీ చేయడంద్వారా ఓటర్లను ఆకట్టు కోవడం జరుగుతుండేది. ప్రస్తుత పరిస్థితులలో డబ్బు పంపిణీ ప్రాధాన్యత సంతరించుకున్నది లేదా రూపాంతరం చెందింది . మరో ముందడుగు పడి ప్రజలు డిమాండ్ చేసే పరిస్థితి కూడా వచ్చింది. ఒకప్పుడు రహస్యంగా ఉన్నది, ఇప్పుడు అంతా బహిరంగంగానే జరుగుతున్నది. అధికారం అందలం దక్కించుకోవడం కోసం, రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా పోటీపడి మరీ డబ్బు, లిక్కర్ విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారు. దీనిని ఎవరు కూడా తప్పుగా పరిగణించడం లేదు. ప్రాథమిక స్థాయిలో ఓట్ల కొనుగోలు దగ్గర నుండి మొదలైన ఈ విధానం యదేచ్ఛగా శాసనసభల, పార్లమెంటు ఎన్నికలకు ఎగబాకింది. పదవులు దక్కించుకోవడం కోసం, అధికారంలోకి రావడం కోసం, అధికారాన్ని నిలుపుకోవడం కోసం నేతలు తొక్కుతున్న అడ్డదారులకు అంతూ పొంతూ లేదు. రాజకీయ పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో, డబ్బుతో ఓట్లను సులభంగా కొనుగోలు చేయడంద్వారా విజయాన్ని సాధించవచ్చునే ఆలోచనలో నేతలు ఉన్నారు. ఎన్నికల సంఘం ఎన్ని నిబంధనలు రూపకల్పన చేసినా ఆచరణకు నోచుకోవడం లేదు. బహిరంగంగా జరుగుతున్న విచ్చలవిడి డబ్బు, మద్యం పంపిణీని అరికట్టలేని పరిస్థితి. రాజకీయ పార్టీలు చేస్తున్న వాగ్దానాలు ప్రజలను భ్రమలలో ముంచివేస్తున్నాయి. సరైన అవగాహన లేక, తాత్కాలిక ప్రయోజనాలకు ఆశపడి ప్రజలు ఓటును అమ్ముకుంటున్నారు. గెలిచినవాడు తమకు ఏమీ చేయడనే ఒక నమ్మకమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా, పదవీకాలం మొత్తం అవే విధానాలకు/ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారనే నమ్మకం లేకపోవడం కూడా ఓటు అమ్ముకోవడానికి ప్రజలకు ప్రేరణగా మారాయి. రాజకీయ నేతలలో లోపిస్తున్న అనైతికత ప్రవర్తన కూడా మరో కారణం ప్రస్తుత పరిస్థితుల్లో నీతి మంతులు,నిజాయితీ పరులు ఎవరైనా ఎన్నికలలో పోటీ చేయడం, గెలుపొందడం సాధ్యమయ్యే పని కూడా కాదు. ప్రచార ఆర్భాటపు,పటాటో పాలకే కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. అభ్యర్థికి సంబంధించి ఎన్నికల సంఘం విధించిన ఖర్చుల నిబంధనల ఉల్లంఘన యదేచ్ఛగా కొనసాగుతుంది. రాజకీయ పార్టీలు చేస్తున్న వాగ్దానాలు అమలు చేయలేకపోతే అనర్హులుగా ప్రకటించే పరిస్థితి లేదు. చట్టాలలో ఉన్న లొసుగులను, ముసుగులుగా వాడుకుంటూ సుదీర్ఘకాలం పబ్బం గడుపుకుంటున్నారు . అందువలన రాజకీయ నాయకుల ఆటలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఒక్కసారి అధికారంలోకి వస్తే చాలు తర తరాలకు సరిపోను డబ్బు సంపాదించుకోవచ్చునే పేరాశ పెరిగిపోయింది. ఈ అవినీతి కారకలాపాలపై నియంత్రణ కోల్పోవడం ప్రస్తుత వ్యవస్థలో కనిపిస్తున్న అతిపెద్ద లోపం. ఒక్క మాటలో చెప్పాలంటే, నిజాయితీ, నైతిక విలువలు గల వారికి ఎన్నికలలో స్థానమే లేదు. ప్రజాసేవ అన్నది అపహాస్యమైన, చేతకాని వాడి మాటగా మిగిలింది. డబ్బు, కులం, గుండాగిరీ రాజకీయ నాయకులకు ఆభరణాలుగా మారాయి. ఈ సందర్భాలలో కేవలం ప్రజలను నిందించడం సరికాదు. పాలనా వ్యవస్థలోని అన్ని స్థాయిలలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. కాదు.. కాదు భాగమయ్యింది అనడమే సరయినది. చదువుకున్నవారి చూపు అంతా ప్రజలకు ఇచ్చే ఉచితాల పైనే కేంద్రీకరించ బడుతుంది. అదాని, అంబానీ లాంటి బడా పారిశ్రామిక వేత్తలు బ్యాంకులకు ఎగ్గొడుతున్న లక్షల కోట్ల రూపాయలే వారికి పెట్టుబడిగా, కోటీశ్వరులుగా మారుస్తున్నాయన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. ప్రస్తుతం వారే దేశరాజకీయాలను ప్రభావితం చేస్తూ, శాసిస్తున్నారని అర్థం చేసుకోలేక పోతున్నారు . ఇలా వెనకబడుతున్నంతకాలం అవినీతి బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతం రాజ్యమేలడం ఖాయం. ఏం చేస్తాం? అని కాకుండా ఏం చేద్దాం? ఎలా చేద్దాం? అంటూ పరిష్కారానికి అడుగులు వేయడం పౌరుల బాధ్యత. వారికి అండగా నిలబడి తోడ్పడు అందించడం పౌర సమాజ కర్తవ్యం . ప్రశ్నించేవాడు లేకపోతే, దోచుకునే వాడితే రాజ్యమౌతుంది. ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలుగా ఉండి ధర్మాన్ని నాలుగు కాళ్ళపై నిలబెట్టాల్సిన వ్యవస్థలన్నీ అవినీతి రాజకీయ నాయకులకు అండగా మారాయన్న అపవాదు బహుళ ప్రచారంలో ఉంది. అప్రజాస్వామిక వ్యవస్థ పరిఢవిల్లుతున్న కాలమిది.ప్రజలు కేవలం ఓట్లు కాసే చెట్లుగా మిగలడం వల్లనే ఈ దుర్గతి దాపురించింది. బుద్ధి జీవులరా!ప్రజాస్వామిక వాదులారా పారాహుషార్!

**- రమణా చారి**

# మరాఠీల మనసులో ఏమున్నది?




మహారాష్ట్రలో గత వారం కింద కొన్నిరోజుల పాటు పర్యటించినపుడు ఒక విషయం గుర్తించి ఆశ్చర్యం కలిగింది. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో ఓడినప్పటికీ అక్కడి ప్రజలు ఇప్పటికీ ఆ పార్టీని కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ వేరే రాష్ట్రపు పార్టీ. అధికారంలో ఉండినపుడు మహారాష్ట్రలో ప్రచారం సాగించింది కొద్ది నెలలు మాత్రమే. అధికారం కోల్పోయి ఏడాది అవుతున్నది. తర్వాత కాలంలో అటు వైపు వెళ్లలేదు. ఈ మాటలన్నీ గమనించినప్పుడు మామూలుగానైతే అక్కడి ప్రజలు బీఆర్ఎస్‌ను మరిచిపోయి ఉండాలి. కానీ, పరిస్థితి ఆ విధంగా ఎంతమాత్రం లేదు. ఆశ్చర్యం కలగటం అందువల్లనే. వెళ్లింది మరాత్వాడా, విధర్భ ప్రాంతాలకు. అక్కడ నాందేడ్ వంటి ఒక ముఖ్య నగరంతో పాటు కొన్ని పట్టణాలకు, గ్రామాలకు పోయి కలిసి మాట్లాడిన వారిలో పలు వర్గాల వారున్నారు. అందువల్ల, బీఆర్ఎస్ పట్ల అభిమానం, దానితో పాటు నమ్మకం అన్నవి మహారాష్ట్ర సమాజంలో విస్తృతంగా నేటికీ నిలిచి ఉన్నాయనే అభిప్రాయానికి రాక తప్పలేదు. అందుకు కారణాలు ఏమిటన్నది వారి మాటలలోనే వినేందుకు ప్రయత్నించాను. అవి విన్న మీదట, వారందరు చెప్పిన వాటి సారాంశం ఒకేవిధంగా ఉండటం గమనించాను. అప్పుడు అర్థమైంది బీఆర్ఎస్ మహారాష్ట్రలో నేటికీ ఒక భావనగా ఎందుకు సజీవంగా ఉన్నదో. పైన పేర్కొన్న వేర్వేరు వర్గాల వారి మాటల సారాంశమేమిటో ముందుగా చూద్దాం. వారు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం చేసిందేమిటో పదేండ్ల పాటు గమనించారు. దానిని తమ పరిస్థితులతో పోల్చి చూసుకున్నారు. కేసీఆర్ తెలంగాణలో మాట్లాడుతున్నదేమిటో వార్తలు, సమాచారం అందుతూనే ఉన్నాయి. తర్వాత తమ వద్ద సభలలో చెప్పింది ప్రత్యక్షంగా విన్నారు. మరొకవైపు తమ రాష్ట్రాలకు చెందిన వేర్వేరు పార్టీ ల నాయకులు చెప్పింది వింటూ ఈ రెండింటినీ పోల్చుకున్నారు. కేసీఆర్‌లో వారికి దేశ పరిస్థితులు, దేశాభివృద్ధి, దీర్ఘకాలిక దృష్టి విషయాలలో ఒక దార్శనికుడు కనిపించగా, ఇతర పార్టీల వారిలో కేవలం అధికారం కోసం ప్రజలకు మాయమాటలు చెప్తూ మోసగించే వారే ఉన్నారు. వీటన్నింటికి తోడు కేసీఆర్ తన ఆలోచనలేమిటో చెప్తూ పోయారు తప్ప ఇతరులను విమర్శిస్తూ గడపలేదు. అంతిమంగా, 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే అద్భుతమైన నినాదాన్నిచ్చి అందరి మనస్సులను తాకారు. ప్రజల మాటల్లో రాజకీయపరమైనవి కూడా కొన్నున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమిని వారు నిజమైన ఓటమిగా చూడటం లేదు. రాజకీయాలలో జయాపజయాలు జరుగుతూనే ఉంటాయన్నది ఒక అభిప్రాయం. కాంగ్రెస్ ఇచ్చిన మితిమీరిన హామీలు పనిచేశాయన్నది మరొక అభిప్రాయం. దానినట్లుంచితే, బీఆర్ఎస్ తెలంగాణలో ఓడినా మహారాష్ట్రలో తన పని కొనసాగించి ఉండవలసిందన్న మాట అంతటా వినిపించింది. అట్లా చేసి ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే చెప్పుకోదగినన్ని స్థానాలు గెలిచి ఉండేదన్నారు వారు. కేసీఆర్ తెలంగాణలో మళ్లీ గెలిచి మరొక నాలుగేండ్ల తర్వాతనైనా సరే తిరిగి వచ్చినట్లయితే అంతే ప్రజాదరణ లభించగలదని చెప్పారు. ఇవీ సారాంశాలు. వీటిని చుట్టుకొని ఉన్న వివరాలను, అందుకు సంబంధించి ప్రజల మాటలను, వాటిని ప్రతిఫలించే మహారాష్ట్ర స్థితిగతులను చెప్పుకోవాలంటే చాలా ఉన్నాయి. వీటన్నింటిని కలిపి చూసినప్పుడు గాని, బీఆర్ఎస్ అక్కడ ఎందుకింకా సజీవంగా ఉన్నదో, కేసీఆర్ పేరు మరవలేనిదిగా మారిందో, భవిష్యత్తులో ఆయన తిరిగి తమ మధ్య కు రావాలనే కోరిక బలంగా ఉందో మనకు అర్థం కాదు. తాత్త్వికంగా చెప్పుకోవాలంటే, ఈ తత్త్వానికి మూలాలు, ఆధారాలు అక్కడి పరిస్థితులలో ఉన్నా యి. అక్కడి చారిత్రకమైన వెనుకబాటుతనంలో, రైతులూ పేదల ఘర్షణలలో, గురువులూ సంఘ సం స్కర్తలకు లభించిన ఎనలేని ఆదరణలో ఉన్నాయి. వర్తమానానికి వస్తే అన్ని పార్టీల వైఫల్యంలో, సామాన్యులలో తరతరాలుగా గూడు కట్టుకొని ఉన్న బాధ లో, నిరసనలో ఉన్నాయి. ఎక్కడైనా, ఎపుడైనా ఆర్థి క, సామాజిక స్థితిగతులు ఆ విధంగా ఉండి ఒక తాత్త్వికత ఏర్పడినప్పుడు ప్రజలు సహజంగానే దానినుంచి వెలికి వచ్చేందుకు ప్రయత్నిస్తారు. అం దుకు మార్గం ఒక దశలో కొందరికి ఒక సంఘ సం స్కర్త రూపంలో కనిపించవచ్చు. మరొక దశలో ఒక తిరుగుబాటు రూపంలో కావచ్చు. రాజకీయంగా చూస్తే ప్రస్తుతం కేసీఆరా, రేపు మరొకరా అన్నది కాదు ప్రశ్న. ఎవరైనా కావచ్చు. ఆదిలాబాద్ జిల్లాను దాటి మరాత్వాడా ప్రాంతంలోకి అడుగుపెట్టడమే తడవు రెండు రాష్ట్రాలకు మధ్య గల తేడా ఏమిటో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఆ రోడ్లు, గ్రామాలు, పట్టణాలు, ప్రజలు, దుకాణ సముదాయాలు, రవాణా బస్సులూ, సమస్తం ఆ తేడాను ప్రతిఫలిస్తాయి. వీటన్నింటి మధ్య గమనించదగినదేమంటే భూములన్నీ సారవంతమైన నల్లరేగడివి. అయినప్పటికీ సరిహద్దుకు ఇటు అభివృద్ధి, అటు వెనుకబాటుతనం అనే ఒకే ఒక్క తేడాలోనే పైన చెప్పుకున్న తాత్త్వికతకు గాని, కేసీఆర్ పట్ల పొంగుకొచ్చిన ఆశలకు గాని బీజాలున్నాయి. వాటిని ఆయన ఏ కారణం చేతనైనా సరే అదేవిధంగా వదిలివేసినట్లయితే, అది అక్కడి ప్రజలకు ఒక చారిత్రక విషాదం వంటిదవుతుంది. ఈ మాట అతిశయోక్తిగా తోచవచ్చు. అవునో, కాదో అర్థం కావాలనే స్వయంగా అక్కడికి వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడవలసి ఉంటుంది. పైన చెప్పినట్టు వీరు వారని గాక అన్ని వర్గాలలో, నగరాల నుంచి గ్రామాల వరకు, ఏడాది వ్యవధి తర్వాత కూడా మరొక రాష్ట్రంలో ఇటువంటి అభిప్రాయాలున్నప్పుడు, ఇది గాక మరొక మాట చెప్పగలమా? టీఆర్ఎస్ అనే ప్రాంతీయ పార్టీని బీఆర్ఎస్ అనే జాతీయ పార్టీగా ఒక మౌలికమైన, దీర్ఘకాలికమైన దార్శనికతతో మార్చిన కేసీఆర్, ఈ విధమైన కదలికలను అంతటితో అణగారిపోకుండా చూడవలసి ఉంటుంది. అట్లా జరగకపోతే అది ఒక విషాదమవుతుంది. ఈ సందర్భంలో చర్చించుకోవలసిన ముఖ్య విషయం ఒకటున్నది. ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చినప్పుడు పలువురు పలు విధాలైన సందేహాలను, ప్రశ్నలను లేవనెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడినప్పుడు పలువురు పలు విధాలైన సందేహాలను, ప్రశ్నలను లేవనెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడినప్పుడు ఆ ప్రశ్నలు తీవ్రంగా మారాయి. అవి పార్టీ లోపలి నుంచి, బయటినుంచి కూడా వినిపించాయి. తిరిగి టీఆర్ఎస్‌గా మార్చాలనే ఒత్తిళ్లు పెరిగాయి. కానీ, అందుకు కేసీఆర్ నిరాకరించటం గమనించదగ్గది. ఎందుకు కాదంటున్నారో ఆయన వివరించిందీ లేనిది తెలియదు గాని, మనకుగా ఆలోచిస్తే తోచేవి కొన్నున్నాయి. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చటానికి ఏ కారణాలున్నాయో వాటికి ఇప్పటికీ అదే విలువ ఉందన్నది తమ అభిప్రాయం కావచ్చు. తెలంగాణలో ఒకసారి ఓడినంత మాత్రాన ఆ విలువ మాయమైపోదు. నిజానికి మన రాజ్యాంగం ప్రకారం చూసినా ప్రాంతీయతలకు, జాతీయతకు మధ్య వైరుధ్యమేమీ లేదు. బలమైన రాష్ట్రాలు, బలమైన కేంద్రం అనే మాట, సహకార ఫెడరలిజం అనే మరొక మాట ఉన్నాయి. కనుక వైరుధ్యమేమీ లేదని ఆ విధంగా కూడా స్పష్టమవుతున్నది. మరొక విధంగా చెప్పాలంటే, ఇంగ్లీషులో వన్ ఫర్ ఆల్, ఆల్ ఫర్ వన్ అన్నట్టు ఇది అందరి కోసం (రాష్ట్రాలు) ఒకరు (కేంద్రం), ఒకరి కోసం అందరూ వంటి స్థితి. ఈ అవగాహన గాని, రాజ్యాంగపరమైన ఏర్పాటుగాని సజావుగా సాగి ఉంటే పరిపాలనలు, పరిస్థితులు అందుకు తగినట్టే ఉండేవి. కానీ, కాంగ్రెస్ నుంచి మొదలుకొని ఫ్రంట్ ప్రభుత్వాలు తప్ప, అందరూ అందుకు విరుద్ధంగా పాలిస్తూ వచ్చారు. సమతులనం లేని అభివృద్ధి, అంతర్గత వలసలు, అధికార కేంద్రీకరణలు, ధనిక వర్గాలకు అనుకూలమైన విధానాలు, రాష్ట్రాల హక్కులను హరించటం వల్ల ఈ రాజ్యాంగ లక్ష్యాలు దెబ్బతిని ఫెడరల్ శక్తులు మామూలుకు మించి బలపడుతూ వచ్చాయి. ప్రాంతీయ పార్టీలు ఎప్పుడైనా ఉంటాయి. కానీ, ఇటువంటి కారణాల వల్ల సహకార ఫెడరలిజానికి బదులు ఫెడరల్ శక్తులకూ, జాతీయత పేరిట చలామణి అయ్యే సెంట్రలిస్టు శక్తులకు మధ్య వైరుధ్యాలు ఏర్పడి క్రమంగా తీవ్రమవుతూ పోయాయి. ఆ విధంగా చూసినప్పుడు, దేశానికి ఒక జాతీయత, జాతీయ పార్టీలు ఎట్లాగైనా అవసరం గనుక అవి ఉంటూనే, ప్రాంతీయ పార్టీలు కూడా ఒక తప్పనిసరి అవసరంగా మారాయి. ఇప్పుడు దీనినంతా పరిగణనలోకి తీసుకొని చూసినప్పుడు, కేసీఆర్‌కు తెలంగాణ ప్రయోజనాల కోసం టీఆరెస్ అవసరమైనట్టే, తెలంగాణ ఒక భాగమైన దేశ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ కూడా అంతే అవసరమనిపించితే అందులో ఆశ్చర్యం గాని, వింత గాని ఏమీ ఉండనక్కరలేదు. ఆ రెండు సూత్రీకరణలు సహజ మిత్రుల వంటివి. ద్వైతాద్వైతాల సహ ప్రయాణమది. రెండింటి మౌలిక లక్ష్యాలు, దార్శనికతల మధ్య నిజమైన అర్థంలో ఎటువంటి వైరుధ్యం కనిపించదు. రూపాన్ని బట్టి అవి వేర్వేరు కావచ్చు. కానీ, సారాన్ని బట్టి ఒకటే. తాను తెలంగాణలో చేసిన కృషి తమ వద్ద కూడా జరగాలని మహారాష్ట్ర ప్రజలు ఒక పొడగింపును చెప్పుకొన్నట్టు, ఆ పొడగింపు దేశమంతటా జరగాలన్నది ఆయన ఉద్దేశమైతే, రెండు రూపాలకూ వాటి ఉమ్మడి సారానికీ వైరుధ్యం ఎక్కడి నుంచి వస్తుంది? కనుక, స్థూలంగా కాదు, సూక్ష్మంగా ఆలోచించటం అవసరం అని మహారాష్ట్ర ఉదాహరణ చెప్తున్నది. వాస్తవానికి, రెండింటి మధ్య వైరుధ్యాన్ని ఇటువంటి స్థూలమైన దృష్టితో తెలంగాణలోని 'అర్బన్ క్రౌడ్' అనబడేది చూసింది. వారు, ప్రతిపక్షాలు కలిసి ప్రచారాలు చేసి కొందరిని నమ్మించారు. కానీ, నేను తెలంగాణ గ్రామీణులతో, పట్టణాలలోని సామాన్యులతో మాట్లాడినంతవరకు, వారికి అటువంటి వైరుధ్యమేమీ తోచలేదు, పట్టించుకోలేదు. మహారాష్ట్రలో, ఆ కాలంలో కేసీఆర్‌ను సంప్రదించిన ఇతర రాష్ట్రాల వారిలోనూ సరిగా అంతే జరిగిందనుకోవాలి.

# మానసిక ఆరోగ్యమూ ప్రధానమే!











మానసిక ఆరోగ్యానికి మన జీవితంలో నాణ్యతకు సంబంధం ఉంటుంది. ఇది సవాళ్లను, ఒత్తిళ్లను తట్టుకునేలా మనల్ని సన్నద్ధం చేస్తుంది. మనసు సానుకూలంగా ఉంటే మనం సంతోషంగా ఉంటాం. పనిలో ఉత్పాదకత పెరుగుతుంది. భావోద్వేగాలు కూడా అదుపులో ఉంటాయి. మెరుగైన మానసిక ఆరోగ్యం కోసం అనుసరించాల్సిన పది మార్గాల గురించి తెలుసుకుందాం.

### పెంపుడు జంతువుల పాత్ర

మానసిక ఆరోగ్యంలో పెంపుడు జంతువులు కూడా తమవంతు పాత్ర పోషిస్తాయి. పెంపుడు జంతువుల వల్ల సురక్షితంగా ఉన్నామన్న భావన కలుగుతుంది. ఒంటరిగా ఉన్నామనే భావన తగ్గిపోతుంది. వాటి చేష్టల కారణంగా సంతోషం కలుగుతుంది.

### పిల్లలు పెద్దలతో

రోజూ కాసేపు పెద్దలతో మాట్లాడటం, పిల్లల్ని చదివించడం, ఆడించడం వల్ల కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం సానుకూలంగా ఉంటుంది.

### నిద్రతో హాయి

రాత్రిళ్లు నాణ్యమైన నిద్ర కూడా మానసిక ఆరోగ్య సంక్షేమానికి కీలకంగా నిలుస్తుంది. ఎనిమిది గంటల నిద్రతో శరీరంలో ఒత్తిడి స్థాయులు తగ్గిపోతాయి. తగినంత నిద్ర లేకపోతే మాత్రం ఒత్తిడిని నియంత్రించుకోవడం కష్టమైపోతుంది.

### ఎరుకతో ఉండటం

వర్తమానాన్ని అర్థం చేసుకుని ఎరుకతో ఉండటం వల్ల ఒత్తిళ్ల నుంచి త్వరగా కోలుకుంటాం. మైండ్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ప్రక్రియలను అనుసరించడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు.

### మీతో మీరు

ఉరుకులు పరుగుల జీవితంలో ఒక్కోసారి ఊపిరి తీసుకోవడమూ మర్చిపోతాం. కాసేపు కూడా సంతోషంగా గడపలేని పరిస్థితి ఉంటుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. కాబట్టి, రోజులో కాసేపు మీకంటూ కొంత సమయం కేటాయించుకోవాలి.

### రాతతో సాంత్వన

ఒత్తిడిగా అనిపించినప్పుడు.. ఏకాంతంగా కూర్చుని మీ ఆలోచనలను ఓ నోట్‌ప్యాడ్‌లో రాసుకోవాలి. ఇలా చేస్తే మనసులో గందరగోళం చెదిరిపోతుంది. ఆలోచనలు దారిలోకి వస్తాయి. అంతేకాదు.. జర్నల్ రాయడం వల్ల ఒంటరితనం భావన దూరమైపోతుంది.

### పుస్తక పఠనం

ఒత్తిడి నుంచి బయటపడటానికి మంచి మార్గం పుస్తక పఠనం. వార్తాపత్రికలు, క్లాసిక్స్, కామిక్స్, స్ఫూర్తిదాయకమైన పుస్తకాలు చదవడం మంచిది.

పది నిమిషాల నడక

ఒత్తిడి మీపై ఆధిపత్యం చలాయిస్తున్నప్పుడు ఓ పది నిమిషాల నడకతో దాన్నుంచి బయటపడొచ్చు. నడక మన శరీరంలో ఫీల్ గుడ్ హార్మోన్లు విడుదల కావడానికి దోహదపడుతుంది. కుంగుబాటు, ఆందోళనను దూరం చేస్తుంది.

### హాబీలో లీనమవడం

మీకంటూ ప్రత్యేకమైన సృజనాత్మక కార్యక్రమంలో మునిగిపోవాలి. దీంతో మీ మూడ్, సంతోషం మీద సానుకూల ప్రభావం పడుతుంది. హాబీ మీ ఆరోగ్యం, మూడ్ తదితర మానసిక విషయాలపై గొప్ప ప్రభావాన్ని చూపుతుందని నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొన్నది.

### మిత్రులతో మాటలు

పరిస్థితులు బాగాలేనప్పుడు.. అవి చిన్న విషయాలే అయితే మీ ఆత్మీయులతో పంచుకోవడం ఉత్తమం. మీరు అభిమానించే వ్యక్తి సాన్నిహిత్యం మీకు సాంత్వన చేకూరుస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మంచి మిత్రుల అండ మన ఆందోళన, ఒంటరితనం భావనలను తగ్గిస్తుంది.


తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY

మంగళవారం 11 - 03 - 2025

# ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో 121 దుర్గాలను అధిరోహించానంటున్న ఏడేళ్ల చిన్నారి

## ఏడేళ్ల వయసుకే 121 కోటలు ఎక్కిన శర్విక





మీరెప్పుడైనా ఒక దుర్గాన్ని (కోటను) ఎక్కడానికి వెళ్లినప్పుడు, రెండు జడలు వేసుకుని, ముళ్ల పొదలను తెంపుకుంటూ ముందుకు వెళ్తున్న చిన్నారి అక్కడ కనిపించిందంటే ఆమె పేరు శర్విక.ఏడేళ్ల ఆ బాలిక ఇప్పటికే 121 కోటలు ఎక్కేసింది. ఇదొక్కటే కాదు...'ఛత్రపతి శివాజీ మహరాజ్ కి జై' అనే నినాదాలతో మరిన్ని కోటలు ఎక్కడానికి సన్నద్ధమవుతోంది.ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ట్రెక్కింగ్‌కు క్రేజ్ పెరిగిపోయింది. మహారాష్ట్రలో చాలామంది పర్వతారోహకులు (ట్రెక్కర్లు) కనిపిస్తుంటారు. కానీ ఏడేళ్ల వయసున్న ట్రెక్కర్లు చాలా అరుదు.సహ్యాద్రి పర్వతాల్లోని 121 కోటల్లో ఆమె భారత జాతీయ జెండాను ఎగరేసింది. ఒక కోటను ఎన్నిసార్లు అధిరోహించినా, దాన్ని ఒక్కసారిగానే ఆమె పరిగణిస్తుంది.మహారాష్ట్రలో అత్యంత ఎత్తయిన శిఖరం ఎక్కిన అతి చిన్నవయస్కురాలు శర్విక జితేన్ మాత్రే. ఆమె పేరు మీద చాలా రికార్డులున్నాయి.ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, డైమండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఓఎంజీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటివాటిలో ఆమె పేరు నమోదయింది.రెండున్నరేళ్ల వయసులో శర్విక మొదటిసారి ఒక కోట ఎక్కింది. మహారాష్ట్రలో అధిరోహించడం కష్టంగా భావించే కోటల్లో పన్వెల్- కర్‌జాట్ దగ్గరలోని కల్వంటిన్ శుక్లా కోట ఒకటి. మహారాష్ట్ర నుంచి ఈ కోట ఎక్కిన మొదటి బాలిక శర్విక.మూడేళ్ల వయసులో ఆమె నాసిక్ జిల్లాలోని సల్హేర్ కోటను అధిరోహించింది. మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతాల్లో అత్యంత ఎత్తయిన దుర్గం ఇదే.నాలుగేళ్ల వయసు రాకముందే కల్సుబాయ్ శిఖరాన్ని అధిరోహించింది. మహారాష్ట్రలో ఇదే ఎత్తయిన కొండ. నాలుగేళ్ల వయసులో ఆ చిన్నారి గుజరాత్‌లోనే ఎత్తయిన గిర్నార్ శిఖరాన్ని ఎక్కింది.ఏడేళ్ల వయసుకు శర్విక 121 కొండలను ఎక్కింది. వాటిలో ఎక్కువభాగం ఎక్కడానికి కష్టంగా ఉండేవి, దుర్భేధ్యమైనవే. మహారాష్ట్రలోని రాజ్‌గఢ్, రాయ్‌గఢ్ మొదలుకుని రోహిడా, పురందర్, కైలాస్‌గఢ్..ఇలా అనేకం ఆమె అధిరోహించిన దుర్గాల జాబితాలో ఉన్నాయి.

**రెండున్నరేళ్ల వయసులోనే కోట అధిరోహణ**

రెండున్నరేళ్ల వయసులో శర్విక మొదటిసారి రాయ్‌గఢ్ కోటను ఎక్కింది. తనకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టమని, శివాజీ మహరాజ్ కోటలు ఎక్కేవారని శర్విక బీబీసీతో చెప్పింది."శివాజీ మహరాజ్ కథలు వింటుంటే నాకు సంతోషంగా ఉంటుంది. ప్రత్యేక శక్తి వచ్చిన అనుభూతి కలుగుతుంది" అని శర్విక చెప్పింది.

**ఏడేళ్ల వయసులోనే ఎంతో మందికి రోల్ మోడల్**

ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు కొంతమంది ధైర్యం కోల్పోతారని, కానీ వారు శర్విక కోటను ఎక్కుతున్న విధానం చూస్తే, తాము కూడా కోట చివర వరకు ఎక్కడం మొదలుపెడతారని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు."శర్విక కోట ఎక్కిన తర్వాత ఎవరో ఒకరు ఆమె వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తారు. మేం అక్కడినుంచి ఇంటికి చేరుకునే సమయానికి ఆ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతుంటుంది" అని ఆమె తండ్రి జితేన్ మాత్రే చెప్పారు.మొదటిసారి రాయ్‌గఢ్ కోట ఎక్కిన తర్వాత కోటలంటే తనకు అంతకంతకూ ఇష్టం పెరుగుతోందని శర్విక బీబీసీతో చెప్పారు.శర్విక తల్లిదండ్రుల పర్వతారోహకులు. వాళ్లిద్దరికీ ట్రెక్కింగ్ అంటే ఇష్టం. అలా పర్వతారోహణపై శర్వికకు కూడా ఆసక్తి పెరిగిందని ఆమె తల్లి అమృత మాత్రే చెప్పారు.

**చిన్నతనం నుంచి ఫోన్, టీవీకి ఆమడ దూరం**

శర్వికకు ఫోన్, టీవీ చూడాలన్న ఆలోచన ఉండదు. తల్లిదండ్రులు వాటి నుంచి ఆమెను దూరంగా ఉంచారు. శారీరక వ్యాయామం, బయటికెళ్లి ఆడుకోవడం శర్వికకు ఇష్టం.ట్రెక్కింగే కాకుండా ప్రస్తుతం రాక్ క్లైంబింగ్‌ను కెరీర్‌గా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది శర్విక.కోటలు ఎక్కడం ఇప్పుడామెకు హాబీ అయింది. ఆమెకు, ఆమె కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్న హాబీ ఇది.ఏడేళ్ల వయసుకే 121 కోటలు ఎక్కిన శర్విక.ప్రతి కోట నుంచి శర్విక మట్టి సేకరిస్తుంది. దాన్ని ఇత్తడి పాత్రలో దాస్తుంది. అది ఏ కోట నుంచి తెచ్చిందో దానిని పేరును ఆ పాత్ర మీద రాస్తుంది.తాను విన్న పూర్వీకుల కథలను ఆమె బీబీసీ బృందానికి చెప్పింది.ఆగ్రా కోట నుంచి శివాజీ మహరాజ్‌కు స్వేచ్ఛ లభించడం నుంచి హిర్కానీ సాహస కథలదాకా ఇందులో ఉన్నాయి. శివాజీ జీవిత విశేషాలకు సంబంధించిన పుస్తకాలు ఆమె దగ్గర ఉన్నాయి.

**రాక్ క్లైంబింగ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న ఆశయం**

శర్వికకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. అందుకే ఆమెకు రాక్ క్లైంబింగ్ నేర్పించాలని ఆమె తండ్రి నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఆమె కుటుంబం అలీబాగ్ నుంచి పుణెకు మకాం మార్చింది. రాక్ క్లైంబింగ్‌లో భారత్‌కు శర్విక ప్రాతినిధ్యం వహించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు."అలీబాగ్ చాలా బాగుంటుంది. కానీ, శర్విక కోసం ఇష్టం లేకపోయినా పుణెకు మారాం" అని శర్విక తండ్రి జితేన్ మాత్రే చెప్పారు.శర్విక చరిత్ర సృష్టిస్తుందని ఆమె కోచ్ అమోల్ జోగ్‌దండ్ విశ్వాసం వ్యక్తంచేశారు. శర్విక మొదటిసారి పైకి ఎక్కడం చూసినప్పుడు తాను నమ్మలేకపోయానని ఆయన అన్నారు. ఒక చిన్నారి అంత బాగా కోటలను ఎలా ఎక్కగలుగుతుందోనని ఆశ్చర్యపోయినట్లు ఆయన చెప్పారు.ప్రపంచ వేదికపై తన పేరు రాసుకోగల సామర్థ్యం ఆమెకుందని తనకు అనిపిస్తోందని అమోల్ తెలిపారు.

**'శివాజీ కోటలను పరిరక్షించాలి'**

శర్వికకు కోటలు ఎక్కడం ఇష్టం. అలాగే ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లు వంటివాటన్నింటినీ ఏరివేస్తుంది. ట్రెక్కింగ్ అయిపోయిన తర్వాత సేకరించిన వ్యర్థాలన్నింటినీ చెత్తబుట్టలో వేస్తుంది."కోటలను మరమ్మత్తు చేయడానికి, పరిరక్షించడానికి నేటి తరం చర్యలు తీసుకుంటే మహారాష్ట్ర కోటలు మళ్లీ పూర్వవైభవం సాధించడానికి ఎక్కువ రోజులు పట్టదు" అని శర్విక తండ్రి చెప్పారు.

# బ్రిటిషు వారికి క్షమాపణ చెప్పమని సావర్కర్‌ను గాంధీ కోరారా?





కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరీ రాసిన 'ది న్యూ ఐకాన్ – సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' అనే పుస్తకం ఇటీవల విడుదలైంది. ఈ పుస్తకంలో వీడీసావర్కర్ రచనలను, ఆయన వ్యక్తిత్వాన్ని అరుణ్ శౌరీ నిశితంగా సమీక్షించారు.సావర్కర్ రాసిన పత్రాలు, బ్రిటిషు రికార్డుల ఆధారంగా అరుణ్ శౌరీ ఈ పుస్తకాన్ని రాశారు

**బ్రిటిషు వారితో సావర్కర్**

వినాయక్ దామోదర్ సావర్కర్‌పై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సావర్కర్‌ను దేశభక్తుడు, జాతీయవాది అని బీజేపీ పిలుస్తుండగా, కాంగ్రెస్ అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.సావర్కర్ గొప్ప హేతువాది అని, ఆ విషయంలో ఆయనను అభినందిస్తున్నట్లు అరుణ్ శౌరీ తెలిపారు."సావర్కర్ అనేక ఆచారాలను ప్రశ్నించారు, దానికి ఆయనను అభినందిస్తున్నాను. కానీ, ఆయన బ్రిటిషు వారికి సాయం చేశారు" అని అరుణ్ అన్నారు."జాతీయ స్థాయిలో స్వాతంత్ర్యం కోసం ఉద్యమం జరుగుతున్నప్పుడు బ్రిటిషు వారికి సావర్కర్ మద్దతుగా నిలిచారు. బ్రిటిషు వారికి రాజకీయంగా సహాయం చేస్తానని వాగ్దానం చేశారు" అని అరుణ్ శౌరీ చెప్పారు."సావర్కర్ బ్రిటిషు వారి షరతులను అవసరానికి మించి అంగీకరించారు. అవి ఆయనను జైలు నుంచి విడుదల చేయడానికి సంబంధించినవి కూడా కావు. సావర్కర్ వైస్రాయ్ లిన్‌లిత్‌గోను కలిసినప్పుడల్లా, ఆ సమావేశానికి సంబంధించిన పూర్తి రికార్డును లిన్‌లిత్‌గో లండన్‌కు పంపేవారు. ఆ రికార్డులలో 'సావర్కర్ నన్ను రెండుసార్లు వేడుకున్నారు' అని లిన్‌లిత్‌గో రాశారు" అని అరుణ్ తెలిపారు.

**సావర్కర్ క్షమాపణ**

సావర్కర్ రాసిన క్షమాపణలపై అనేక ఊహాగానాలు ఉన్నాయి. వాస్తవానికి, నాసిక్ కలెక్టర్ హత్యలో సావర్కర్ దోషిగా తేలారు. ఆయనపై 25 సంవత్సరాల చొప్పున రెండు వేర్వేరు శిక్షలు విధించారు.ఆ శిక్షను అనుభవించడానికి ఆయనను అండమాన్ (కాలాపానీ)కి పంపారు. జైలుకు వెళ్లిన తర్వాత సావర్కర్ బ్రిటిషు వారికి చాలా క్షమాపణ లేఖలు రాశారు. ఈ విషయంపై పలువురు సావర్కర్‌ను విమర్శించారు.అయితే, బ్రిటిషు వారికి క్షమాపణ చెప్పడాన్ని సావర్కర్, ఆయన మద్దతుదారులు సమర్థించుకున్నారు.అది తమ వ్యూహంలో భాగమన్నారు. దీంతో కొన్ని రాయితీలు పొందవచ్చన్నారు. సావర్కర్ ఇచ్చిన ఈ వివరణను అరుణ్ శౌరీ తన పుస్తకంలో ప్రస్తావించారు.సావర్కర్ క్షమాపణలను శివాజీ వంటి వ్యూహాలుగా అరుణ్ శౌరీ భావించడం లేదు."శివాజీకి (ఔరంగజేబు లేదా ఆయన సైన్యం వల్ల) ఎప్పుడు ఇబ్బందులు ఎదురైనా, దక్షిణాదిని గెలవడానికి సహాయం చేస్తానని ఔరంగజేబుకు ఉత్తరం రాసేవారు. ఔరంగజేబు అక్కడి నుంచి వెళ్లిన వెంటనే, శివాజీ మళ్లీ తన పని తాను చేసుకునేవారు. కానీ, సావర్కర్ బ్రిటిషు వారి వద్ద శివాజీ వ్యూహాన్ని అనుసరించారా? అంటే కచ్చితంగా కాదు. ఆయన బ్రిటిషు వారికి సాయం చేస్తూనే ఉన్నారు" అని అరుణ్ తెలిపారు.



**క్షమాపణ కోరమని గాంధీజీ అడిగారా?**

సావర్కర్ దుష్ప్రచారాలకు బాధితుడని 2021లో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బహిరంగ వేదికపై వ్యాఖ్యానించారు. గాంధీజీ కోరిక మేరకే సావర్కర్ క్షమాపణలు రాశారని ఆయన ఆరోపించారు.దీనిపై అరుణ్ శౌరీ మాట్లాడుతూ "1910లో సావర్కర్‌ని దోషిగా నిర్ధరించిన విషయం ఆయనకు (రాజ్‌నాథ్‌సింగ్‌కు) తెలియకపోవచ్చు. జైలు శిక్ష అనుభవించేందుకు సావర్కర్‌ను అండమాన్‌కు పంపారు. అయితే, ఆయన రెండు నెలల్లోనే క్షమాపణ చెప్పారు. ఆ తర్వాత అనేక క్షమాపణ లేఖలు రాశారు. ఆ సమయంలో గాంధీ దక్షిణాఫ్రికాలో (1910–11) ఉన్నారు. 1915లో గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చారు. సావర్కర్ అప్పటికే నాలుగేళ్లు జైలులో ఉన్నారు, ఐదు క్షమాపణలు దాఖలు చేశారు" అని అన్నారు.శౌరీ వివరిస్తూ "రాజకీయ ఖైదీలందరికీ బ్రిటిషు వారు సాధారణ క్షమాభిక్షప్రకటించినప్పుడు సావర్కర్ పేరును అందులో చేర్చలేదు. దీంతో సావర్కర్ తమ్ముడు నారాయణ్ గాంధీజీ సలహా కోరారు. దీంతో సావర్కర్ తన పిటిషన్‌లో తాను రాజకీయ ఖైదీ అని రాస్తే, అప్పుడు ఆయన కూడా క్షమాభిక్ష పరిధిలోకి వస్తారని గాంధీజీ సూచించారు. సావర్కర్ అదే చేశారు. ఆయనతో పాటు జైలులో ఉన్న తన సోదరులు భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకం కాదని హామీ ఇచ్చారు" అని తెలిపారు.

**గాంధీజీకి మిత్రుడా?**

1948లో మహాత్మాగాంధీ హత్యకు గురైన ఆరో రోజున, ఈ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై సావర్కర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఫిబ్రవరి 1949లో ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు.సావర్కర్ ప్రకారం, ఆయన ఒకప్పుడు గాంధీజీకి స్నేహితులు. ఇంతకీ గాంధీజీతో సావర్కర్‌కు ఎలాంటి సంబంధం ఉండేది. ఇద్దరూ స్నేహితులేనా?ఈ ప్రశ్నకు అరుణ్ శౌరీ సమాధానమిస్తూ "అస్సలు కాదు. నిజానికి గాంధీజీని సావర్కర్ అసహ్యించుకున్నారు. గాంధీజీని ఆయన మూరు?డు, పిచ్చివాడనేవారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి అంటుండేవారు. 'నడిచే ప్లేగు' అనేవారు" అని తెలిపారు.

**'హిందుత్వ నుంచి హిందూమతాన్ని కాపాడాలి'**

సావర్కర్ 1923లో 'హిందుత్వ – ఎవరు హిందువు?' అనే పుస్తకం రాశారు. ఇందులో ఆయన తొలిసారిగా హిందుత్వను రాజకీయ సిద్ధాంతంగా ఉపయోగించుకున్నారు.దీనిపై అరుణ్ శౌరి స్పందిస్తూ "సావర్కర్ తను రాసిన పుస్తకంలో హిందుత్వ, హిందూయిజం చాలా భిన్నమైనవని రాశారు" అని తెలిపారు.హిందూమతాన్ని హిందుత్వనుంచి కాపాడాలని శౌరీ 'ది న్యూ ఐకాన్ – సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' పుస్తకంలో విజ్ఞప్తి చేశారు."సావర్కర్ ఆశించిన హిందుత్వం వస్తే ఇక మనది భారతదేశం కాదు, పాకిస్తాన్‌గా మారుతుంది. అది 'కాషాయరంగులోని ఇస్లామిక్ రాజ్యం' అవుతుంది" అని శౌరీ అభిప్రాయపడ్డారు."సావర్కర్ హిందుత్వం క్రూరత్వాన్ని, ద్వేషాన్ని బోధిస్తుంది. ఒక సమాజం అటువంటి విలువలను అవలంబిస్తే హిందూ మతం ఎక్కడ మిగులుతుంది?" అని అరుణ్ శౌరీ ప్రశ్నించారు.

# ఫాల్స్ కిల్లర్ వేల్స్: ఇవి ఒడ్డుకు ఎందుకు వచ్చాయి, వీటిని కాల్చి చంపాలని ఎందుకనుకుంటున్నారు?



ఆస్ట్రేలియాలోని టాస్మానియా దీవిలో ఓ మారుమూల తీరం వద్ద పెద్ద ఎత్తున చిక్కుకుపోయి అవస్థ పడుతున్న 90 'ఫాల్స్ కిల్లర్ వేల్స్'కు కారుణ్య మరణం ప్రసాదించాలని అధికారులు నిర్ణయించారు. 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' అనేవి డాల్ఫిన్ జాతికి చెందిన జంతువులు.సంక్లిష్ట పరిస్థితుల కారణంగా వీటిని కాపాడటం అసాధ్యమని అక్కడికి చేరుకున్న నిపుణుల బృందం చెప్పింది.టాస్మానియా దీవి వాయువ్య మూలన ఉన్న ఆర్థర్ నది ఒడ్డుకు 157 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' కొట్టుకు వచ్చాయి. అక్కడికి చేరిన కొద్దిసేపటికే 67 చనిపోయాయి. దీంతో మిగిలిన 90 'ఫాల్స్ కిల్లర్ వేల్స్'కు కారుణ్యమరణం ప్రసాదించాలని అధికారులు నిర్ణయించారు.టాస్మానియాలో ఇటీవల సంవత్సరాలలో తిమింగలాలు కొట్టుకొచ్చిన సంఘటనలు చాలానే చోటుచేసుకున్నాయి. 2020లో ఇక్కడ భారీ సంఖ్యలో తిమింగలాలు కొట్టుకు వచ్చాయి. కానీ, గడిచిన 50 ఏళ్లలో 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడూ కొట్టుకు రాలేదు.

**6 మీటర్లు, 1.5 టన్నుల బరువు**

'ఫాల్స్ కిల్లర్ వేల్స్' సాంకేతికంగా ప్రపంచంలోనే అతిపెద్ద డాల్ఫిన్ జాతికి చెందినది. ఓర్కా(కిల్లర్ వేల్)తో దగ్గరి పోలికలు ఉంటాయి. ఇవి 6 మీటర్లు (19 అడుగులు) వరకు పెరుగుతాయి. 1.5 టన్నుల బరువు ఉంటాయి.ఈ 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' ఇప్పటికే తీరం వద్ద 24 నుంచి 48 గంటలుగా ఉన్నాయని, ఇవి తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయని అధికారులు బుధవారం చెప్పారు.తన కుమారుడు రాత్రి వేళ షార్క్ చేపల వేటకు వెళ్లిన సందర్భంలో ఒడ్డుకు కొట్టుకువచ్చిన ఫాల్స్ కిల్లర్ వేల్స్ గుంపును గమనించి తనకు చెప్పడంతో బుధవారం ఉదయం అక్కడకు వెళ్లినట్టు స్థానిక నివాసి జోసెలిన్ ఫ్లింట్ ఆస్ట్రేలియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్‌కు చెప్పారు.'అక్కడ వాటి కళ్లు సాయం చేయమని అభ్యర్థిస్తున్నట్టుగా కనిపించాయి" అని చెప్పారు.''నిజంగా అది చాలా భయంకరమైనది" అని ఆయన చెప్పారు.

**ఎందుకు చంపుతున్నారు?**

'ఫాల్స్ కిల్లర్ వేల్స్' చిక్కుకున్న ప్రాంతం లాన్‌సెస్టన్ సిటీకి 300 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రదేశానికి దారీతెన్నూ లేదని, సరైన రవాణా సదుపాయాలు లేవని, రక్షణ పరికరాలను తరలించడం సాధ్యమయ్యే పని కాదని సముద్ర జీవశాస్త్రవేత్త క్రిస్ కర్లియన్ మీడియాకు చెప్పారు. ఇది అత్యంత క్లిష్టమైన ప్రాంతమని ఆయన చెప్పారు.''ఈ ప్రాంతానికి ఉన్న మార్గం నిటారుగా రాళ్లతో ఉంటుంది. ఆ దారిలో ఒకే వాహనం వెళుతుంది. అక్కడ, నాలుగు చక్రాల వాహనాలు లభిస్తాయి కానీ, పెద్దగా ఉండవు" అని తెలిపారు.'ఫాల్స్ కిల్లర్ వేల్స్'ను ఒడ్డు నుంచి తిరిగి సముద్రంలోకి పంపేందుకు అనువైన వాతావరణ పరిస్థితులు లేవు. అధికారులు ఓ రెండింటిని సముద్రంలోకి పంపడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.ఎగసిపడే అలలను దాటి ఇవి ఈత కొట్టలేవు, అందుకే అవి వెనక్కు కొట్టుకువచ్చేస్తున్నా యని టాస్మానియా ఉద్యానవనాలు, వన్యప్రాణి సేవలకు చెందిన షెల్లీ గ్రహం చెప్పారు.మరో రెండురోజులపాటు వాతావరణం ఇలాగే ఉంటుందనే అంచనాల నడుమ పశువైద్య నిపుణులు వీటికి కారుణ్య మరణం ప్రసాదించాలనే కఠినమైన నిర్ణయాన్ని తీసుకున్నారు.''ఇవి ఇక్కడ ఎంత ఎక్కువసేపు ఉంటే అంత ఎక్కువ బాధను అనుభవిస్తాయి. ప్రత్యామ్నాయ పద్ధతులన్నీ విఫలమయ్యాయి. కారుణ్యమరణమనేది చివరి ఎంపిక" అని డాక్టర్ కార్లైన్ చెప్పారు.వీటిని కాల్చి చంపే పని బుధవారం మొదలై గురువారం కూడా కొనసాగుతుందని చెప్పారు.

# ఇష్టం లేని పేరు మార్చుకోవడం ఎలా, చట్టపరమైన ప్రక్రియలు ఏంటి?



చాలామంది రకరకాల కారణాల రీత్యా తమ పేరు మార్చుకుంటూ ఉంటారు. కొందరికి చిన్నప్పుడు పెట్టిన పేరు నచ్చక, మరికొందరికి సర్టిఫికెట్లలో పేరు, తమ పేరు వేరు వేరుగా ఉన్నందున, ఇంకొందరు జాతకం ప్రకారం, మరికొందరు సంఖ్యాశాస్త్రం మేరకు, కొందరు పెళ్ళయ్యాక, విడాకుల తరువాత, మతం మార్చుకున్నప్పుడు, తమ పేర్లపై సమాజంలో ఉన్న వ్యతిరేకత కారణంగా, ఇలా అనేక కారణాలతో పలువురు తమ పేర్లను మార్చుకుంటూ ఉంటారు.అయితే, పేరు మార్చుకోవడం అనేది ప్రాథమిక హక్కే అయినప్పటికీ, అది పరిమితులతో కూడిందని, దీనికోసం కచ్చితంగా చట్టపరమైన నిబంధనలకు కట్టుబడి ఉండాలని అలహాబాద్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనంలోని చీఫ్ జస్టిస్ అరుణ్ బన్సాలి, జస్టిస్ క్షితిజ్ శైలేంద్ర స్పష్టం చేసినట్లు లా ట్రెండ్ పేర్కొంది. దీనిలో సివిల్ కోర్టు డిక్లరేషన్ తప్పనిసరిగా కావాలని తెలిపింది.

తన పేరును షానవాజ్ నుంచి మొహమ్మద్ సమీర్‌రావుగా మార్చాలని కోరుతూ ఆ వ్యక్తి పిటిషన్ వేశారు.అయితే, అసలు చట్టబద్ధంగా పేరు మార్చుకోవాలంటే ఎలా..? ఏయే న్యాయ ప్రక్రియలను అనుసరించాలి..? రాజ్యాంగంలో ఏ ఆర్టికల్ కింద పేరు మార్చుకునే వీలుంటుంది..? పేరు మార్చుకున్న తర్వాత ఎక్కడెక్కడ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది..?

పేరు మార్చుకోవడం ఎలా?

భారత్‌లో పేరు మార్చుకోవడానికి కచ్చితంగా న్యాయ, అధికారిక ప్రక్రియలను అనుసరించాలి.ముందుగా పేరు మార్చుకోవాలనుకోవడానికి కారణమేంటో చెప్పాల్సి ఉంటుంది.ప్రస్తుత పేరు, కొత్త పేరు, పేరు ఎందుకు మార్చుకోవాలనుకుంటున్నారు, ఇతర వివరాలు తెలుపుతూ న్యాయవాది సాయంతో స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్‌ను సిద్ధం చేసుకున్న తర్వాత, ఆ అఫిడవిట్‌ను నోటరీ చేయించుకోవాలి. ఇద్దరు సాక్షులతో సంతకం చేయించాలి. ఆ డాక్యుమెంట్‌పై అధికారిక స్టాంప్ ఉండాలని ఇండియా లా ఆఫీసెస్ డాట్ కామ్ పేర్కొంది.ప్రస్తుత పేరు, కొత్త పేరు, పేరు మార్పుకు గల కారణాలు తెలుపుతూ వార్తా పత్రికలో దరఖాస్తుదారు ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది.ఆ తర్వాత గెజిట్ నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైన డాక్యుమెంట్లు, న్యూస్‌పేపర్ క్లిపింగ్స్, అఫిడవిట్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లికేషన్‌కు పంపాలి. పేరు మార్చుకునేందుకు అవసరమయ్యే లీగల్ వెరిఫికేషన్‌కు గెజిట్ నోటిఫికేషన్ అదనపు లేయర్ లాంటిది.ఒకవేళ విదేశాల్లో నివసించే భారతీయులు పేరు మార్చుకోవాలంటే, సంబంధిత భారత రాయబార కార్యాలయం, ఇండియన్ హై కమిషన్ ధ్రువీకరించిన డీడ్‌ను పబ్లికేషన్ డిపార్ట్‌మెంట్‌కు పంపాలి.అలాగే, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లికేషన్ నిర్దేశించిన ప్రింటింగ్ వివరాలను కూడా ఒక తెల్లని కాగితంపై టైప్ చేసి, పాత పేరుతో సంతకం చేసి, రెండు సాక్షి సంతకాలను పెట్టించి, సాఫ్ట్ కాపీతో పాటు పంపించాలి.పేరు మార్పుకు ప్రింటింగ్ చార్జీలు కూడా చెల్లించాలి. మేజర్ లేదా ప్రభుత్వ ఉద్యోగి అయితే పేరు మార్పు కోసం రూ.1100 చెల్లించాలి. విదేశాల్లో నివసించే భారతీయులు అయితే రూ.3,500 చెల్లించాలి.దరఖాస్తుదారు పెట్టుకున్న అప్లికేషన్‌తో అధికారి సంతృప్తి చెందితే, అధికారిక రికార్డులలో కొత్త పేరుతో ఆ వ్యక్తి పేరును రికార్డు చేస్తారు. గెజిట్ నోటిఫికేషన్ సాయంతో ఆ వ్యక్తి తన కొత్త పేరును ప్రభుత్వం జారీ చేసిన అధికారిక డాక్యుమెంట్లలో అప్‌డేట్ చేసుకోవచ్చు.అయితే, పేరు మార్చుకోవాలనుకునే వ్యక్తి మైనర్ అయితే, తల్లిదండ్రులు అఫిడవిట్ చేయించి, ఈ న్యాయ ప్రక్రియను పూర్తి చేయాలి.

**పేరు మార్పుకు కావాల్సిన పత్రాలు**

**అప్లికేషన్ ఫామ్**

**రెండు ఇటీవల పాస్‌పోర్టు సైజు ఫొటోగ్రాఫ్‌లు**

**గెజిటెడ్ ఆఫీసర్ జారీ చేసిన పౌరసత్వ పత్రం**

**పేరు ఎందుకు మార్చుకోవాలనుకుంటున్నారో తెలుపుతూ అఫిడవిట్**

**గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకున్న సర్టిఫికేట్లు**

**గత ఐదేళ్లలో తనపై ఎలాంటి కేసులు లేవని తెలుపుతూ ఇచ్చే పోలీసు సర్టిఫికేట్**

**ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ వంటివి సమర్పించాలి.**

**పేరు మార్పును ఎక్కడెక్కడ అప్‌డేట్ చేసుకోవాలి?**

**ఒకసారి పేరు మార్చుకున్న తర్వాత వెంటనే పాన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు పాస్‌బుక్ వంటి కీలక డాక్యుమెంట్లలో కొత్త పేరును అప్‌డేట్ చేసుకోవాలి.ఈ అన్ని డాక్యుమెంట్లలో పేరును అప్‌డేట్ చేసుకోవడం మీ వ్యక్తిగత, వృత్తి జీవితానికి అత్యంత కీలకం.**

**1. ఎలాంటి ఇబ్బందులు వస్తాయి? పేరు మార్పు ప్రక్రియలో ఎలాంటి నిబంధనలు, ఇబ్బందులు ఎదురవుతాయి?**

పేరు మార్చుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా, కొత్త పేరును అధికారికంగా గుర్తించేందుకు అవసరమైన ధృవపత్రాలు సేకరించాలి. గెజిట్ నోటిఫికేషన్, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా, విద్యా ధృవ పత్రాలు, ఆస్తి పత్రాలు మొదలైన వాటిని నవీకరించాలి.కొన్ని సందర్భాల్లో, పేరు మార్పు ప్రక్రియ సమయంలో అనుమానాస్పద లావాదేవీలతో సంబంధముందని భావించి పోలీస్ వెరిఫికేషన్ కూడా కావొచ్చు.పాత పేరుతో ఉన్న ఒప్పందాలు, బ్యాంక్ రుణాలు, లీగల్ కేసులు ఉంటే, వాటిని అప్‌డేట్ చేయడం అవసరం.ఇతర డాక్యుమెంట్స్ మారడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుంది. నోటరీ అఫిడవిట్, వార్తాపత్రికలో ప్రకటన వంటి నిబంధనలు పాటించాలి.కొన్ని ప్రభుత్వ విభాగాలు పేరుమార్పును వెంటనే అంగీకరించకపోవచ్చు, ఎటువంటి సందేహాలు లేకుండా సరైన ఆధారాలు సమర్పించాల్సి వస్తుంది.

**2. దరఖాస్తును ఎప్పుడు తిరస్కరిస్తారు?**

పేరు మార్పు దరఖాస్తు కొన్ని కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుంది. సమర్పించిన పత్రాలలో తప్పులు, అస్పష్టతలు లేదా సరైన ఆధారాలు లేకపోతే అభ్యర్థన తిరస్కరిస్తారు.నోటరీ అఫిడవిట్, గెజిట్ నోటిఫికేషన్ లేదా వార్తాపత్రిక ప్రకటన లేకపోతే అనుమతించరు.న్యాయపరమైన సమస్యలు, బ్యాంకు రుణాలు, క్రిమినల్ కేసులు లేదా ఇతర లీగల్ ఇష్యూలు ఉన్నప్పుడు అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశముంది.ప్రభుత్వ నియమాలు, విధానాలకు విరుద్ధంగా ఉంటే లేదా మార్పు అనుమతించని పేరును అభ్యర్థిస్తే కూడా దరఖాస్తును అంగీకరించరు.అదనపు పరిశీలన అవసరమైన సందర్భాల్లో సరైన సమాధానాలు లేకపోతే తిరస్కరణకు గురవుతుంది.

**3. పేరు మళ్లీ మార్చుకోవచ్చా?**

ఒకసారి చట్టబద్ధంగా పేరు మార్చుకున్న తర్వాత, అవసరమైతే మళ్లీ పేరు మార్చుకోవచ్చు. అయితే, ఇది మొదటిసారి మార్చుకున్న దానికంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ అవుతుంది.పునఃమార్పు కోసం గెజిట్ నోటిఫికేషన్, నోటరీ అఫిడవిట్, వార్తాపత్రిక ప్రకటన మళ్లీ ఇవ్వాలి. పేరు వరుసగా మార్చుకోవడంపై అధికారులు అనుమానం వ్యక్తం చేసే అవకాశముంది. అందుకే సరైన కారణాలు చూపించాలి.బ్యాంకింగ్, ఆస్తి, విద్య, పాస్‌పోర్ట్ సంబంధిత వ్యవహారాల్లో ముందుగా మార్పును అంగీకరించడంలో కొన్ని పరిమితులు ఉండొచ్చు. గత మార్పుల గురించి పూర్తి వివరాలతో సరైన ఆధారాలు సమర్పిస్తే మళ్లీ పేరు మార్చుకోవచ్చు.

**4. పేరు అప్‌డేట్‌కు టైమ్ లిమిట్ ఉంటుందా?**

గెజిట్‌లో పేరు మార్చుకున్న తర్వాత విద్యా సర్టిఫికేట్లలో పేరు అప్‌డేట్ చేసుకోవడానికి అధికారికంగా ప్రత్యేకమైన టైమ్ లిమిట్ అనేది లేదని సాధారణంగా భావిస్తారు.అయితే, ప్రతి విద్యా బోర్డు లేదా యూనివర్శిటీ తమ విధానాల ప్రకారం మార్పు దరఖాస్తులకు గడువును నిర్ణయించే అవకాశం ఉంది.కొన్ని సంస్థలు పరీక్ష పూర్తయిన కొన్ని సంవత్సరాల లోపల మాత్రమే పేరు మార్పును అనుమతిస్తాయి, మరికొన్ని మాత్రం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇస్తాయి.మార్పు కోసం గెజిట్ నోటిఫికేషన్, నోటరీ అఫిడవిట్, పాత, కొత్త పేరు ఆధారాలతో పాటు విద్యా సంస్థ నిర్దేశించిన ఫీజు చెల్లించాలి.నిర్దిష్ట సమయం ఉన్నదో లేదో తెలుసుకోవడానికి సంబంధిత బోర్డు లేదా యూనివర్శిటీ అధికారిక నిబంధనలను పరిశీలించడం మంచిది.

**5. సివిల్ కోర్టు డిక్లరేషన్ ఎప్పుడు అవసరం ?**


సివిల్ కోర్టు డిక్లరేషన్ ప్రధానంగా ఏదైనా హక్కు లేదా హోదా నిర్ధరణ అవసరమైనప్పుడు అవసరం పడుతుంది.ప్రత్యేకంగా, పేరు మార్పు లేదా సంతానం గుర్తింపు వంటి లీగల్ అంశాలలో అధికారిక ధృవీకరణ అవసరమైనప్పుడు దీనిని కోరవచ్చు.ఆస్తి హక్కుల వివాదాలు, వారసత్వ హక్కులు, ఒప్పంద చట్టబద్ధతను నిర్ధారించుకోవడం, లేదా రికార్డులలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి కూడా కోర్టు డిక్లరేషన్ తీసుకోవాల్సి వస్తుంది.కొన్ని సందర్భాల్లో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలు పేరు మార్పు లేదా ఇతర హక్కుల నిర్ధరణకు గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు కోర్టు డిక్లరేషన్ కూడా తప్పనిసరిగా కోరవచ్చు.అప్లికేషన్ తిరస్కరణ లేదా లీగల్ సమస్యలు ఉన్నప్పుడు కోర్టు ద్వారా అధికారిక నిర్ధారణ పొందడం అవసరం అవుతుంది.

**6. రాజ్యాంగం ఏం చెబుతోంది?**

పేరు మార్చుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని న్యాయవాదులు చెబుతున్నారు.భారత రాజ్యాంగంలో కల్పించిన ఆర్టికల్ 19(1)(ఏ), 21, 14 ప్రాథమిక హక్కుల కింద భారతీయ పౌరులు తమ పేరును మార్చుకోవచ్చని అలహాబాద్ సింగిల్ బెంచ్ ఇచ్చిన కోర్టు తీర్పులో పేర్కొంది.అయితే, అలహాబాద్ డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పులో మాత్రం ప్రాథమిక హక్కులకు కూడా పరిమితులు ఉన్నాయని తెలిపింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) వాక్ స్వాతంత్ర్యం, 21వ ఆర్టికల్ వ్యక్తిగత స్వేచ్ఛను, 14వ ఆర్టికల్ సమానత్వ హక్కును భారతీయ పౌరులకు అందిస్తాయి.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 11 - 03 - 2025


# బహుజనుల గొంతుక



ఆధునిక కాలంలో అనేక కులవృత్తులు కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వాల ఆదరణ కోల్పోవడం ఒక కారణమైతే, కార్పొరేట్ సంస్థలు వాటి అధీనంలోకి కులవృత్తులను తీసుకోవడం రెండో కారణం. అయితే కార్పొరేట్ సంస్థలు వాటికి నచ్చిన ధరకు మార్కెట్ చేయడం ద్వారా కులవృత్తిని జీవనాధారం చేసుకొని బతుకుతున్న ఎన్నో కుటుంబాలు నేడు ఆకలితో అలమటిస్తున్నాయి. నానాటికి ఆదరణ తగ్గుతున్న కులవృత్తుల్లో ఒకటి నాయీ బ్రాహ్మణ వృత్తి (మంగలి వృత్తి). వీరి చేతిలో దువ్వెన, కత్తెర ఆడితేనే వారి బతుకులు తెల్లారుతాయి. ఈ వృత్తిలోని సాధక బాధల గురించి, ఆ వృత్తినే చేస్తూ 'అసిపె' అనే దీర్ఘకవిత సంకలనం ద్వారా మన ముందుకువచ్చారు కవి వనపట్ల సుబ్బయ్య. 'అసిపె' అంటే మంగలి వృత్తి వారు ఉపయోగించే ఆయుధాలు అంటే%ౌ% కత్తులు, గోరుగాలు, పటికె, దువ్వెన, అద్దం తదితర వస్తువులు పెట్టుకునే పెట్టె అని అర్థం. ఈ దీర్ఘకవితలో ప్రజాస్వామ్య ఫలాలు దక్కని బహుజనవాదుల దీన అవస్థలను కవి చక్కగా కవిత్వీకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తుల వాళ్లందరూ ఏకమై పరస్పర సహకారంతో ముందుకుసాగుతూ ఒక బలమైన గొంతుకై చట్టసభల్లో వారికి సముచిత స్థానం కలిగేలా ఉండాలని కోరుకుంటున్నారు. అందుకోసం బహుజన వాదాన్ని తన కలం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. తన తండ్రి నుంచి వారసత్వంగా వస్తున్న మంగలి వృత్తిని చేస్తూ తన నాయినను తన వృత్తిలో చూసుకుంటూ కవిత మొదలవుతుంది. ఈ వృత్తిని అవమానించే సామెతలను చూస్తే.. (పేజీ 87) 'చాకలి మంగలి పొత్తు ఇంటికి రాదిత్తు', 'సక్కగ కూసోర సాకలి నాయాలా అంటే ఇంటివే ఈడిగెంకటయ్య మంగలి తొత్తు మాట', 'పని లేని మంగలి పిలిచి తల కొరిగిండట' ఇలా పనిలేని వెదవలు కూసే సామెతల నోళ్లను ఫినాయిల్‌తో కడగాలని ఉందంటాడు కవి. ఇంత అభివృద్ధి చెందుతున్నప్పటికీ మనుషుల్లో అజ్ఞానం పోలే ఇంకా మూఢాచారాలను నమ్ముతూ మంగలోడెదురుంగొస్తే అపశకునమని మంగలోన్ని చూసి 'దున్నపోతు కుట్టిందంట' లాంటి అవహేళన పదాలు వారి వృత్తిని కించపరిచేవిధంగా మాట్లాడుతూ వారి హృదయాలను చిత్రవధకు గురిచేస్తుంటారు. శుభ్రంగా ఉండాలనే ఇంగితజ్ఞానం లేకుండా, ముఖాలు కడుక్కోకుండా, పళ్లు తోమకుండా, పాచి ముఖాలు, నోటినిండా కంపుతో ముందు కూర్చుని కటింగ్ చేయమని, సంక లేపంగానే చచ్చిపోయేంత వాసనను భరిస్తూ, చేతి, కాళ్ల గోర్లను, ఆనెలు తీస్తూ వృత్తినే దైవంగా, గౌరవంగా చూస్తూ, మానవ సేవనే మాధవ సేవ అని భావిస్తూ వారి వృత్తిని చేస్తుంటారు మంగలివాళ్లు. ఈ దీర్ఘ కవితలో మంగలోళ్లంతా ఎలా నలిగిపోతున్నారో, వారి జీవితాలు అగమ్యగోచరంగా ఎలా కొనసాగిస్తున్నారనేది వివరిస్తూ వనపట్ల సుబ్బయ్య మంగలి వృత్తిలోని ఆవేదనను, బాధలను ప్రపంచానికి తెలియజేయాలనే తాపత్రయం కనబడుతుంది. ఇలాంటి దీర్ఘ కవితలు ఇప్పుడు అన్ని కులవృత్తులపై రావాలి. అప్పుడే ప్రజల్లో, కులవృత్తులపై ఆదరాభిమానాలు పెరుగుతాయి. 'అసిపె' ఊహాజనితమైన కావ్యం కాదిది, శ్రమైకజీవుల చెమట చుక్కల్లో నుంచి వచ్చిన ఆత్మగౌరవ ప్రతీక. చక్కటి శ్రమైక జీవన సౌందర్య కావ్యాన్ని మనకందించిన వనపట్ల సుబ్బయ్యను అభినందిస్తూ మరెన్నో సాహితి సంకలనాలను తీసుకురావాలని ఆశిస్తూ%ౌ

# సాహిత్య విమర్శకు సహృదయత కావాలె

కవులు అన్ని జీవనచర్యల్లోనూ అప్రమత్తంగా ఉంటారు. అనుభవాలను హృదయం లోపలికంటా తీసుకుంటారు. ఆ ఉద్వేగాలను అక్షరాలుగా మారుస్తారు. తాను పొందిన ఆనందం, దుఃఖం, నిర్వేదం వీటన్నింటినీ ఎంత గొప్ప బొమ్మలుగా, బలమైన రేఖలతో మనసులో నిలుపుకొంటాడనేది అతని కవిత్వానికి ఊతమవుతుంది. పుట్టుకతో మనిషి కవి కాదు. ఆకలైతే ఏడుస్తాడు. కొన్నాళ్లకు అమ్మను చూసి నవ్వుతాడు. నాన్నను గుర్తుపడతాడు. కుటుంబసభ్యులను దగ్గరికి తీసుకుంటాడు. వీధిలోకి వెళ్తాడు. స్నేహితులను చుట్టుకుంటాడు. అతని బాల్యం నిండా కొన్ని బొమ్మలుంటాయి. వయస్సు పెరిగేకొద్దీ ఆ బొమ్మలు జ్ఞాపకాలుగా మారుతాయి. ఆ తర్వాత మనిషిగా ఇతను బువ్వ సంపాదించుకోవడం, కాస్త దాచుకోవడం, కోపం, భయం, బెదురు, అసూయ, కుట్ర, ఆరోగ్యం, అనారోగ్యం వీటన్నింటి వలలో పడిపోతాడు. చిన్నప్పుడు సూర్యుడిని చూసి పరవశించిన తాను, చంద్రుడిని చూసి ఎగిరి గంతులేసిన తాను వయస్సు పెరిగే కొద్దీ వాటిని వదిలేసుకుంటాడు. కవిత్వం వచ్చాక, విమర్శ మొదలవుతుంది. ఈ రోజు తెలుగు సాహిత్యంలో, కవి సంగమం వేదికగానూ, ఇతరత్రానూ కూడా చాలామంది కవులు కవిత్వం రాస్తున్నా, ఇంకా సంపుటులు ప్రచురించలేదు. అటువంటివారిని తెలుగు విమర్శాలోకం గుర్తిస్తుందా, కనీసం వాళ్లను చదివిందా అంటే జవాబు దొరకడం కష్టం. వీళ్లలోనూ, సంపుటులు ప్రచురించిన వాళ్లలోనూ, మంచి కవిత్వం రాసేవారిని, రాయగలిగిన వారినీ గుర్తించడం విమర్శకుడి పని. ఆ కవి సాధనాలు ఏమిటి? ఎట్లా కవిత్వం అవుతున్నాడు, ఎక్కడ విఫలమవుతున్నాడు, ఆ కవి మెరుగయ్యేందుకు ఏమైనా సూచనలు చేయగలమా అని ఆలోచించాలి. విమర్శ లక్ష్యం కవిత్వ స్థాయిని పెంచడమే తప్ప, సాహిత్య సృజనను అడ్డుకోవడం కాకూడదు. అది సాధ్యపడాలంటే, విమర్శ నిర్మాణాత్మకంగా ఉండాలి. దురదృష్టవశాత్తు ఇవాళ విమర్శ వ్యక్తుల మీద మళ్లింది. కేవలం లోపాలు వెతకడమే విమర్శగా మారిపోతున్నది. ఇది కవులకు, విమర్శకులకు మధ్య శత్రుత్వం పెంచడానికే తప్ప, సాహిత్యానికి ఎలాంటి హితవూ చేయబోదు. కొన్ని వాస్తవాలు మాట్లాడుకుంటే మన కవిత్వ క్షేత్రం చాలా చిన్నది. కవిత్వం రాయనందువల్ల నష్టం లేదు. రాసినందువల్ల ఒనగూడే లాభమూ ఘనమైనదేమీ కాదు. సాహిత్యం ఒక కళగా భావించి, అది మరికొన్ని తరాలు నిలబడాలన్న సదుద్దేశం విమర్శకుల్లో ఉంటే, రాస్తున్న వాళ్లను గౌరవంగా చూడాల్సిన బాధ్యతను మొదటగా వాళు తలకెత్తుకోవాలి. విమర్శ కఠినంగా ఉండవచ్చు, అచ్చుతప్పుల నుంచీ అన్వయ దోషాల వరకూ చర్చ పెట్టవచ్చు. రాసినవాటిలో



బలం లేని వాక్యాలను కోకొల్లలుగా కోట్ చెయ్యవచ్చు, వాటినలా అనడానికి గల కారణాలను విశ్లేషించవచ్చు. కానీ, రాయని కవితల గురించి మాట్లాడటం సబబు కాదు. ఒక కవిని పూర్తిగా చదవకుండానే, అతని కవిత్వాన్ని అంచనా కట్టడం సద్విమర్శకుల పని కాదు. మనకు నచ్చని ఒక కవి పుస్తకం తీసుకొని (అతను నచ్చకపోవడానికి అనేక కారణాలుంటాయి) దానిమీద విమర్శ రాసి, అది కూడా కేవలం లోపాలు చెప్పే విమర్శ చేస్తే విమర్శ లక్ష్యం సాధించలేకపోవచ్చు. దీని అర్థం విమర్శలో ప్రశంస ఉండాలని కాదు, అలా అని నిందలు వేయడం కూడా విమర్శ కాబోదు. విమర్శకుడికి సహృదయత మొట్టమొదటి లక్షణం. సాహిత్య సంస్కారం మొదటి అర్హత. ఉదాహరణకు ఒక కవి తన ఇల్లు, భార్య, అమ్మ, పిల్లలు చుట్టూ కవిత్వం అల్లాడనుకుందాం. ఇందులో అతను సమాజం గురించి మాట్లాడలేదు కాబట్టి ఇది చెత్త కవిత్వం అనకూడదు. ఇల్లు సమాజంలో భాగం కాదా? కుటుంబాలు కలిస్తేనే సమాజమన్న కనీస స్పృహ విమర్శకుడికి ఉండాలి. ఆ కవి ఏ వస్తువునైతే తీసుకొని రాశాడో అందులో ఏమైనా అతను నిర్లక్ష్యం చేసినా, కవిత్వ నిర్మాణంలో లోపాలున్నా మాట్లాడాలి. విమర్శకుడికి అధ్యయనం ఉండాలి. సిద్ధాంతపరమైన బలం ఉండాలి. దృక్పథం పట్ల సూటిగా ఉండాలి. కవిత నిడివిని గమనించాలి. ఆగాల్సిన చోట ఆగలేని కవితలను విమర్శకులు గుర్తుపట్టాలి. కవిత్వానికి కూడా ఒక పరిధి ఉంటుందని అర్థం చేసుకొని, విమర్శ ఆ పరిధిలోనే చెయ్యాలి. నన్నయ మహా ప్రస్థానం రాయలేదు. తిక్కన అమృతం కురిసిన రాత్రి రాయలేదు. అలాగే శ్రీశ్రీ మహాభారతాన్ని, తిలక్ రామాయణాన్ని రాయలేరు. ఆయా కాలాలను బట్టి, సమాజాన్ని బట్టి సాహిత్యం వస్తుంది. సృజన లేకపోతే విమర్శ ఉండదని గుర్తుండాలి. కవుల పట్ల కనీస గౌరవం లేకుండా విమర్శకుడు మాట్లాడటం పద్ధతి కాదు. ప్రతి కవి ప్రపంచాన్ని గురించి మాట్లాడాలని లేదు. సమాజం గురించి చర్చించాలని లేదు. అతను ప్రకృతి గురించి రాయవచ్చు. జీవితంలోని తాత్త్వికతను చూపవచ్చు. కవిత్వం నిండా సామాజికతను నింపవచ్చు. సామాజికతను గురించి మాట్లాడిన కవి గురించి ఇతను ప్రకృతి గురించి మాట్లాడలేదనే విమర్శ చేయకూడదు. అయితే ఇవాళ ఏ ఎండకు ఆ గొడుగు పట్టే కవులూ ఉన్నారు. ఒక కవి పుస్తకంగా మన ముందుకు వచ్చినప్పుడు పుస్తకం నిండా వైరుధ్యాలున్నట్టయితే, అట్లాంటి కవిని ఎట్లా అంచనా వేస్తాం. కవికి దృక్పథం లేనప్పుడు వైరుధ్యం కనిపిస్తుంది. తన కవిత్వ లక్ష్యం కవికే తెలియని కాలం ఒకటి నడుస్తూ ఉన్నది. పరస్పరం ఖండించుకునే భావాలతోనే కవితా సంపుటి ఉంటే కవి విఫలమైనట్టు. సరైన దృక్పథంలో కవిత్వం లేనప్పుడు విమర్శ కూడా రాణించదు. కవికే సైద్ధాంతిక దృక్పథం లేనప్పుడు, విమర్శకుడు ఎట్లా అంచనా వేస్తాడు. వీళ్లు ఒకరకం కవులైతే, మరికొంత మంది కవులు తమ కవిత్వంలోని భిన్నత్వం ద్వారా, ప్రత్యేకత ద్వారా, తమదైన ఒక ట్కస్టైల్‌ను సృష్టించుకుంటున్నారు. వీళ్లను అంచనా వేయడంలో విమర్శకులు ఇప్పటికీ విఫలమవుతూనే ఉన్నారు. ఇట్లాంటి కవులను అంచనా వేయడానికి సరికొత్త పరికరాలు వెతుక్కోవలసిన అవసరం ఉన్నది. వేగుంట మోహనప్రసాద్, ఎమ్మెస్ నాయుడు, రమణ జీవి వీళ్లను ఎట్లా విమర్శకుడు అంచనా వేయాలో పరికరాలు లేవు. న్యూట్రల్ కవులను ఎట్లా అంచనా వేయాలి? లాంటి ప్రశ్నలకు విమర్శకులు సమాధానాలు వెతకాలి. కానీ, దురదృష్టవశాత్తు విమర్శ పక్కదారులు తొక్కుతున్నది. పనిగట్టుకొని నెగెటివ్‌గా ప్రచారం చేయడం, పగబట్టి విమర్శించడం, కేవలం కవితా సంపుటిలోని లోపాలను మాత్రమే చెప్పడం ఇప్పుడు నడుస్తున్న విమర్శ. ఇక్కడినుంచి కాస్త సాహిత్య సంస్కారం వైపు, సహృదయత వైపు నడవాలని చెప్పేవాళ్లు కావాలిప్పుడు.

# తెలంగాణలో ఎన్డీయే కూటమి?



అధ్యాపకులు, పట్టభద్రుల నియోజక వర్గాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు అధికార, ప్రతిపక్షాలకు తమదైన రీతిలో సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో ఓటర్ల తీర్పు ప్రతిపక్షానికి బలం చేకూర్చగా... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రతిపక్షం తన పద్ధతులు మార్చుకోని. పక్షంలో మనుగడే కష్టమన్న హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణలో అధ్యాపకులు, పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటినీ భారతీయ జనతా పార్టీ గెలుచుకోవడం ద్వారా మూడు ప్రధాన రాజకీయ పార్టీలలో తనదే పైచేయి అని రుజువు చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితి ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే జరిగింది. అధికార కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల నియోజకవర్గంలోనే అధికారికంగా పోటీచేసింది. గత ఎన్నికల్లో గెలుచుకున్న ఈ స్థానాన్ని ఇప్పుడు కోల్పోవడం ఆ పార్టీకి దెబ్బ అనే చెప్పుకోవచ్చు. ఒకప్పుడు ఉత్తర తెలంగాణ భారత రాష్ట్ర సమితికి ఆయువుపట్టుగా ఉండేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పరాభవాన్ని మూటగట్టుకోగా బీజేపీ బలపడింది. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఆ పార్టీ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. తెలంగాణ ఉద్యమానికి అండగా ఉండిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధ్యాపకుల నియోజకవర్గంలో కూడా బీజేపీ పాగా వేసింది. భారత రాష్ట్ర సమితి ఎన్నికలకు దూరంగా ఉండటం బీజేపీకి కలిసొచ్చింది. ముక్కోణపు పోటీ జరిగి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో చెప్పలేంగానీ, బీజేపీ తెలంగాణలో విస్తరిస్తోందన్న అభిప్రాయం ఈ ఎన్నికల ఫలితాలతో ధ్రువపడింది. అదే సమయంలో కాంగ్రెస్ బలహీనపడుతోందన్న అభిప్రాయానికి బలం చేకూరుతోంది. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్ పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు తనకు బ్రహ్మరథం పట్టడానికి సిద్ధంగా ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం నాడు చెప్పుకొన్నారు. అదే నిజమైతే పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ మద్దతు పొందిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఓడిపోకూడదు. ఆయన మూడో స్థానానికే పరిమితమయ్యారు. దీంతో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి స్థానాన్ని భారతీయ జనతా పార్టీ ఆక్రమించబోతున్నదా? అన్న సందేహం సహజంగానే ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో బీజేపీ మొదటి నుంచి కొంత బలంగానే ఉంది. ఇటీవలి కాలంలో ఆ పార్టీ శాసనసభలో కూడా బలం పెంచుకుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**తెలంగాణలో నేతల సన్నాహాలు !**

జాతీయ స్థాయిలో ఎన్డీయేను పటిష్ఠం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తున్నందున వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో కూడా ఎన్డీయే ప్రయోగం అమలు చేస్తారా? అన్న ప్రశ్న కొన్ని రోజులుగా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. తెలుగుదేశం పార్టీకి సొంతంగా మెజారిటీ సమకూరినప్పటికీ ఎన్డీయే కూటమిగానే ముందుకెళుతున్నాయి. ఇదే ప్రయోగాన్ని తెలంగాణలో కూడా అమలు చేస్తే... అన్న చర్చ ఇప్పుడు ఆ మూడు పార్టీలలో నడుస్తోంది. తెలంగాణలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉండగా, తెలుగుదేశం పార్టీ ఓట్ల పరంగా అంతో ఇంతో బలంగా ఉంది. జనసేనకు కూడా తెలంగాణలో కొన్ని ఓట్లు ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో అది కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. తెలుగుదేశం పార్టీ సొంతంగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవచ్చునుగానీ, ప్రధాన పార్టీతో జతకట్టి పోటీ చేస్తే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలదు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాత్రం ఎన్డీయే కూటమి ఎందుకు ఏర్పడకూడదు? అన్న ప్రశ్న ఇటీవలి కాలంలో వినపడుతోంది. గతంలో కలిసి పోటీ చేద్దామని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర నాయకుల సూచన మేరకు ఆ పార్టీ అగ్రనేతలు తిరస్కరించారు. దీంతో బీజేపీ ఒంటరిగానే పోటీ చేసింది. గత ఎన్నికల్లో జనసేనతో కలసి పోటీ చేసినా పెద్దగా ఉపయోగపడలేదు. దీంతో తెలుగుదేశం పార్టీకి ఉన్న ఓటర్ల ప్రాధాన్యతను బీజేపీ నాయకులు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో కూడా పోటీ చేస్తామన్న అభిప్రాయాన్ని చంద్రబాబు ఈ మధ్య వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకోబోతున్నదని పసిగట్టడం వల్లనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల మాట్లాడుతూ, "తెలంగాణలో చంద్రబాబు రాజకీయం చేయాలనుకుంటే సహించేది లేదు" అని వ్యాఖ్యానించారు. ఆయన చంద్రబాబును కేవలం సెంటిమెంటు కోసమే వ్యతిరేకించడం లేదు. ఎన్డీయే కూటమి ఏర్పడితే తెలుగుదేశం, బీజేపీలలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎన్డీయే కూటమి ఏర్పడుతుందని, ఆ కారణంగానే తాను తెలుగుదేశం పార్టీలో చేరే ఆలోచన చేస్తున్నానని కొంతకాలం క్రితం బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే ఒకరు నాతో చెప్పారు. అప్పట్లో ఆయన చెప్పిన మాటలు టూ ఎర్లీగా అనిపించాయిగానీ, ఇప్పుడు పరిస్థితులు వేగంగానే మారుతున్నాయి. బీజేపీ అగ్ర నాయకత్వం ఆలోచనలు కూడా మారాయంటున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పడితే ప్రధానంగా నష్టపోయేది కేసీఆర్ మాత్రమే. అందుకే ఆయన చంద్రబాబుకు తెలంగాణలో ఏం పని అని మళ్లీ ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి! బీజేపీతో కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నుంచి సంకేతాలు వెళ్లినా... బీజేపీ అగ్ర నాయకత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిపోవాలని ఆ పార్టీ కోరుకుంటోంది. తెలుగుదేశం, జనసేనను కలుపుకొన్నా తామే పెద్దన్న పాత్రను పోషించవచ్చునని బీజేపీ నాయకులు కూడా భావిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కేసీఆర్ 'ఇక లాభం లేదు జనంలోకి వెళ్లాలి' అని నిర్ణయించుకున్నారు. ఇక మీదట శాసనసభకు కూడా హాజరవుతానని ఆయన తాజాగా ప్రకటించారు. తెలంగాణలో ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల వ్యవధి ఉంది. ఈ మూడున్నరేళ్లలో ఏదైనా జరగవచ్చు.

**రేవంత్‌కూ హెచ్చరిక**

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో బీజేపీ ప్రస్తుతానికి మంచి ఊపు మీద ఉంది. ఇప్పుడు తెలంగాణలో కూడా ఎన్డీయేకు పురుడు పోయాలన్న ఆలోచన ఊపందుకుంటున్నందున కేసీఆర్ మాత్రమే కాదు%-% ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మేల్కొనాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వపరమైన, విధానపరమైన విషయాలను కూడా ముఖ్యమంత్రికంటే ముందుగా మంత్రులు, ఇతరులు ప్రకటిస్తున్నారు. దీంతో ప్రభుత్వ రథసారథి ఎవరన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటికైనా మేల్కొని, రాష్ట్ర నాయకత్వాన్ని పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకోని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు జరిపించడానికి కాంగ్రెస్ పార్టీ సాహసించలేక పోతున్నదన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకుంటే రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు తనతో ఉన్న ఎమ్మెల్యేలు కూటమి వైపు చూడకుండా రేవంత్ రెడ్డి ఎంతవరకు కట్టడి చేస్తారో తెలియదు. మరోవైపు గత ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కొందరు పునరాలోచనలో పడ్డారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా పరిణమించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషమ పరీక్షను ఎదుర్కొని ప్రభుత్వాన్ని, పార్టీని ఎలా కాపాడుకుంటారో వేచి చూడాలి.

**ఏపీలో కూటమి కళ**

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో అధికార ఎన్డీయే కూటమికి వెయ్యి ఏనుగుల బలం చేకూరింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎనిమిది నెలలకు జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటిలోనూ తెలుగుదేశం పార్టీ పోటీకి పెట్టిన అభ్యర్థులకు 65 శాతం ఓట్లు రావడం విశేషం. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ పోటీ చేయకపోయినా, సీపీఎంతో సంబంధాలున్న అభ్యర్థులను పరోక్షంగా బలపరిచింది. వైసీపీ స్వయంగా పోటీ చేసినా ఫలితాల్లో తేడా ఉండేది కాదు. మహా అయితే కూటమికి లభించిన ఓట్ల శాతం కొంత తగ్గేదేమో! అయితే, రాష్ట్ర ప్రజల మూడ్‌ను గమనించి అందుకు అనుగుణంగా తమను తాము సంస్కరించుకొనే బదులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆత్మవంచన చేసుకుంటూ ఆనందం పొందడం ఆశ్చర్యంగా ఉంది. ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న సమయంలో వైసీపీ నాయకులు చేసిన ప్రకటనలు, జగన్ రోత మీడియాలో చేసిన ప్రచారమే ఇందుకు నిదర్శనం. ఉత్తరాంధ్రలో అధ్యాపకుల నియోజకవర్గంలో పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులలో ఎవరికి మద్దతు ప్రకటించాలో తేల్చుకోలేకపోయిన కూటమి, ఆ ఇద్దరిలో ఎవరో ఒకరికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి రెండో అభ్యర్థికి ద్వితీయ ప్రాధాన్య ఓటు వేయాలని సూచించింది. సీపీఎంకు అనుబంధంగా ఉండే యూటీఎఫ్ తరఫున పోటీచేసిన మరో అభ్యర్థిని వైసీపీ పరోక్షంగా బలపరిచింది. ఈ నేపథ్యంలో కూటమి మద్దతు పొందిన గాదె శ్రీనివాసులు నాయుడు, వర్మ మధ్యనే పోటీ జరిగింది. శ్రీనివాసులు నాయుడు విజేతగా నిలవగా, వర్మ ద్వితీయ స్థానంలో నిలిచారు. అయినప్పటికీ, 'కూటమికి ఓటమి' అని రోత మీడియా ప్రచారం చేయడం ద్వారా ఆత్మవంచన చేసుకుంది. మరోవైపు ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ తరఫున అధికారికంగా పోటీచేసిన అభ్యర్థులు ఇరువురూ భారీ మెజారిటీతో గెలిచినా రోత మీడియా విస్మరించింది. తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించారని చెప్పడం ఇష్టం లేక ఫలానా వారు గెలిచారని వారి పేర్లు మాత్రమే ప్రసారం చేశారు. ఇంతకంటే ఆత్మవంచన ఇంకొకటి ఉంటుందా? మీడియా దాచినంత మాత్రాన ఫలితాలు తారుమారవుతాయా? ప్రజల తీర్పు మారిపోతుందా? అల్ప బుద్ధులు బయటపడతాయి అంతే! క్షేత్ర స్థాయి పరిస్థితులను సమీక్షించుకొని దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి రాజకీయ పార్టీలు ఎన్నికల ఫలితాలను దిక్సూచిగా భావిస్తాయి. కానీ, వైసీపీ రూటే సెపరేటు! మాకు చూపు ఎలాగూ లేదు%-% అవతలి వాడికి కూడా ఒక కన్ను పోయింది అని ఆనందించినట్టుగా ఉత్తరాంధ్ర ఫలితాన్ని వక్రీకరించి ఆనందం పొందింది. సీన్ కట్ చేస్తే ఉత్తరాంధ్ర నుంచి నెగ్గిన గాదె శ్రీనివాసులు నాయుడు తన గెలుపు ప్రకటన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబును కలుసుకొని తాను కూటమి అభ్యర్థినేనని చెప్పుకొన్నారు. ఈ సన్నివేశం చూసిన తర్వాత వైసీపీ నాయకులుగానీ, జగన్ రోత మీడియాగానీ ముఖం ఎక్కడ పెట్టుకుందో తెలియదు. సొంత మీడియా ఏర్పాటు చేసుకున్నంత మాత్రాన, కూలి మీడియాను పెంచి పోషించినంత మాత్రాన ప్రజాభిప్రాయం మారదు అని మరోమారు రుజువైంది.

**కామ్రేడ్ల కష్టాలు!**

ఈ సందర్భంగా సీపీఎం గురించి కూడా చర్చించుకోవలసి ఉంది. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత, ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా సీపీఎం ఆయనతో పరోక్షంగా చేతులు కలుపుతూనే ఉంది. జగన్ రెడ్డి వంటి వారితో చేతులు కలపడం వల్ల గతంలో ఆ పార్టీకి ఉండిన విశ్వసనీయతను ఇప్పుడు పూర్తిగా కోల్పోయింది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలలో సీపీఎం అంటే అంతో ఇంతో నిక్కచ్చిగా, నిజాయితీగా ఉంటుందన్న అభిప్రాయం ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు జగన్‌రెడ్డితో చేతులు కలపడానికి సీపీఐ ససేమిరా అంటూ ఉండగా, సీపీఎం మాత్రం ఎప్పటికప్పుడు ఉత్సాహం ప్రదర్శిస్తూ వచ్చింది. సీపీఐ కలసి రానందున, వైసీపీతో నేరుగా పొత్తు పెట్టుకోలేక పోయినందున సీపీఎం రహస్య అవగాహనతో నడిచింది. జగన్ అధికారంలో ఉన్నంత కాలం ఎన్ని అరాచకాలు జరిగినా సీపీఎం పెదవి విప్పలేదు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇటు తెలంగాణలో కూడా ఆ పార్టీ పోకడలను ప్రజలు హర్షించలేదు. దీంతో తెలుగునాట సీపీఎం తన ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైంది. గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓడిపోయిన లక్ష్మణరావుకు ప్రజల్లో కొంత విశ్వసనీయత ఉన్నప్పటికీ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఎం విశ్వసనీయత కోల్పోయినందున భారీ తేడాతో ఓడిపోయారు. ఆయనకు వైసీపీ పరోక్షంగా మద్దతు ఇవ్వడం శాపంగా మారిందన్న అభిప్రాయమూ ఉంది. రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలో కూడా సీపీఎం నాయకత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల ఆ పార్టీ ఇప్పుడు కేరళకు మాత్రమే పరిమితమై ఒక ప్రాంతీయ పార్టీగా కుదించుకుపోయింది. కేరళలో కూడా ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ లేకపోతే ఆ పార్టీ పరిస్థితి ఏమిటో కూడా తెలియదు. తెలుగునాట సీపీఎంకు ఒకప్పుడు బలమైన నాయకులు ఉండేవారు. ప్రజల్లో వారికి విశ్వసనీయత ఉండేది. కానీ, ప్రస్తుత దుస్థితికి ప్రస్తుత నాయకులే ప్రధాన కారణం. నీవు ఎలాంటి వాడివో నీ చుట్టూ ఉండే స్నేహితులను బట్టి చెప్పవచ్చునని అంటారు. ఇప్పుడు జగన్‌రెడ్డితో రహస్య ప్రేమాయణం సాగిస్తున్నందున ఆ ప్రభావం సీపీఎం పైన పడింది. ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన యూటీఎఫ్ అభ్యర్థి గట్టి పోటీ కూడా ఇవ్వలేకపోయారంటేనే ఆ పార్టీ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లక్ష్మణరావు వంటి వ్యక్తి కూడా పరాభవాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.

**జగన్ ఇప్పుడేమంటారో**

సీపీఎం సంగతి అలా ఉంచి, జగన్మోహన్‌రెడ్డి విషయానికి వద్దాం! ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా వాస్తవాలను గుర్తించడానికి ఆయన సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. నిన్నటి దాకా ఈవీఎంల ద్వారా మోసం చేశారని అన్నారు. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లో కూటమి తన మెజారిటీని పెంచుకుంది. ఇప్పుడేమి చెబుతారు? ఈ ఎన్నికల ఫలితాలతో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి బలంగా ఉందని రుజువైంది. కొన్ని విషయాల్లో తెలుగు తమ్ముళ్లు ఆవేశపడుతున్నప్పటికీ దాని ప్రభావం ప్రజల్లో లేదని ఈ ఎన్నికలతో స్పష్టమైంది. పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులకు ఓటు ఎందుకు వేయాలి? అని కొంత మంది తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా ఓటర్లు పట్టించుకోలేదు. తెలుగుదేశం పార్టీకి 65 శాతం ఓట్లు లభించడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోకుండా ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తానే ముఖ్యమంత్రిని అవుతానని తన చుట్టూ ఉన్నవాళ్లు చెబుతున్న మాటలను నమ్ముతూ ఊహాలోకాల్లో విహరిస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప శాసనసభలో అడుగుపెట్టనని మంకుపట్టు పట్టారు. 1994లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లభించకపోయినా ఆ పార్టీ శాసనసభాపక్షం నాయకుడుగా పి.జనార్దన్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారు. నాటి ఆయన పోరాట ఫలితం కూడా 2004లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అవడానికి ఉపయోగపడింది. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభలో మంచి వక్తలుగా రాణించిన వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి, ఓంకార్, గౌతు లచ్చన్న వంటి వారు ప్రధాన ప్రతిపక్ష నాయకులుగా హోదా పొందినవారు కారు. అంతెందుకు, అవమానాలు తప్పవని తెలిసినా 2019 తర్వాత చంద్రబాబు నాయుడు శాసనసభలో పోరాటం చేయలేదా? తనను తాను వీరుడుగా శూరుడుగా చెప్పుకొనే జగన్ రెడ్డి శాసనసభను ఎదుర్కోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారో తెలియదు. సింగడు అద్దంకి వెళ్లనూ వెళ్లాడు, రానూ వచ్చాడు అన్నట్టుగా గవర్నర్ ప్రసంగం రోజు మాత్రం కొద్ది నిమిషాల పాటు సభకు హాజరై ఆ తర్వాత ముఖం చాటేశారు. తెలంగాణలో తనకు గురుతుల్యుడైన కేసీఆర్ కూడా ఇప్పుడు శాసనసభకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వాలను నిలదీయడానికి ప్రతిపక్షంలో ఉన్న వారికి శాసనసభను మించిన వేదిక మరొకటి ఉండదు. తానెవరికీ తలవొంచనని చెప్పుకోవాలనే దుగ్ధ జగన్మోహన్‌రెడ్డిలో అధికంగా ఉంది. అందుకే శాసనసభకు వెళ్లి చంద్రబాబు ముఖం చూడ్డం ఆయన నామోషీగా భావిస్తున్నారేమో తెలియదు. నాయకులు ఎవరైనా తమ ఓటమికి కారణాలను గుర్తించి తనను తాను సంస్కరించుకున్నానని ప్రజలకు నమ్మకం కలిగించగలిగినప్పుడే భవిష్యత్తు ఉంటుంది. చంద్రబాబు కూడా 2019లో ఓడిపోయాక తాను మారతానని ప్రకటించి కార్యకర్తల్లో భరోసా నింపే ప్రయత్నం చేశారు. అసలు తాను ఓడిపోయానని కూడా అంగీకరించడానికి సిద్ధంగా లేని జగన్‌రెడ్డి తనను తాను సంస్కరించుకొనే ప్రయత్నం చేస్తారని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఆయన అనవసరంగా నోరు పారేసుకుంటున్నారు. తాజాగా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ కార్పొరేటర్‌కు ఎక్కువ%-%ఎమ్మెల్యేకు తక్కువ అని కించపరిచారు. ఇప్పుడు ఆయనను అవమానించడం అవసరమా? అంటే జగన్‌కు ఎవరు చెప్పాలి? ఒక్కోసారి మన కళ్లే మనల్ని మోసం చేస్తాయని అంటారు. జగన్‌రెడ్డి కూడా తన చుట్టూ ఉన్న వాళ్లు తనకు నిజం చెబుతున్నారా? లేదా? తాను కళ్లు చెవులుగా భావించే రోత మీడియా తనను సరైన మార్గంలో నడిపిస్తున్నదా? లేక తప్పుదారి పట్టిస్తున్నదా? అన్నది స్థిమితంగా ఆలోచించుకోవడం మంచిది. పవన్ కల్యాణ్‌ను అవమానించడం అంటే కూటమి ఐక్యతను పటిష్ఠం చేయడమే అన్న చిన్న లాజిక్‌ను కూడా జగన్‌రెడ్డి విస్మరిస్తే ఎలా? నేను ఇంద్రుడిని, చంద్రుడిని అని జగన్‌రెడ్డి భావిస్తారు. ఆయన చుట్టూ ఉండే వాళ్లు కూడా, 'అన్నా నువ్వు పులివి, సింహానివి' అని రెచ్చగొడతారు. అలాంటి వారికి నిజాలు కనిపించవు. మంచి మాటలు చెవికెక్కవు. ప్రస్తుతానికి జగన్‌రెడ్డి పరిస్థితి గాల్లో దీపంలా ఉంది. ఆ దీపం ఎంత కాలం వెలుగుతుందో వేచి చూద్దాం!

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY


# దేవుళ్లు, రాక్షసుల మధ్య యుద్ధం జరిగితే.. కుంభమేళ ఎందుకొచ్చిందంటే..?



అమృతం కోసం పాల సముద్రాన్ని చిలికినప్పుడు దేవతలు, రాక్షసుల మధ్య యుద్ధం జరిగింది. అందులో 12 చుక్కల అమృతం ఒలికి 4 చుక్కలు భూమిపై,8 చుక్కలు స్వర్గంలో పడ్డాయి. ఆ 4 చుక్కలు నదుల్లో పడ్డాయి. 12ఏళ్ల ఓ సారి అక్కడ కుంభమేళ నిర్వహిస్తారని హిందూ పురాణాలు చెబుతున్నాయి. దేవతలు, రాక్షసుల మధ్య భీకర యుద్ధం వచ్చింది. అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలుకుతుండగా.. మత్తెక్కించే సురాభాండం, అప్సరసలు, అమూల్యమైన మాణిక్యాలు, కోరికలు తీర్చే కల్పవృక్షము, కామధేనువు, ఐరావతం, విషం, పారిజాత వృక్షం పాలసముద్రం నుంచి బయటకొచ్చాయి. వాటిని ఇరువురూ పంచుకున్నారు. చివరికి అమృతం విషయంలో దేవతలు, రాక్షసుల మధ్య వివాదం తలెత్తింది. మాకంటే.. మాకని దేవతలు, రాక్షసులు యుద్ధానికి దిగారు. ఆ రణరంగమంతా దద్దరిల్లింది. అప్పుడు అమృతం ఉన్న కలశం జారిపోయి 12 చుక్కలు కిందపడ్డాయి. వాటిలో 8 చుక్కలు స్వర్గంలో, నాలుగు చుక్కల అమృతం భూమీద పడింది. అవే ఇప్పటి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని, మహారాష్ట్రలోని నాసిక్.

**పురాణాల్లో కుంభమేళ**

పురాణాల ప్రకారం.. ఈ ప్రదేశాలు పుణ్యక్షేత్రాలుగా చెప్పుకుంటారు. భాగవతం, మహాభారతం, గాథ రామాయణం, ఇతిహాసాలు, ఆధ్యాత్మిక గ్రంథాల్లో ఈ క్షీరసముద్రం గురించి ప్రస్తావించారు. ప్రయాగ్‌రాజ్ సంగమం, ఉజ్జయిని శిప్రా, హరిద్వార్‌లోని గంగ, నాసిక్‌లోని గోదావరిలో అమృతపు చుక్కలు పడ్డాయని పురాణాల్లో పేర్కొన్నారు. అందుకే ఈ నదుల ఒడ్డున 12 సంవత్సరాలకు ఓసారి కుంభమేళా నిర్వహిస్తారు. కుంభమేళలో పవిత్రస్నానాన్ని ఆచరించడానికి ప్రపంచ నలుమూలల నుంచి కోట్లాది భక్తులు వస్తారు. 2025 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు.. 45 రోజులపాటు ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా ఉత్సవాలకు జరగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు యూపీ ప్రభుత్వం రూ. 7,500 కోట్లను మంజూరు చేసింది. దాదాపు 40 కోట్లమందికి పైగా భక్తులు.. సాధువులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కుంభవేళ రహస్యాలేంటి? అర్ధ కుంభ, పూర్ణ కుంభ, మహాకుంభమేళాల మధ్య తేడాలేంటి? హిందూ పురాణాలు కుంభవేళ గురించి ఏం చెబుతున్నాయని తెలుసుకోవడానికి ఈ వీడియో స్కిప్ చేయకుండా చూడండి.

**అర్థ, పూర్ణ, మహాకుంభమేళ మధ్య తేడా**

హిందూ క్యాలెండర్ ప్రకారం.. ప్రయాగ్‌రాజ్ సంగమంలో మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభమై, ఫిబ్రవరి 26 న మహాశివరాత్రితో ముగుస్తుంది. ప్రతి ఆరేళ్లకోసారి జరిగే కుంభమేళాను అర్ధ కుంభమేళా అంటారు. ఇది ప్రయాగ్‌రాజ్, హరిద్వార్‌లో మాత్రమే జరుగుతుంది. 12 సంవత్సరాలకు ఓసారి నిర్వహించే కుంభమేళాను పూర్ణకుంభమేళ అంటారు. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున దీన్ని నిర్వహిస్తారు. చివరిసారిగా 2013 లో ఇక్కడ పూర్ణ కుంభమేళా జరిగింది. 12 పూర్ణ కుంభమేళాలు నిర్వహిస్తే.. 144 సంవత్సరాలు పూర్తి అవుతుంది. ఇలా 144ఏళ్లకు వచ్చే కుంభమేళను మహాకుంభమేళ అంటారు. 2025 ప్రయాగ్‌రాజ్‌లో జరగబోయే కుంభమేళ 144 ఏళ్ల తర్వాత వచ్చినది. అందుకే దీనికి చాలా ప్రాముఖ్యత ఉంది. భూమి మీద 144 సంవత్సరాలు.. దేవతలకు 12 సంవత్సరాలతో సమామని పురాణాలలో చెప్పుకుంటారు.

**గ్రహాల కదలికలను బట్టి..**

జ్యోతిష్యశాస్త్రంలో గ్రహాల కదలికలను బట్టి కుంభమేళను నిర్వహిస్తారు. సూర్యుడు మకరరాశిలో బృహస్పతి వృషభరాశిలో ఉన్నప్పుడు ప్రయాగ్‌రాజ్‌లోని సంగమ క్షేత్రంలో కుంభమేళా జరుగుతుంది. బృహస్పతి కుంభరాశిలో.. సూర్యుడు మేషరాశిలోకి సంచరిస్తున్నప్పుడు హరిద్వార్‌లోని గంగా నదిలో కుంభమేళ నిర్వహిస్తారు. గురుడు సింహరాశిలోకి ప్రవేశించినప్పుడు నాసిక్‌లోని గోదావరిలో కుంభమేళా నిర్వహిస్తారు. బృహస్పతి సింహరాశిలో.. సూర్యుడు మేషరాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలోని శిప్రా నదిలో కుంభమేళా నిర్వహిస్తారు.

**చరిత్ర ఏం చెబుతుందంటే..?**

అమృతం కోసం జరిగిన యుద్ధంలో చంద్రుడు అమృతాన్ని ప్రవహించకుండా కాపాడాడని. గురువు కలశం దాచాడని. సూర్య దేవుడు కలశాన్ని పగిలిపోకుండా కాపాడాడని.. శనిదేవుడు ఇంద్రుని కోపం నుంచి రక్షించాడని పురాణాల్లో ఉంది. అందుకే ఈ గ్రహాలు కలిసిన సమయంలో మహాకుంభం నిర్వహించబడుతుంది. ఎందుకంటే ఈ గ్రహాల కలయిక వేళ అమృత పాత్ర రక్షించబడింది. ఆ తర్వాత దేవతలందరూ విష్ణుమూర్తి సాయంతో అమృతాన్ని సేవించారు. మహాకుంభమేళా వేళ చేసే స్నానాన్ని రాజస్నానంగా పరిగణిస్తారు. కుంభమేళ సమయంలో నదిలో నీరు అమృతమని హిందువులు విశ్వసిస్తారు. అందులో స్నానమాచరిస్తే సకల దేవతల అనుగ్రహం లభిస్తుందని కూడా నమ్ముతారు. కుంభమేళా స్నానానికి దాదాపు 850 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. దీన్ని ఆదిశంకరాచార్యులు ప్రారంభించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. కొందరు పండితులు దీన్ని గుప్తుల కాలం నుంచి ప్రారంభించినట్లు చెబుతారు. కొందరు చరిత్రకారులు హర్షవర్ధనుడి కాలంలో కుంభమేళా ఆధారాలు ఉన్నాయని వాదిస్తున్నారు.


**ప్రయాగ్‌రాజ్ కుంభమేళ విశేషాలు**

ఈ కుంభమేళాలో 5.5 కోట్ల రుద్రాక్షలతో 12 జ్యోతిర్లింగాలను సిద్ధం చేస్తున్నారు. 11వేల త్రిశూలాలను కూడా ఉపయోగించనున్నారు. మొదటి స్నానానికి ముందు మొత్తం 12 జ్యోతిర్లింగాలను సిద్ధం చేశారు.మొదటి స్నానానికి ముందు మహాకుంభానికి వచ్చే భక్తులకు ఇది ప్రధాన ఆకర్షంగా నిలవనుంది. అమేథీలోని మహాకుంభ సెక్టార్ 6లోని సంత్ పరమహంస ఆశ్రమంలో ఈ ప్రత్యేకమైన జ్యోతిర్లింగాన్ని నిర్మిస్తున్నారు. ఈ శిబిరం నాగవాసుకి ఆలయం ముందు ఉంది. దీనికోసం నేపాల్, మలేషియా నుంచి రుద్రాక్షలను దిగుమతి చేశారు. ప్రతి జ్యోతిర్లింగం 9 అడుగుల వెడల్పు, 11 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇందులో ఉపయోగించిన 11వేల త్రిశూలాలకు తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు రంగులు వేస్తారు. జనవరి 12 నాటికి 12 జ్యోతిర్లింగాల నిర్మాణ పనులు పూర్తవుతాయని, జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు భక్తులను దర్శనానికి, పూజలకు అనుమతిస్తారు.

**రాజస్నానాల వివరాలు..**

ఈ మహా కుంభానికి దేశం నలుమూలల నుంచి సాధువులు వస్తారు. వీరిలో అఖారాకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. అఖారా అంటే సాధువులు, ఋషుల సమూహం. మహాకుంభంలో వివిధ అఖారాలకు చెందిన సాధువులు పవిత్ర నదిలో స్నానం చేస్తారు. శంకరాచార్యులు సనాతన ధర్మం, హిందూ మతాన్ని రక్షించడానికి వీళ్ళను సృష్టించారట.వీరి సమూహాన్నే అఖారాలని అంటారు. దేశవ్యాప్తంగా 13 అఖారాల సమూహాలు ఉన్నాయి. 2025 జనవరి 13న పుష్య పౌర్ణమి నాడు మహాకుంభమేళా ప్రారంభమై తొలి రాజస్నానం జరుగుతుంది. రెండో రాజస్నానం మకర సంక్రాంతి రోజు అంటే 2025 జనవరి 14న నిర్వహిస్తారు. మూడవ షాహీ స్నాన్- మౌని అమావాస్య రోజు 2025 జనవరి 29 న, నాల్గవ రాజస్నానం ఫిబ్రవరి 3 వసంత పంచమి నాడు,ఐదవ రాజ స్నానం ఫిబ్రవరి 12న మాఘ పూర్ణిమ నాడు, ఆరవ షాహీ స్నానం ఫిబ్రవరి 26న మహాశివరాత్రి రోజే మహాకుంభమేళా చివరి రోజు.ఇలా 12 సంవత్సరాలకు ఓసారి ఘనంగా కుంభమేళ నిర్వహిస్తారు.హిందువులు పవిత్ర స్నానం ఆచరించడానికి ఎంతో ఆసక్తి చూపిస్తారు.

# రెక్కలు విరిగిన కాలం



విలువలు ఏమయ్యాయి? దిక్కులు పిక్కటిల్లేలా అరిచినా లాభం లేదు. కాలంలో బోలెడు మార్పులు. ఒకప్పుడు ఏది నిజం అనుకుంటామో అది అబద్ధం ఇపుడు. ఎవరూ కాదనలేరు. మనిషి ఒక్కడే. నాగరికత పెరిగింది.

**విలువలు ఏమయ్యాయి**

దిక్కులు పిక్కటిల్లేలా అరిచినా లాభం లేదు. కాలంలో బోలెడు మార్పులు. ఒకప్పుడు ఏది నిజం అనుకుంటామో అది అబద్ధం ఇపుడు. ఎవరూ కాదనలేరు. మనిషి ఒక్కడే. నాగరికత పెరిగింది. నీతి ఒక అర్హత. నిజాయితీ ఒక విలువ. మాటంటే జరగాల్సిందే. వేరే కాగితాలు అనవసరం. నోటి మాట శిలాశాసనం. వెనక్కి తీసుకోలేం. ఇప్పుడైతే నాలుక ఎన్ని మడతలైనా తిరగొచ్చు. నిన్న చెప్పింది నేడు కాదు. సమర్ధింపులకు లోటుండదు. అన్నీ వ్యూహాలే. కలసి రావాలి అంతే. ఎవరేమనుకున్నా పర్వాలేదు. అన్యాయమైనా సరే. లబ్ధి ముఖ్యం. వెయ్యేళ్లో... ఇంకా అంతకు మునుపో... కాల యంత్రాన్ని వెనక్కి తిప్పితే.వీరాస్వామి దూకుడుగా అడుగులేస్తున్నాడు. వెలుతురు నెమ్మదిగా జారిపోతోంది. చీకటి కమ్ముకుంటోంది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. చేతిలో వంకరగా ఉన్న కందికర్ర. కొమ్మల కనుపులు చెక్కిన కర్ర. గాలిలో విన్యాసం చేస్తున్నట్టు ఊపుతున్నాడు. లేచిన వేళ మంచిదే. ఉదయాన రాహు కాలం చూసుకునే బయటకు వచ్చాడు. శివయ్య తప్పక కనిపిస్తాడు. ఈసారి నంగి నంగి మాటలకు లొంగ కూడదు.

శివయ్య ధర్మబద్ధంగా నడుచుకునే వ్యక్తే. సందేహం లేదు. మరెందుకు తాత్సారం చేస్తున్నాడు? వీరాస్వామి రెండు రోజులుగా ఎదురుచూస్తున్నాడు. శివయ్య కోసం. అతన్ని నిలదీయడం కోసం. తప్పించుకుని తిరుగుతున్నాడా? అట్లాంటి వాడు కాదే.శివాలయం. కాగడాల వెలుగు. నలుగురూ కూడి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. వీరాస్వామి ఆగాడు. ప్రతి ఒక్కరి తల మీదా తలపాగాలు. కొంతమందికి గిరజాల జుట్టులున్నాయి. చెవులకు కమ్మలున్నాయి. మీసాలున్నాయి. శివయ్య ఆ గుంపులో ఉన్నాడా.వీరాస్వామి ఊహ నిజమే. శివయ్య ఉన్నాడు. భయంగా లేచి నిలబడ్డాడు.అయ్యా...తండ్రీ...ఇక్కడే ఉన్నావా? శివయ్యాకనులు కాయలు కాచాయి, నాయనా...తమరు ఒకసారిలా వేంచేయండి ప్రభూ...ఐఐ వీరాస్వామి తెచ్చుపెట్టుకున్న గౌరవభావంతో వ్యంగ్యంగా అన్నాడు.శివయ్య లేచాడు. చేతులు కట్టుకుని వీరాస్వామి ముందు నేరం చేసినవాడిలా నిలబడ్డాడు. తల వంచుకున్నాడు. నేల చూపులు...కళ్లల్లో నీళ్లు...జరగబోయేది అవమానమే...అది ఖాయమే.ఏమండీ...ఇక్కడున్నవారు వింటు న్నారా? ఈ పెద్ద మనిషి నాకు కొంత రొక్కం బాకీ...గడువు దాటింది. ముఖం చాటేస్తున్నాడు. ఏం చేయాలి? ఐఐ అని చెప్పి చేతిలో కందికర్రను శివయ్య చుట్టూ వలయం తిప్పాడు. గీత ఏర్పడింది.నా బాకీ ఎప్పుడిచ్చి చస్తావ్... చెల్లుబాటు చేసే ఈ గీత దాటాలి. దేవుని ఆజ్ఞతో చేస్తున్నాను ఈ పని. కట్టుబాటు తెలుసు కదా ఐఐ అని వీరాస్వామి నడుం మీద చేయి వేసి నిలబడి తీవ్ర స్వరంతో అన్నాడు. అక్కడున్న అందరూ నిశ్చేష్టులై చూస్తున్నారు.శివయ్య బిక్కచచ్చిపోయాడు. ఏదైతే జరగకూడదని అనుకుంటారో అదే జరగబోతోంది.బాబ్బాబు... గడువు ఇవ్వండి. మాసం చాలు. నా మాట నమ్మండి. గీత చెరిపేయండి. నన్ను బయటకు వెళ్లేలా అనుమతి ఇవ్వండి...బాబ్బాబూ...డబ్బులు ఎగ్గొట్టేవాడిని కాను. నా మీద విశ్వాసం ఉంచండి ఐఐ కళ్ల నీళ్ల పర్యంతమై బతిమాలుకున్నాడు. కాళ్లకు నమస్కరించాడు. నువ్వు మళ్లీ చిక్కవు. బాకీ మొత్తం చెల్లించి బయటపడు...ఐఐ కఠినంగా అన్నాడు వీరాస్వామి.మీరైనా చెప్పండి, అన్నలారా... ఒక్క మాసం...తల తాకట్టు పెట్టి తీరుస్తాను.అక్కడున్న వాళ్లలో వొక ముసలాయన వీరాస్వామి దగ్గరకొచ్చాడు. వీరాస్వామీ... శివయ్య తెలియని వాడు కాదు... అతను కోరినట్టు గడువు ఇవ్వకూడదా? ముఖం చూడు ...సిగ్గుతో ఎలా కుచించుకుపోయాడో...తప్పక ఇచ్చేస్తాడు...ఒక అవకాశం ఇయ్యి...కాస్త..ఐఐ పెద్దాయన మాటలు పూర్తవ్వలేదు.మీరు పూచీ పడతారా? ఒక్కటే మాట...ఐఐ పెద్దాయన బదులివ్వలేదు. అంత శక్తి లేకపోవడంతో తటపటాయించాడు.సరిగ్గా అదే సమయానికి శివయ్య బావమరది లింగయ్య అటు వచ్చాడు. పరిస్థితి గమనించాడు. సన్నటి వెలుతురులో దైన్యంగా గీతలో నిలబడ్డ శివయ్యను చూశాడు.లింగయ్యకు బావ శివయ్యతో తగాదాలున్నాయి. క్రితం రోజే తీవ్రంగా మాటామాటా అనుకున్నారు. ఒకళ్ళ మీద మరొకరు అరచుకున్నారు. మధ్యలో శివయ్య భార్య అడ్డుకున్నప్పటికీ వాగ్వాదం ఆగలేదు. మాటలు విసురుకుంటే ఏముంది వెనక్కి తీసుకోగలమా?లింగయ్య ఆదుకుంటాడనే ఆశ లేదు శివయ్యకు. నిర్లిప్తంగా ఆకాశం లోని నక్షత్రాలను చూస్తూ ఉండిపోయాడు. చెదురుగా పొరలు పొరలుగా ఉన్న మేఘాలు దట్టంగా అలుముకుంటున్నాయి.లింగయ్య తిన్నగా వీరాస్వామి దగ్గరకెళ్ళాడు. పలకరించాడు. దణ్ణం పెట్టాడు.మీ డబ్బుకు నాదీ హామీ. మా బావ ఇవ్వకపోతే నేనిస్తాను. పూచీ నాది. వారం రోజుల్లో మీకు సరిపెడతాను. ఆ గీత చెరిపి మా బావను విడుదల చేయండి ఐఐ అన్నాడు లింగయ్య ప్రాధేయపూర్వకంగా.ఇదిగో... శివయ్యను ఇక నేను అడగను. నీవే బాకీ అనే పక్షంలో...నాదేం పోయింది. ఒప్పుకుంటాను ... ఇంతమంది చూస్తున్నారు. నీవు మాట తప్పకూడదు. లేకపోతే నీకూ ఇదే గతి పడుతుంది...జాగ్రత్త.సరే... నేనే బాకీ ఐఐ అన్నాడు లింగయ్య స్థిరంగా. శివయ్య ఊహించలేదు. కుటుంబం పరువు ముఖ్యం. మనుషుల మధ్య ఉన్న వైషమ్యాలు కావు."నేను పెట్టిన ఆన వెనక్కి తీసుకుంటున్నాను. నాకు శివయ్య బాకీ లేదు. బదలాయింపు జరిగింది. అతనికి బదులు లింగయ్య జవాబుదారీ. వారం రోజుల్లో చెల్లింపులు చేస్తానన్నాడు గనుక ఓ భగవంతుడా... ఈ హద్దు చెరిపేస్తున్నాను. శివయ్య ఇక బయటకు రావొచ్చు" అని చెప్పి గీసిన గీత ఆనవాలు లేకుండా చెరిపేసాడు. చేతులు జోడించి తల మీద పెట్టుకుని భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తున్నట్లు ఏదో గొణుక్కున్నాడు.శివయ్య అలాగే నిలబడిపోయాడు. ఊపిరి పీల్చుకున్నాడు. ఆప్యాయంగా లింగయ్య కేసి చూశాడు. అప్పటికే అతను అక్కడ్నుంచి కదిలాడు.మనిషి నీతి నియమాలు పోషించడానికి ఏ కాలానికి ఆ కాలం కొన్ని ఏర్పాట్లు చేసుకుంటుంది. మనిషి చుట్టూ గీత గేస్తే డబ్బు చెల్లించేంత వరకు నిశ్చలంగా ఉండాల్సిందే. రాత్రి...పగలు..ఎండా వానా పట్టించుకోకుండా ఆ గీత లోనే ఉండాలి. ఒకవేళ మొండిగా ఆ గీత దాటితే వాడికి ఆ ఊళ్ళో గౌరవం ఉండదు. చీదరించుకుంటారు. చీత్కారాలు చేస్తారు. నేరగాడిగా పరిగణిస్తారు. ఎవరూ మాట్లాడరు. ఒకలాంటి వెలి.మరో అయిదొందల ఏళ్ల తర్వాత.దక్షిణ భారతదేశం. తమిళ భాషా ప్రాంతం. చిన్న గ్రామం. అంతా చేసి వందమంది జనాభా. ఎక్కువమంది వృత్తి వ్యవసాయం. మిగిలినవారు చిన్నా చితకా వ్యాపారం చేస్తారు.శంకరన్ దిగులుగా ఉన్నాడు. నైరాశ్యంతో కొట్టుమిట్టాడుతున్నాడు. తనను రక్షించేవారెవరు? కుటుంబం రోడ్డున పడకుండా కాపాడేదెవరు?పంట దెబ్బతింది. చేసే చిన్న వ్యాపారం కూలబడింది. ఏం చేయాలో పాలుపోవడం లేదు. మరల నిలదొక్కుకోవడం ఎలా? ప్రస్తుత పరిస్థితి నుండి బయటపడేదెలా?గ్రామ పెద్ద సుందర మురుగన్. మంచివాడు. అందరి కష్టసుఖాలు తెలుసుకుంటాడు. అందరి క్షేమం కోరుకుంటాడు. అవసరమైన వారికి సాయపడతాడు. భారం భగవంతుని మీద వేయడు. గ్రామంలోని వారందరూ కుటుంబసభ్యులుగా భావిస్తాడు.ఆ రోజు గట్టిగా వర్షం పడుతోంది. రెండురోజులుగా అదే పనిగా కురుస్తోంది. వర్షం...వర్షం.. .మున్నెన్నడూ చూడనంత వర్షం... కుండపోత.సాయంకాలానికి తగ్గింది. జల్లులు పడుతున్నాయి. తాటాకులతో నేసిన గూన వంటి గొడుగులు తలపై పెట్టుకుని వీధంటా నడుచుకుంటూ పోతున్నారు. వాతావరణం తడిగా చిరాకుగా ఉంది.సుందర మురుగన్ రోడ్డు మీదకు వచ్చాడు. దూరంగా శంకరన్ నడిచి వస్తున్నాడు. కొద్దిగా కుంటుతున్నట్టు నడుస్తున్నాడు. దగ్గరకు రాగానే ఆ వచ్చేది శంకరన్ అని గుర్తు పట్టాడు. పక్క సందు లోకి వెళ్ళబోతున్నాడు.శంకరన్...శంకరన్ గట్టిగా పిలిచాడు. పిలుపు వినిపించింది. "దండాలయ్యా.." గొడుగు పక్కకు తొలగించి ముఖం కనపడేలా వంగి నిలబడి నమస్కరించాడు. శంకరన్ గురించి కొద్ది రోజులుగా వింటున్నాడు. కలిసి రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. అతని శ్రమ వృధా అవుతోంది. మనిషి డీలా పడిపోయాడు. కళ్లు లోతుకు పోయాయి. మాట బలహీనం అయ్యింది. బతుకు భారమౌతుందన్న సంగతి తెలుస్తోంది. "శంకరన్ ... ఒకళ్ల జోలికెళ్లవు. నీ పని నీదే. నీ కష్టం నిన్ను ఒడ్డున పడేయడం లేదు. ఈ వర్షం కాస్త తగ్గాక ఒకసారి కనపడు.." సుందర మురుగన్ అప్పటికే ఒక నిశ్చయానికి వచ్చేడు. భరోసా ఇస్తున్నట్టు దగ్గరకు వచ్చి భుజం తట్టాడు. శంకరన్ అడిగిందేమీ లేదు. ఊళ్లో ఒక స్థాయిలో గౌరవంగా బతుకుతున్నాడు. ఇపుడు ఆర్థికంగా చతికిలపడ్డాడు. అందుకు ఎవరినీ నిందించలేదు. సుందర మురుగన్ సర్వం గ్రహించాడు.సుందర మురుగన్ తన ఆలోచనను అమలులో పెట్టాడు. ఊళ్లో వాళ్లకు చెప్పాడు. అందరూ సంతోషంగా ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. ఎవరూ వ్యతిరేకించలేదు. తర్జనభర్జనలు లేవు. ఇది గొప్ప విషయం.ఆదివారం భోజన కార్యక్రమం. శంకరన్ ఇంట ఏర్పాటు చేశాడు. అందుకు కావాల్సిన సరకులు శనివారం ఉదయం నుండే రావడం మొదలెట్టాయి. బియ్యం, కూరగాయలు, పాలు.శంకరన్ ఆదివారం బ్రహ్మాండమైన భోజనం తయారు చేయించాడు. ఉల్లాసంగా కథలు, కబుర్లు చెప్పుకున్నారు. పాటలు పాడారు. ఒకే కుటుంబం అన్నట్టు మెలిగారు.నేల మీద కూచోడానికి బట్టలు పరచారు. అరటి ఆకుల్లో వడ్డనలు. కొసరి కొసరి తినిపించారు. అందరూ తృప్తిగా విందు ఆరగించారు. శంకరన్ సంతోషించాడు.ఆ ఊరికి ఒక ఆచారం ఉంది. కారణాంతరాల వల్ల చితికిపోయిన గృహస్థును ఆదుకునే సత్సంప్రదాయం అది. ముందు వ్యక్తిని గుర్తిస్తారు. భోజనానికి వస్తామని కబురు పంపుతారు. కావాల్సిన సరకులు ఆ ఇంటికి పంపుతారు. భోజనం చేస్తారు. భోజనం ముగించిన తర్వాత యథాశక్తి విస్తరి కింద కొంత సొమ్ము ఉంచుతారు. ఆరోజు అదే జరిగింది శంకరన్ విషయంలో విస్తర్ల కింద కాసులు లెక్కించాడు శంకరన్. ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఊహించనంత మొత్తం. తన కష్టాల్ని గట్టెక్కించేంత సొమ్ము దఖలు పడింది. ఆకాశం వైపు సూర్యుడు ఉన్న దిక్కుకు తిరిగి నమస్కారం చేసాడు. ఊరి వారి ఔదార్యానికి మురిసిపోయాడు. మరల వ్యవసాయం మొదలెట్టొచ్చు. కొంత కాలం ఆగి వ్యాపారం చేసుకోవచ్చు. ఊరు సమిష్టి తలంపు....వ్యక్తి శ్రేయస్సు పట్ల సామాజిక బాధ్యత.

**ఇప్పటికి ఏభై ఏళ్ల క్రితం.. అంటే 1970 దశకం**

రామ్మూర్తిరాజు అని ఒకడుండేవాడు. తెల్లటి గుబురు మీసాలు. నుదుట కుంకుమబొట్టు. ముంజేతికి కడియం. చూడగానే గౌరవం ఉట్టి పడుతుంది. ఉన్నదాంతో సంతృప్తి పడే పెద్ద మనిషి తరహా ఎవరికైనా పదీ పరకా కావాలంటే రామ్మూర్తిరాజే దిక్కు. అలా రప్పించుకుని సాయపడటం సరదా. అవసరానికి ఆదుకునే మహానుభావుడు అంటారు సహాయం పొందినవారు. ప్రాంసరీ నోట్లు రాయించుకుంటాడు. సాక్షి సంతకాలు పెట్టించుకుంటాడు. మూడేళు గడిస్తే తిరగ రాయించుకుంటాడు. ఇచ్చే డబ్బు వెయ్యి నుంచి అయిదు వేల వరకు. అదే గొప్ప అప్పుడు.తమ్ముడు పుల్లంరాజు. ఆస్తి పంపకాలు అయ్యాయి. ఉమ్మడిలో అప్పులిచ్చిన బాపతు ప్రాంసరీ నోట్లు పంచుకోలేదు. అప్పులివ్వడమే తప్ప వసూలు చేయడం లేదని తమ్ముడికి లోలోన బాధ ఉంది. అన్నగారిని అడగలేడు. నోరు రాదు. ఆయన ఎదురు నిలిచి మాట్లాడలేదు. చిన్నప్పట్నుంచీ అంతే. ఇద్దరి మధ్య వయసు తేడా చాలా ఉంది కూడా తమ్ముడికి ఎదిగిన కొడుకు రవి. అప్పటికి కొత్త తరం. ఆవేశపరుడు."ఎందుకు భయం? పెద బావజీని అడిగితే కొంపలంటుకుంటాయా? ఎందుకు నోట్లు మురగబెట్టుకోవడం? నేనడగనా?" అన్నాడు రవి తండ్రితో .

# బాలికకు బంగారు భవితనిద్దాం

దేశంలోని బాలిలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి, తగిన అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రతి ఏడాది జనవరి 24న కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ బాలికా దినోత్సవాన్నినిర్వహిస్తున్నది. ఆధునికయుగంలో బాలికలు అమ్మ గర్భంలోనుంచే వివక్షకు గురవుతున్నారు.మనిషి జీవితంలో బాల్యం ఎంతో మధురమైనది. స్వేచ్ఛగా జీవించి ,ఎదిగే హక్కు, బాలుడితో పాటు బాలికకు ఉంది. కానీ, ఇది ఆచరణలో అమలు కావడం లేదు. తల్లి గర్భంలో నలుసుగా పడింది మొదలు మన దేశంలో ఆడబిడ్డ ఎదుర్కొంటున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా బాలికల పట్ల కొనసాగుతున్న వివక్షతను తొలగించి , వారి సమగ్రాభివృద్దే లక్ష్యంగా 2009 నుంచి ప్రతి ఏటా జనవరి 24 న జాతీయ బాలిక దినోత్సవం జరుపుకుంటున్నాము.ఇదే రోజు భారత మొదటి మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరగాంధీ గారు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ చారిత్రక ఘట్టాన్ని మన దేశంలో మహిళా సాధికారతకు చిహ్నంగా చూడడం ఒక ఆనవాయితీగా వస్తుంది. దేశంలోని బాలిలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి, తగిన అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 24న కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ చొరవతో జాతీయ బాలికా దినోత్సవాన్ని పాటిస్తూ వస్తున్నారు. బాలికల హక్కులపై అవగాహన కల్పించడం, బాలికా విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారాలకు ప్రాముఖ్యం ఇవ్వడం కూడా బాలికా దినోత్సవం లక్ష్యాలు.నేటి ఆధునిక యుగంలో బాలికలు అమ్మ గర్భంలో నుంచే వివక్షకు గురవుతున్నారు. మన దేశంలో గుళ్ళో దేవత పూజలు, ఇంట్లో బాలికపై వివక్ష సంస్కృతి తరతరాల నుంచి కొనసాగుతుంది. ఈ సమస్య ఇలాగే కొనసాగితే ఎన్నో విపరీత పరిణామాలకు, సాంఘిక ఉత్పాతాలకు దారి తీస్తుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. మగపిల్లవాడు వంశోద్ధారకుడనే సామాజిక అపోహల వల్ల మగపిల్లలకు ప్రాధాన్యత పెరిగి లింగ నిష్పత్తి గాడితప్పుతుంది. 2001 జనాభా లెక్కలు ప్రకారం జాతీయ స్థాయిలో బాలబాలికల లింగ నిష్పత్తి 1000:927 కాగా...అది 2011 నాటికి 1000:914 పడిపోయింది. %చీఎఖీ%-5 ప్రకారం భారతదేశంలో 23శాతం బాల్యవివాహాలు జరుగుతున్నట్లు పేర్కొన్నది.రాష్ట్రాల వారీగా చూస్తే పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలలో 41శాతం బాల్యవివాహాలు జరుగుతున్నవి. ఇవీ గ్రామంలో అధికంగా ఉండడం ఆందోళనకరం. ఈ విషయంపై సామాజిక అవగాహన పెంచి పీడన నుంచి బాలికలకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఆశించిన ఫలితం దక్కడం లేదు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు చాప కింద నీరులా కొనసాగుతున్నాయి. తద్వారా జన్మనిచ్చే మహిళే జన్మ హక్కును కోల్పోవడం జరుగుతుంది. పేదరికం, నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, అక్రమ రవాణా బాలిక సాధికారతకి గొడ్డలిపెట్టుగా మారాయి. నేడు బాలికల రక్షణ కూడా ప్రశ్నార్థకంగా మారుంది. అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు బలవుతున్నారు. ఇటీవల చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పాక్సో) కింద కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తుంది.

**బాలిక ఎదుగుదలకు కృషి జరగాలి**

పలువురు భారతీయ మహిళలు ప్రపంచ నాయకులుగా విభిన్న రంగాలలో శక్తివంతమైన పాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ దేశంలోని చాలా మంది మహిళలు, బాలికలు లోతుగా పాతుకుపోయిన పితృస్వామ్య అభిప్రాయాలు, నిబంధనలు, సంప్రదాయాల నుంచి విముక్తి కాలేకపోతున్నారని యునెస్కో స్పష్టం చేసింది. తద్వారా తమ హక్కులను పూర్తిగా అనుభవించలేకపోతున్నారని పేర్కొన్నది. బాలబాలికల సాధికారతకు సమానంగా మద్దతు ఇస్తే తప్ప భారతదేశం పూర్తిగా అభివృద్ధి చెందదని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో బాలికల హక్కులను కాపాడటంలో మొదట బాలికా విద్యను ప్రోత్సహించాలి. ఇది సమాజంలో అసమానతలను తగ్గిస్తుంది. దీనికై జాతీయ విద్యా విధానం-2020లో బాలిక అభివృద్ధికి లింగ సమ్మిళిత నిధి ప్రవేశపెట్టింది. ఇది నాణ్యమైన, సమానత్వంతో కూడిన విద్యను అందించడంలో ఎంతో తోడ్పడుతుంది.బాలికా సంక్షేమం నిధులతో ముడిపడి ఉంది. ఇప్పటివరకు వారికోసం పలు పథకాలు ప్రవేశ పెట్టినప్పటికి అమలుకు నిధులు సమస్య వెంటాడుతుంది. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలిక అభివృద్ధి పట్ల ప్రత్యేక చొరవ చూపాలి. బేటీ బచావో- బేటి పఢావో" ప్రభుత్వనినాదమే కాదు మన అందరి నినాదం కావాలి. పౌర సంస్థలు, ప్రభుత్వం వారి హక్కుల పట్ల అవగాహన కల్పిస్తూ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేయాలి. తల్లిదండ్రులు ఆడపిల్లలను సంస్కృతి, సంప్రదాయాల పరిధిలో బంధించి వారి సాధికారతను దెబ్బతీయవద్దు. అబ్బాయిలతో సమానంగా విద్యావకాశాలను కల్పించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలి. అప్పుడే ఆడపిల్లల పట్ల వివక్ష తొలిగిపోయి రాజ్యాంగం సూచించిన లింగ సమానత్వం సాధ్యమవుతుంది. దేశంలోనే మొదటిసారి బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలు బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేశాయి. వారి ఎదుగుదలకు దోహదపడ్డాయి.తల్లిదండ్రులకు ఆడపిల్లలంటే భారం కాదని, వారి పట్ల సానుకూల దృక్పథం కనబరిచేలా ఈ పథకం ఉపకరించింది. అంతేకాకుండా బాలిక విద్య కోసం ప్రత్యేక గురుకులాలను సైతం ఏర్పాటుచేశారు. తద్వారా అనేకమంది బాలికలు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత చదువులు చదివి రాణిస్తున్నారు. నేడు తక్షణమే బాలికలు, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలి. బాలికలకు సమాజంలో రక్షణ ఉందనే నమ్మకాన్ని కల్పించే బాధ్యత ప్రభుత్వం, పౌర సమాజం తీసుకోవాలి. అందుకే ఆడపిల్లని బతకనిద్దాం, చదవనిద్దాం. ఎదగనిద్దాం అనే నినాదంతో ముందుకెళ్లాలి.

## అడ్వైజర్లు, అనలిస్టులు అన్ని వివరాలు ఇవ్వాల్సిందే




పెట్టుబడి సలహాదారులు (ఐఏలు), పరిశోధన విశ్లేషకులు (ఆర్ఏలు) తమ సేవలకు సంబంధించి అన్ని నియమాలు, షరతులను ముందుగానే క్లయింట్లకు వెల్లడించాలని సెబీ ఆదేశించింది. సెబీతో సంప్రదింపుల అనంతరం పరిశ్రమకు చెందిన రీసెర్చ్ అనలిస్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఆర్ఏఏఎస్‌బీ) లేదా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఐఏఏఎస్‌బీ) అత్యంత ముఖ్యమైన నిబంధనలు, షరతులను (ఎంఐటీసీ) ఖరారు చేయాల్సి ఉంటుందని సెబీ తన సర్క్యులర్‌లో పేర్కొంది. ఆర్ఏలు జూన్ 30 నాటికి ఎంఐటీసీని ప్రస్తుత క్లయింట్లకు ఈ మెయిల్ లేదా మరో విధానంలో వెల్లడించాలని ఆదేశించింది. కొత్త క్లయింట్లతో ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. బ్యాంక్ బదిలీ లేదా యూపీఐ ద్వారా స్వీకరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 'స్థిర విధానంలో ప్రస్తుతం ఒక క్లయింట్ కుటుంబానికి వార్షిక ఫీజు పరిమితి రూ. 1,51,000. ఆస్తుల విలువలో అయితే ఏటా 2.5 శాతం మించకూడదు' అని సెబీ పేర్కొంది.

**పెనాల్టీలు వేయాల్సింది టెల్కోలపై కాదు: సీఓఏఐ**

స్పామ్ కాల్స్, మెసేజ్‌లను కట్టడి చేయడానికి టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ కొత్త నిబంధనలతో టెల్కోలకు పెనాల్టీలు గణనీయంగా పెరిగాయని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఓటీటీ కమ్యూనికేషన్ సర్వీసెస్‌కు ఎటువంటి నియంత్రణ లేకపోవడం వల్ల స్పామ్ సంఖ్య పెరుగుతోందని వెల్లడించింది. 'టెలికం ఆపరేటర్లు స్పామ్ కాల్స్, మెసేజ్‌లను అరికట్టడానికి పుష్కలంగా చర్యలు తీసుకున్నాయి. అయాచిత కమ్యూనికేషన్ల పరిమాణంలో గణనీయ పెరుగుదల, అలాగే న్యాయబద్ధ వాణిజ్య కమ్యూనికేషన్ అంతా ఓటీటీ కమ్యూనికేషన్ యాప్‌లకు మారింది. ఇది దేశంలో ఆర్థిక నేరాల పెరుగుదలకు దారితీసింది. టెలికం సర్వీస్ ప్రొవైడర్లపై పెనాల్టీలు ఏ ప్రయోజనాన్ని అందించవు. అవసరమైతే టెలిమార్కెటర్ డెలివరీ కంపెనీలు లేదా వాణిజ్య సమాచార ప్రసారాల వాస్తవ రూపకర్తలు, లబ్ధిదారులైన ప్రధాన సంస్థలపై ఈ పెనాల్టీలు వేయాలి' అని సీఓఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్.పి.కొచ్చర్ అన్నారు.

# రూ.250కే జన్‌నివేష్ సిప్


**ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఆవిష్కరణ**

**యోనోతోపాటు ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లపై లభ్యం**




తక్కువ మొత్తంతో మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడికి ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పరిష్కారం కొనుగొంది. జన్‌నివేష్ సిప్ పేరుతో రూ.250 నుంచి పెట్టుబడికి వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ దీన్ని ప్రారంభించారు. రూ.250 సిప్ తనకు అత్యంత ఇష్టమైన స్వప్నాల్లో ఒకటని బుచ్ పేర్కొన్నారు. ఈ తరహా అతి స్వల్ప పెట్టుబడుల ఉత్పత్తులు లక్షలాది మందికి సంపద సృష్టిలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. 'భారత్ వృద్ధి చెందే క్రమంలో సంపద సృష్టి జరుగుతుంది. చిన్న మొత్తాల రూపంలో అయినా ప్రతి ఒక్కరికీ అందాలి. జన్‌నివేష్ అంటే నా దృష్టిలో అర్థం ఇదే' అని మాధవి పేర్కొన్నారు. గతంలో బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు రూ.100, రూ.500 సిప్‌లు ప్రవేశపెట్టినప్పటికీ అధిక నిర్వహణ వ్యయాల కారణంగా వాటికి కొనసాగించలేకపోయినట్టు చెప్పారు. సూక్ష్మ సిప్‌లు ఆర్థికంగా లాభసాటి కావాలంటే, రెండేళ్లలోపే వాటికి సంబంధించి లాభం%–%నష్టంలేని స్థితి(స్టేబుల్‌గా ఉండేలా)ని సాధించేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. 'డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల సాయంతో రూ.250 సిప్ ద్వారా మొదటిసారి ఇన్వెస్టర్లు, అసంఘటిత రంగంలోని చిన్న మొత్తాల పొదుపరులను ఆకర్షించగలం' అని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో నందకిషోర్ ప్రకటించారు. అందరికీ ఆర్థిక సేవలను మరింత సమర్థవంతంగా చేరువ చేసే దిశగా తాము ఉత్పత్తుల అభివృద్ధి, ప్రక్రియలు, టెక్నాలజీలపై దృష్టి సారిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. యోనో యాప్‌తోపాటు పేటీఎం, జెరోదా, గ్రోవ్ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రతీ యూజర్ జన్‌నివేష్ సిప్‌ను పొందొచ్చని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది.

## పరుగు ఆపని పసిడి! తులం ఎంతంటే




ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరుగుతున్న బంగారం ధర త్వరలో తులం రూ.ఒక లక్షకు చేరుతుందని కొందరు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో మంగళవారం రోజున గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.79,700 (22 క్యారెట్స్), రూ.86,950 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. సోమవారం ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.300, రూ.330 పెరిగింది. చెన్నైలో మంగళవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.300, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.330 పెరిగింది. దీంతో గోల్డ్ రేటు రూ.79,700 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.86,950 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది. దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే పెరిగింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.300 పెరిగి రూ.79,850కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.330 పెరిగి రూ.87,100 వద్దకు చేరింది.

**వెండి ధరలు**

బంగారం ధరలు పెరుగుతున్నా వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు రాలేదు. మంగళవారం వెండి ధరలు స్థిరంగా ఉన్నాయి. కేజీ వెండి రేటు రూ.1,08,000 వద్ద ఉంది.

## నష్టాల్లో కదలాడుతున్న స్టాక్‌మార్కెట్ సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9:21 సమయానికి నిఫ్టీ 42 పాయింట్లు నష్టపోయి 22, 918కు చేరింది. సెన్సెక్స్ 83 పాయింట్లు దిగజారి 75,919 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 106.92 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 75.45 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.51 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాలతో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.01 శాతం నష్టపోయింది. నాస్‌డాక్ 0.41 శాతం పెరిగింది. ఎడాపెడా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్‌ఐఐ) అమ్మకాలతో ఆందోళన చెందుతున్న మదుపరులకు కాస్త ఊరటనిచ్చే ప్రయత్నం చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. పెట్టుబడులపై మంచి రాబడులను అందించే పటిష్ట స్థితిలో భారత ఎకానమీ ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగుతున్నారని ఆమె చెప్పారు. 'ఎఫ్‌ఐఐలు తమకు అనువైనప్పుడు లేదా లాభాలను స్వీకరించే అవకాశం ఉన్నప్పుడు వైదొలుగుతూ ఉంటారు. భారత ఎకానమీలో నేడు పెట్టుబడులపై మంచి రాబడులు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. దానికి తగ్గట్లే లాభాల స్వీకరణ కూడా జరుగుతోంది' అని తెలిపారు. ఎఫ్‌ఐఐలు గతేడాది అక్టోబర్ నుంచి రూ.1.56 లక్షల కోట్ల మేర స్టాక్స్ అమ్మగా.. ఇందులో ఏకంగా రూ.లక్ష కోట్ల స్టాక్స్ విక్రయాలు ఈ ఏడాది స్వల్ప కాలంలోనే నమోదవడం తెలిసిందే.

# పెట్రోలియం ధరల్లో హెచ్చుతగ్గులు

**మూడో నెలా ఎగుమతులు డౌన్**

**జనవరిలో 2.38 శాతం క్షీణత**

**36.43 బిలియన్ డాలర్లకు పరిమితం**

**23 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్య లోటు**

**గ్లోబల్ అనిశ్చితులు కారణం**




అంతర్జాతీయంగా అనిశ్చితి, పెట్రోలియం ధరల్లో తీవ్ర ఒడిదుడుకులతో వరుసగా మూడో నెలా భారత ఎగుమతులు క్షీణించాయి. జనవరిలో 2.38 శాతం తగ్గి 36.43 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. మరోవైపు, దిగుమతులు 10 శాతం పెరిగి 59.42 బిలియన్ డాలర్లకు చేరడంతో వాణిజ్య లోటు సుమారు 23 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్%–%జనవరి మధ్య కాలంలో ఎగుమతులు 1.39 శాతం పెరిగి 358.91 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 7.43 శాతం పెరిగి 601.9 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 242.99 కోట్లుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ ఇటు ఉత్పత్తులు, అటు సర్వీసుల ఎగుమతుల్లో భారత్ మెరుగ్గానే ఉంటోందని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాల్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఫార్మా, బియ్యం, రత్నాభరణాల్లాంటి రంగాలు జనవరిలో మెరుగైన వృద్ధి రేటు సాధించినట్లు వివరించారు. 2024–25లో భారత్ ఎగుమతులు 800 బిలియన్ డాలర్ల స్థాయిని దాటగలవని ధీమా వ్యక్తం చేశారు. 2023%–%24లో ఇవి 778 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

పసిడి దిగుమతులు 41 శాతం అప్..

దేశీయంగా డిమాండ్ నెలకొనడంతో జనవరిలో బంగారం దిగుమతులు 41% పెరిగి 2.68 బిలియన్ డాలర్లకు చేరాయి. గత జనవరిలో వీటి విలువ 1.9 బిలియన్ డాలర్లు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్%–%జనవరి మధ్య కాలంలో పసిడి దిగుమతులు 32 శాతం పెరిగి 37.85 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 50 బిలియన్ డాలర్లకు చేరాయి. సురక్షిత సాధనంగా బంగారంపై నమ్మకం, అంతర్జాతీయంగా అనిశ్చితుల వల్ల ఇన్వెస్టర్లు డైవర్సిఫికేషన్‌కి ప్రాధాన్యం ఇస్తుండటం, బ్యాంకుల నుంచి డిమాండ్ పెరగడం, కస్టమ్స్ సుంకాల తగ్గింపు మొదలైన అంశాలు పసిడి దిగుమతులు పెరగడానికి కారణమయ్యాయి.

జనవరిలో క్రూడాయిల్ దిగుమతులు 16.56 బిలియన్ డాలర్ల నుంచి 13.43 బిలియన్ డాలర్లకు తగ్గాయి. రత్నాభరణాల ఎగుమతులు 16 శాతం పెరిగి 3 బిలియన్ డాలర్లకు చేరగా, వెండి దిగుమతులు 83% పెరిగి 883 మిలియన్ డాలర్లకు చేరాయి. జనవరిలో సర్వీసుల ఎగుమతుల విలువ 31.01 బిలియన్ డాలర్ల నుంచి 38.55 బిలియన్ డాలర్లకు పెరిగాయి. సర్వీసుల దిగుమతులు 14.84 బిలియన్ డాలర్ల నుంచి 18.22 బిలియన్ డాలర్లకు పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 59 శాతం క్షీణించి 3.56 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కమోడిటీలు, మెటల్ ధరల్లో హెచ్చుతగ్గులతో పాటు టారిఫ్ యుద్ధాలు తదితర అంశాల కారణంగా ఎగుమతులపై ప్రభావం పడినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌ఐఈవో) ప్రెసిడెంట్ అశ్వని కుమార్ తెలిపారు. అయితే, వాణిజ్య లోటు, దిగుమతులు పెరగడమనేది దేశీ పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపవచ్చనే ఆందోళన నెలకొందని వివరించారు. వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం జనవరిలో కీలక వాణిజ్య భాగస్వామి అమెరికాకు ఎగుమతులు 39 శాతం పెరిగి 8.44 బిలియన్ డాలర్లకు చేరగా, దిగుమతులు 33 శాతం పెరిగి 3.57 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్%–%జనవరి మధ్య కాలంలో ఎగుమతులు సుమారు 9 శాతం వృద్ధి చెంది 68.46 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. 2023%–%24లో భారత్‌కి అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 119.71 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో 77.51 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు ఉండగా, 42.19 బిలియన్ డాలర్ల దిగుమతులు నమోదయ్యాయి. అమెరికాతో భారత్‌కి 35.31 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు నమోదైంది. ఇరు దేశాలు 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న సంగతి తెలిసిందే.

# రూ.80 వేలు ఇన్వెస్ట్ చేస్తే రూ.1.15 లక్షలు గ్యారెంటీ !




పోస్టాఫీస్ నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సీ) పథకాన్ని సురక్షితమైన, గ్యారెంటీ రాబడిని కోరుకునే వ్యక్తులు మంచి పెట్టుబడి ఎంపికగా చూస్తారు. ప్రభుత్వ పథకం కావడంతో రిస్క్ తక్కువగా ఉంటుందనే భావనే ఇందుకు కారణం. అయితే ఈ స్కీమ్‌లో ఎంత పెట్టుబడి పెడితే ఎంత మొత్తం సమకూరుతుందో చాలామందికి సరైన అవగాహన ఉండదు. దానికి సంబంధించిన విషయాలు తెలుసుకోవడంతోపాటు ఈ పథకం కీలక అంశాలను కింద చూద్దాం.

**పోస్టాఫీస్ ఎన్ఎస్‌సీ పథకం**

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సీ) అనేది భారతీయ తపాలా కార్యాలయం అందించే స్థిర ఆదాయ పెట్టుబడి పథకం. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద స్థిరమైన రాబడులు, పన్ను ప్రయోజనాల హామీతో చిన్న, మధ్యతరహా పెట్టుబడిదారులను పొదుపు చేయడానికి ప్రోత్సహించడానికి దీన్ని రూపొందించారు.

కీలక ఫీచర్లు..

రిస్క్‌లేని పెట్టుబడి: భారత ప్రభుత్వ మద్దతు ఉండడంతో ఎన్ఎస్‌సీను సురక్షితమైన పెట్టుబడి ఎంపికగా పరిగణిస్తున్నారు.

ఫిక్స్‌డ్ వడ్డీ రేటు: వడ్డీ రేటును ఏటా ఫిక్స్ చేసి కాంపౌండ్ చేస్తారు. 2024 మొదటి త్రైమాసిక కాలం నాటికి వడ్డీ రేటు ఏడాదికి 7.7 శాతంగా ఉంది.

పన్ను ప్రయోజనాలు: రూ.1.5 లక్షల వరకు పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది.

గరిష్ట పెట్టుబడి పరిమితి లేదు: పెట్టుబడిదారులు ఎన్ఎస్‌సీలో చేసే ఇన్వెస్ట్‌మెంట్‌కు గరిష్ట పరిమితి లేదు. ఎంతైనా పెట్టుబడి పెట్టుకోవచ్చు.

చక్రవడ్డీ: వడ్డీని ఏటా తిరిగి పెట్టుబడిగా పెడతారు. ఇది మెచ్యూరిటీ సమయంలో అధిక రాబడిని అందిస్తుంది.

కనీస పెట్టుబడి: కనీస పెట్టుబడి మొత్తం రూ.1,000.

ఐదేళ్ల తరువాత ఎంత వస్తుంది?

ఐదేళ్ల కాలపరిమితికి ఎన్ఎస్‌సీ పథకంలో పెట్టుబడి చేస్తే రూ.80,000 ఇన్వెస్ట్‌మెంట్‌కు మెచ్యూరిటీ మొత్తం కింది విధంగా ఉంటుంది.(రూ.ల్లో)

| ఏడాది | అసలు | వడ్డీ | మొత్తం |
|---|---|---|---|
| 1 | 80,000 | 6,160 | 86,160 |
| 2 | 86,160 | 6,633 | 92,793 |
| 3 | 92,793 | 7,145 | 99,938 |
| 4 | 99,938 | 7,695 | 1,07,633 |
| 5 | 1,07,633 | 8,286 | 1,15,919 |

**పేరు మార్చుకుంటే రూ.8,600 కోట్లు ఆఫర్!**

ఎక్స్(గతంలో ట్విటర్) సీఈఓ ఎలాన్ మస్క్ వికీపీడియా పేరు మార్చుకుంటే ఏకంగా ఒక బిలియన్ అమెరికన్ డాలర్లు(రూ.8,600 కోట్లు) ఇస్తానని ఆఫర్ చేశారు. గతంలో ఈమేరకు వికీపీడియా పేరు మార్పునకు సంబంధించి ఒక బిలియన్ డాలర్లు చెల్లిస్తానని చెప్పారు. తాజాగా ఓ నెటిజన్ మస్క్‌ను 'ఈ ఆఫర్? ఇంకా ఉందా' అని ప్రశ్నించారు. దాంతో మస్క్ తన ట్విటర్‌లో స్పందిస్తూ 'ఆఫర్ ఉంది. రండి.. పేరు మార్చండి' అంటూ అదే విషయాన్ని మళ్లీ ధ్రువీకరించారు.

**వివాదం నేపథ్యం**

వికీపీడియాతో కొనసాగుతున్న వైరంలో భాగంగా మస్క్ ఈ ఆఫర్ ప్రకటించారు. వికీపీడియా ఆర్థిక పద్ధతులు, రాజకీయ పక్షపాతం కారణంగా మస్క్ ఈ విమర్శలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో వికీపీడియాను 'వేక్పీడియా' అని సంబోధించిన ఆయన, తన అనుచరులు ఈ వేదికకు విరాళాలు ఇవ్వడం మానేయాలని కోరారు. వికీమీడియా ఫౌండేషన్ తన నిధులను ముఖ్యంగా డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్ క్లూజన్ (డీఈఐ) కార్యక్రమాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో మస్క్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. మస్క్ వికీపీడియాపై గతంలో చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నారా అని నెటిజన్లు వేసిన ప్రశ్నలకు మస్క్ సూటిగా స్పందించారు. వికీపీడియా పేరు మార్పునకు సంబంధించి 'ఈ ఆఫర్ ఇప్పటికీ ఉందా?' అని మస్క్‌ను ట్విటర్‌లో కోట్ చేస్తూ జాన్స్ మీమ్స్ అనే యూజర్ చేసిన ట్వీట్‌కు సమాధానంగా మస్క్ స్పందించారు. 'ఆఫర్ ఇంకా ఉంది. రండి, పేరు మార్చండి..' అని తెలిపారు. వికీపీడియాకు 'డికిపీడియా'గా పేరు మార్పును ప్రతిపాదించారు.

**నెటిజన్ల స్పందన**

మస్క్ ఆఫర్‌కు సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందన వస్తోంది. కొంతమంది వికీపీడియా నిధుల నిర్వహణపై మస్క్‌కు ఏం సంబంధం? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇంకొందరు లాభాపేక్ష లేని సంస్థలు తమ వద్ద ఉన్న వనరులను ఎలా నిర్వహిస్తున్నాయనే దానిపై అందరి దృష్టిని ఆకర్షిస్తున్నట్లు చెబుతున్నారు. మస్క్ విమర్శలు కొనసాగుతున్నప్పటికీ వికీపీడియా నమ్మదగిన, పారదర్శక ప్లాట్‌ఫామ్ అని పేర్కొంటూ సంస్థ వ్యవస్థాపకుడు జిమ్మీ వేల్స్ తెలిపారు. అయితే మస్క్ ప్రతిపాదనపై మాత్రం ఏవిధంగానూ స్పందించలేదు.

# భారత్‌లో ప్రవేశించేందుకు సిద్ధమవుతున్న టెస్లా



ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పునరుత్పాదక ఇంధన రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న టెస్లా ఇంక్ భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ల మధ్య సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో కొన్ని వాణిజ్య అంశాలపై చర్చించారు. అందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. దాంతో త్వరలో దీనిపై నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు సమాచారం. ఈ అనుమానాలకు ఊతమిచ్చేలా ముంబై, ఢిల్లీలో కస్టమర్ ఫేసింగ్, బ్యాకెండ్ పొజిషన్లలో పని చేసేందుకు 13 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు టెస్లా ప్రకటించింది. దాంతో టెస్లా భారత్‌లో ప్రవేశించేందుకు అడ్డంకులు తొలిగే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**వ్యూహాత్మక ఎత్తుగడ..**

టెస్లా భారతదేశంలో నియామకాలు చేపట్టాలని తీసుకున్న నిర్ణయం దేశంలో తన ఉనికిని స్థాపించే దిశగా ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు. సర్వీస్ టెక్నీషియన్, టెస్లా అడ్వైజర్, ఇన్‌సైడ్ సేల్స్ అడ్వైజర్, స్టోర్ మేనేజర్, బిజినెస్ ఆపరేషన్స్ అనలిస్ట్ వంటి పోస్టులను ఈ మేరకు భర్తీ చేయనున్నారు. హైఎండ్ కార్లపై దిగుమతి సుంకాన్ని భారతదేశం ఇటీవల 110% నుంచి 70%కు తగ్గించిన తరువాత ఇలా నియామకాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. టెస్లా వంటి లగ్జరీ కార్ల తయారీదారులు మార్కెట్లోకి ప్రవేశించడం ఆర్థికంగా మరింత లాభదాయకంగా మారనుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

**భారత మార్కెట్లో అవకాశాలు**

చైనా వంటి దేశాలతో పోలిస్తే భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ ఇంకా తక్కువగానే ఉంది. 2024లో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 1,00,000 యూనిట్లకు దగ్గరగా ఉన్నందున భారత ప్రభుత్వం ఈ రంగంలో మరింత వృద్ధి తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. అందుకోసం ఎలక్ట్రిక్ వాహన తయారీదారులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ వ్యవహారం టెస్లాకు గణనీయమైన అవకాశాన్ని అందించనుంది. 2070 నాటికి నికర సున్నా ఉద్గారాలను సాధించడానికి దేశం కట్టుబడి ఉంది. అందుకోసం సుస్థిర ఇంధన పరిష్కారాలను ప్రోత్సహించడంలో భాగంగా టెస్లా వంటి కంపెనీలకు కేంద్రం ఆమోదముద్ర వేసే అవకాశాలు కనిపిస్తున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**స్టార్ లింక్‌కు గ్రీన్ సిగ్నల్..?**

ఇటీవల మస్క్–మోదీల మధ్య జరిగిన సమావేశం అనంతరం మస్క్‌కు చెందిన శాటిలైట్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ స్టార్ లింక్ భారత మార్కెట్లోకి ప్రవేశించడంపై కూడా చర్చ జరుగుతుంది. ట్రాయ్ ఆంక్షల కారణంగా స్టార్ లింక్ భారత్‌లోకి ప్రవేశించడం ఆలస్యం అవుతుంది. అయితే మోదీ, మస్క్ ఇద్దరూ ఈ సమస్యలను పరిష్కరించడానికి ఆసక్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్టార్ లింక్ లైసెన్సింగ్ సవాళ్ల పరిష్కారానికి భారత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇది రెండు దేశాల మధ్య సాంకేతిక సహకారాన్ని పెంపొందించడానికి మార్గం సుగమం చేస్తుందని కొందరు అధికారులు తెలియజేస్తున్నారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332